thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 11 కరీంనగర్ శనివారం, 22 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఆస్ట్రేలియా విద్యార్థి వీసా నిబంధనలు కఠినతరం

న్యూఢిల్లీ : వివిధ దేశాల్లో విదేశీ విద్యార్థులకు నిర్దేశించిన నిబంధనల్లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఆయా దేశాల్లో వివిధ విశ్వవిద్యాలయాల క్యాంప్‌సల ఎంపికను ఈ మార్పులు ప్రభావితం చేస్తాయి. ఈ మధ్య కాలంలో ఆస్ట్రేలియాను ఎంపిక చేసుకొనే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. 2004లో 1,18,109 మంది విద్యార్థులు ఆస్ట్రేలియాలోని పలు విశ్వవిద్యాలయాలను ఎంపిక చేసుకొన్నారు. తమ విద్యార్థి వీసా నిబంధనల్లో పేర్కొనదగ్గ మార్పులను చేయనున్నట్లు గత ఏడాది ఆస్ట్రేలియా ప్రకటించింది. ఇప్పటి వరకూ ఆ దేశానికి వెళ్లే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి లేదు. తాజాగా పరిమితి విధించాలని నిర్ణయించినట్లు సమాచారం.

# ఈ ఉగాది నిరుద్యోగులకు అసలైన పండుగ!





## 55 వేల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు..

## శాఖల వారీగా లెక్కలివే!

హైదరాబాద్ : నిరుద్యోగులకు తెలుగు సంవత్సరం సందర్భంగా తెలంగాణ సర్కారు గుడ్ న్యూస్ చెప్పనుంది. ఉగాది పండగ తర్వాత రాష్ట్రంలో మరో 55,418 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు సర్కారు ప్లాన్ చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబరు నుంచి ఇప్పటి వరకు వివిధ శాఖల్లో 58,868 పోస్టులను భర్తీ చేసింది. అయితే గత కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న కారుణ్య నియామకాలను రాబోయే నోటిఫికేషన్ లో భర్తీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

**మొత్తం 61,579 పోస్టుల భర్తీ...** ఇప్పటికే మహిళా, శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన 6,399 అంగన్వాడీ టీచర్, 7,837 హెల్పర్ పోస్టులు, రెవెన్యూ శాఖలో 10,954 గ్రామ పరిపాలన అధికారుల నియామకాల నోటిఫికేషన్ త్వరలోనే విడుదల చేయనున్నారు.

వీటితోపాటు ఆయా శాఖల్లో మరో 30,228 పోస్టులను భర్తీ చేయాలని భావిస్తున్నారు. అలాగే గ్రూప్-1, 2, 3ల్లో ఎంపికైన 2,711 మందికి త్వరలోనే నియామక పత్రాలు అందించి.. కాంగ్రెస్ ప్రభుత్వం15 నెలల కాలంలో 61,579 పోస్టులను భర్తీ చేసినట్లు ప్రజలకు చూపించాలని భావిస్తోంది.

**జాబ్ క్యాలెండర్ ప్రకారం..** ఇక జాబ్ క్యాలెండర్ ప్రకారం.. 55,418 పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చి వాటిని భర్తీ చేస్తే మొత్తం 1.16 లక్షల ఉద్యోగాల ప్రక్రియ పూర్తికానుంది. ఇక అంగన్వాడీ 14,236 పోస్టుల భర్తీకి సంబంధించిన ఫైలుపై ఆ శాఖ మంత్రి సీతక్క ఇప్పటికే సంతకం చేశారు. దీంతో ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ పక్కాగా రానున్నాయి. అలాగే గ్రామ పరిపాలన అధికారి (GPO) పేరుతో10,954 ఉద్యోగాలను ఇవ్వాలని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు. ఈ ప్రక్రియ త్వరలోనే మొదలుకానుంది. ఇప్పటికే వీఆర్వోలుగా పని చేసి ప్రస్తుతం వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న 6000 మందిని జీపీవోలుగా నియమించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వీటితోపాటు మరో 4 వేలకుపైగా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఇక స్కిల్ యూనివర్సిటీ, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్ ఇనిస్టిట్యూట్ లలో అవసరమైన పోస్టులను భర్తీ చేయనున్నారు.


ఆర్థిక, న్యాయ శాఖ, సచివాలయం, సమీకృత గురుకులాల్లో దాదాపు 30,228 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఇప్పటికే వీటి భర్తీకోసం ఆర్థిక శాఖతో చర్చలు జరిపిందని, త్వరలోనే శాఖలవారీగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.

## ఒకే వేదికను పంచుకోబోతున్న సీఎం రేవంత్, కేటీఆర్.. ఎక్కడో తెలుసా?



తెలంగాణ రాజకీయాల్లో ఆ ఇద్దరు బద్ధ శత్రువులు. విమర్శలు, ఆరోపణలు, నిందలు, కేసులు ఇలా ఇద్దరి మధ్య ప్రతిరోజు ఏదో ఒక వాదన. ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే అంత రాజకీయ వైరుధ్యం. తెలుగు రాష్ట్రాల్లో అందరికీ తెలిసిన ఆ ఇద్దరే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. కానీ ఆసక్తికరంగా ఈ ఇద్దరు నేతలు ఒకే వేదికను పంచుకోబోతున్నారు. అది కూడా ఒకే అంశానికి మద్దతు ఇస్తూ... రాజకీయంగా భిన్న దృవాలుగా ఉన్న రేవంత్, కేటీఆర్.. ఒక అంశంలో ఒకే వాయిస్ వినిపించబోతున్నారు. ఈ సమావేశానికి చెన్నై వేదిక కాబోతోంది. డీలిమిటేషన్ తో దక్షిణాదికి నష్టం కల్గుతుందనే టాక్ వస్తోంది. ఈ విషయంలో బీజేపీతో పోరాటం చేస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్.. చెన్నైలో కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ భేటీకి బీజేపీ వ్యతిరేక పార్టీలను ఆహ్వానించారు. స్టాలిన్ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. బీఆర్ఎస్ నుంచి కేటీఆర్ వెళుతున్నారు. ఇద్దరు నేతలు ఒకే వేదిక పంచుకోనుండటం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిగా మారింది. శనివారం(మార్చి 22) జరగబోయే సౌత్ ఇండియా జేఏసీ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఇద్దరు హాజరవుతారు. పార్లమెంట్ నియోజకవర్గల పునర్విభజనలో దక్షిణ భారత రాష్ట్రాలకు జరగనున్న అన్యాయంపై తమిళనాడు సీఎం స్టాలిన్ ఒక జేఏసీ ఏర్పాటు చేశారు.

అందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మాజీ మంత్రి కేటీఆర్ను కూడా ఆహ్వానించారు. ఈ ఇద్దరు నేతలు శుక్రవారం సాయంత్రం బయలుదేరి చెన్నై చేరుకుంటారు. అక్కడ జరిగే సౌత్ ఇండియా జేఏసీ సమావేశంలో ఒకే వేదికపై ఇద్దరు కూర్చుంటారు. అదే వేదికపై షేక్ అండ్ ఇచ్చుకునే అవకాశం కూడా ఉంది. నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై కేటీఆర్, రేవంత్ రెడ్డి గళం విప్పనున్నారు. ఒకే అంశానికి మద్దతిస్తూ ఈ ఇద్దరు నేతలు మాట్లాడుతున్న ఒక వేదిక ఇప్పటివరకు ఇదే మొదటిది. ఇప్పటికే రాజకీయ వర్గాల్లో దీనిపై ఆసక్తి నెలకొంది. సౌత్ ఇండియా జేఏసీ స్టేజ్పై చెన్నైలో ఇద్దరు పలకరించుకుంటారా..? షేక్ అండ్ ఇచ్చుకుంటారా..? ఇద్దరు ప్రసంగాల్లో ఒకరి పేరు ఒకరు తీసుకుంటారా? ఇలా చాలా రకాలుగా చర్చలు జరుగుతున్నాయి.ఇప్పటివరకు వరకు కూడా ఇద్దరి మధ్య ఉప్పు నిప్పుల మాటల యుద్ధం జరుగుతోంది. వ్యక్తిగతంగా కూడా తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. పరిధి దాటి ఆరోపణలు%ా% కుటుంబాలపై కూడా బురద జల్లడాలు. ఇలాంటి సమయంలో ఈ ఇద్దరు రాజకీయ శత్రువులు ఒకే వేదికపై షేక్ అండ్ ఇచ్చుకుంటే, నవ్వుతూ పలకరించుకుంటే.. ఆత్మీయంగా మాట్లాడుకుంటే ఎలా ఉంటుందనేది చాలా ఇంట్రెస్టింగ్గా మారింది.



## ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ పురోగతిపై హైకోర్టులో విచారణ

హైదరాబాద్: ప్రజాప్రతినిధులపై కేసుల విచారణ పురోగతిపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ అంశంపై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం శుక్రవారం విచారించింది. మాజీ ఎంపీ హరిరామజోగయ్య దాఖలు చేసిన ప్రయోప్రయోజన వ్యాజ్యాన్ని కలిపి విచారణ జరిపింది. జగన్‌పై నమోదైన సీబీఐ, ఈడీ కేసులను వేగంగా విచారించాలని హరిరామజోగయ్య గతంలో ఫిర్యాదు చేశారు. తెలంగాణలోని వివిధ కోర్టుల్లో ప్రజాప్రతినిధులపై 309కి పైగా కేసులున్నాయని ఏఏజీ కోర్టుకు తెలిపారు. విచారణలో పురోగతిపై కౌంటర్ దాఖలకు సమయం కోరారు. విచారణ వేగవంతం చేయాలని హైకోర్టు ఆదేశించిందని హరిరామజోగయ్య తరపు న్యాయవాది తెలిపారు. మార్చి 31వరకు ఉన్న కేసుల పురోగతి తెలపాలని ఏఏజీకి ఆదేశించిన ప్రత్యేక ధర్మాసనం.. అందుకు నాలుగు వారాల సమయం ఇచ్చింది.

## సన్న బియ్యం పంపిణీకి రెడీ..

## ఉగాది కానుకగా సీఎం చేతుల మీదుగా శ్రీకారం!

## వచ్చే నెల నుంచి రేషన్ షాపుల ద్వారా జనానికి




హైదరాబాద్ : రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు జిల్లాల్లో సివిల్ సప్లై ఆఫీసర్లు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉగాది కానుకగా ఈ పథకానికి సీఎం రేవంత్‌రెడ్డి మట్టపల్లిలో ప్రారంభి స్తారనే ఏప్రిల్ నెల నుంచి సన్నబియ్యం అందించేందుకు వీలుగా స్టాక్ పాయింట్లకు సన్నబియ్యం నిల్వలు చేరుతున్నాయి. ప్రభుత్వం నుంచి అందిన అంతర్గత ఆదేశాల మేరకే సివిల్ సప్లై ఆఫీసర్లు సన్నబియ్యం మరాడించి తెప్పించి, రెడీగా ఉంచుతున్నట్లు తెలిసింది.

**ఏడాదికి 22 లక్షల టన్నులకుపైనే..** తెలంగాణ వ్యాప్తంగా ప్రస్తుతం 89.96 లక్షల రేషన్ కార్డులు ఉండగా, 2,81,71,000 మంది లబ్ధిదారులు ఉన్నారు. కొత్తగా మరో 10 లక్షల రేషన్ కార్డులు మంజూరు అయ్యే అవకాశం ఉందని ఆఫీసర్లు చెప్తున్నారు. ఈ లెక్కన అదనంగా 30 లక్షల మంది లబ్ధిదారులు పెరుగుతారు. వీరికి ఏడాదికి దాదాపు 22 నుంచి 24 లక్షల టన్నుల బియ్యం అవసరమవుతాయని అంచనా. వానకాలం సీజన్‌లో ప్రభుత్వం 24 లక్షల టన్నుల సన్న వడ్లను సేకరించింది. సివిల్ సప్లై శాఖ ఆధ్వర్యంలో వడ్ల మిల్లింగ్ వేగంగా సాగుతోంది. వానాకాలంలో సేకరించిన వడ్ల?ద్వారా గరిష్టంగా 15 నుంచి 16 లక్షల టన్నుల సన్న బియ్యం అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ఈ ఏడాది చివరికల్లా సన్నబియ్యం తక్కువ పడితే మరో 6 నుంచి 8 లక్షల టన్నుల బియ్యాన్ని యాసంగిలో సేకరించే వడ్ల ద్వారా సమకూర్చుకుంటామని సివిల్?సప్లై ఆఫీసర్లు చెప్తున్నారు.

**60 శాతం దొడ్డుబియ్యం పక్కదారి..** రేషన్ షాపుల ద్వారా ఇప్పటిదాకా పంపిణీ చేస్తున్న దొడ్డు బియ్యాన్ని చాలా మంది తినడం లేదు. సుమారు 60 శాతం బియ్యం పక్కదారి పడుతున్నాయి. రేషన్ షాపుల దగ్గర వ్యాపారులు దొడ్డు బియ్యాన్ని కొనుగోలు చేసి కోళ్ల దాణా, లిక్కర్ తయారీ కోసం తరలిస్తున్నారు. దీంతో సన్న బియ్యానికి డిమాండ్ ఎక్కువ కావడంతో రేట్లు బాగా పెరిగిపోయాయి. రేషన్ బియ్యం పక్కదారి పట్టడంతో పాటు లబ్ధిదారులు కూడా తినడం లేదన్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం రేషన్ కార్డులు ఉన్న వారికి సన్నబియ్యం ఇస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా 2024 వానాకాలం సీజన్‌లో సన్న వడ్ల పంటను పెంచేందుకు క్వింటాల్?కు రూ. 500 బోనస్ ప్రకటించింది. సన్న బియ్యం పంపిణీ చేయడం వల్ల దొడ్డు బియ్యం రీసైక్లింగ్‌కు కూడా అడ్డుకట్ట పడుతుందని ఆఫీసర్లు భావిస్తున్నారు. దొడ్డు బియ్యాన్ని తక్కువ రేటుకు కొని కొందరు మిల్లర్లు రీసైక్లింగ్ చేసి కస్టమ్ మిల్లింగ్ కింద ప్రభుత్వానికే అప్పగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**స్టాక్ పాయింట్లకు సన్నబియ్యం...** వానాకాలం సీజన్‌లో జిల్లాల్లో సేకరించిన సన్నవడ్లను నూక కాకుండా మూడు నెలల తర్వాత మరాడించడం ప్రారంభించిన అధికారులు, వాటిని స్టాక్‌పాయింట్లకు చేరుస్తున్నారు. కొన్ని జిల్లాల్లో సరిపడా ధాన్యం దిగుబడులు రాకపోవడం, ఇంకొన్ని జిల్లాల్లో దొడ్డు వడ్లు ఎక్కువగా పండించడంతో ఆయా జిల్లాలకు ఇతర జిల్లాల నుంచి సన్నబియ్యం తెప్పించి నిల్వచేస్తున్నారు. ఉదాహరణకు యాదాద్రి జిల్లాలో 2,16,841 రేషన్ కార్డులు ఉండగా 6.60 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 4 వేల టన్నులు బియ్యం అవసరం. కాగా, ఈ జిల్లాలో రెండు సీజన్లలోనూ దొడ్డు రకాలే ఎక్కువగా పండిస్తారు. రైతుల సొంత అవసరాలకు మాత్రమే కొద్దిగా సన్నాలు వేసుకుంటారు. 2024 వానాకాలం సీజన్‌లో బోనస్ ప్రకటనతో జిల్లాలో 35 వేల ఎకరాల్లో సాగు చేశారు. జిల్లా అవసరాలకు ఈ బియ్యం సరిపోవన్న ఉద్దేశంతో సూర్యాపేట జిల్లా నుంచి యాదాద్రికి సన్న వడ్లను కేటాయించారు. వీటికితోడు జనగామ తదితర జిల్లాల నుంచి సన్నబియ్యాన్ని జిల్లాకు పంపారు. ఇప్పటికే హాస్టల్స్, గురుకులాలు, మిడ్ డే మీల్స్‌కు సన్నబియ్యం అందిస్తున్నారు. ఈ నెల రేషన్ కింద స్టాక్ పాయింట్ల నుంచి సన్నబియ్యాన్ని అందిచేందుకు సిద్ధం చేశారు.




హైదరాబాద్: గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులకు టోల్ విధించే ఆలోచన లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శాసనసభలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన 40 శాతం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. వారికి ఆరు నెలలు లేదా మూడు నెలలకు చెల్లిస్తామన్నారు. ప్రతి గ్రామం నుంచి మండలానికి డబుల్ రోడ్లు వేయిస్తామని తెలిపారు. భారాస హయాంలో సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌కే రోడ్లు వేశారని చెప్పారు. ఆ మూడు చోట్ల రోడ్లకు చివరికి సింగరేణి నిధులు కూడా వాడారని పేర్కొన్నారు. ఛాలెంజ్ చేస్తున్నా.. రాష్ట్రమంతా తిరిగి చూద్దామా అని హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. కోమటిరెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. భారాస హయాంలో ఆర్అండ్‌బీ పనుల గురించి లెక్కలు తీద్దామన్నారు. రోడ్ల గురించి ఒకరోజు ప్రత్యేకంగా చర్చిద్దామని చెప్పారు.

## తెలంగాణ రాజకీయాల్లో సంచలనం.. రేవంత్ రెడ్డితో హరీష్ రావు భేటీ



తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీష్ రావు, పద్మారావు గౌడ్ లు భేటీ అయ్యారు. శుక్రవారం అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో దాదాపు 15 నిమిషాల పాటు సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ పాటించట్లేదని ఈ సందర్భంగా వారు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. మరోవైపు.. గంట క్రితమే అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, హరీష్ రావుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు విమర్శలు చేస్తే.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై సీఎం రేవంత్ రెడ్డి రెచ్చిపోయారు. ఇది జరిగిన కాసేపటికే ఇరువురు కలిసి ప్రొటోకాల్ అంశంపై చర్చించుకోవడం ఆసక్తిగా మారింది. రాజకీయాలు ఇలాగే ఉండాలని.. పార్టీల మధ్య వైరం ఉన్నా.. నియోజకవర్గ సమస్యల విషయంలో అవేమీ పట్టించుకోవద్దని.. ఇది మంచి పరిణామం అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## నిమిషానికి రూ.కోటికిపైగా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేస్తోంది: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ అప్పు రూ.8.6 లక్షల కోట్లుగా ఉందని భాజపా శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రోజుకు రూ.1700 కోట్లకుపైగా కాంగ్రెస్ సర్కారు అప్పు చేస్తోందని విమర్శించారు. బడ్జెట్‌పై శాసనసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. "నిమిషానికి రూ.కోటికిపైగా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేస్తోంది. రాష్ట్రంలో ఒక్కో వ్యక్తిపై రుణభారం రూ.2.27 లక్షలుగా ఉంది. పెద్ద ఎత్తున రుణాలుంటే తెలంగాణ ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పాలి. యూపీఏ కంటే ఎన్డీఏ హయాంలో ఆర్థిక సంఘం నిధులు పెరిగాయి. యూపీఏ హయాంలో రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో 32 శాతం వాటా ఉండేది.

అప్పుడు కేంద్ర పన్నుల్లో వాటా 2-3 శాతం కూడా పెంచలేదు. మోదీ ప్రభుత్వం వచ్చాక కేంద్ర పన్నుల్లో వాటా 10 శాతం పెంచి 42 శాతం చేశారు. పన్నుల్లో వాటా పెంచాక కూడా కేంద్రాన్ని విమర్శించడం సరికాదు" అని ఆయన అన్నారు.

## బయ్యారంలో ఉక్కు పరిశ్రమ పెట్టరు...




హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ పెట్టరని, ఆదిలాబాద్‌లో సీసీఐ ఫ్యాక్టరీ వేలానికి పెడ్తతారని.. బీజేపీ నుండి ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఒక్కరూ నోరు తెరిచి దీని గురించి మాట్లాడరని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది ఎంపీలు, 64 మంది ఎమ్మెల్యేలు ఒక్కరూ ఈ అన్యాయాన్ని ప్రశ్నించరని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు కావాలని అడగరని..ఉన్న పరిశ్రమలను ఉంచాలని కోరరని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూల్చే పనిలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, తూకానికి అమ్మే పనిలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉందని విమర్శించారు. మంటికైనా ఇంటోడే కావాలని ఊరికే అనలేదన్నారు.

ఈ కాంగ్రెస్, బీజేపీలకు ఎప్పటికీ ఓట్లు, సీట్లే ముఖ్యమని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలు, తెలంగాణ అభివృద్ధి, తెలంగాణ ఆకాంక్షలు ఈ పార్టీలకు పట్టవని అన్నారు.

**శనివారం చెన్నైకు కేటీఆర్..** కాగా కేటీఆర్ శనివారం చెన్నై పర్యటనకు వెళ్లనున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన జరిగే దక్షిణాది రాష్ట్రాల నాయకుల సమావేశానికి ఆయన హాజరవుతున్నారు.

కేటీఆర్‌తో పాటు చెన్నైకు మాజీ ఎంపీ వినోద్, బీఆర్ఎస్ ఎంపీలు వెళుతున్నారు.

## పదో తరగతి పరీక్షల తొలిరోజే అధికారుల నిర్లక్ష్యం.. మారిన పేపర్




మంచిర్యాల: తెలంగాణలో పదో తరగతి పరీక్షలు మొదలయ్యాయి. అయితే పరీక్షలు ప్రారంభమైన తొలిరోజే అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. ఒక ప్రశ్నా పత్రానికి బదులు మరో ప్రశ్నాపత్రం ఇవ్వడంతో పరీక్ష రెండు గంటలు ఆలస్యంగా మొదలైంది. ఒక సబ్జెక్ట్‌కు ప్రిపేర్ అయితే మరో సబ్జెక్ట్ పేపర్ రావడంతో విద్యార్థులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని అక్కడి అధికారులకు తెలియజేయంతో జరిగిన తప్పిదాన్ని గుర్తించారు. వెంటనే మరో పేపర్ తెప్పించి పరీక్ష రాయించారు. అయితే అప్పటికే రెండు గంటలు గడిచిపోయింది. మంచిర్యాల జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో దాదాపు రెండు గంటలు ఆలస్యంగా పదో తరగతి పరీక్షలు మొదలయ్యాయి. ఉదయం విద్యార్థులంతా పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష హాల్లో తమకు కేటాయించిన సీట్లలో కూర్చుకున్నారు. పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యాయి. అక్కడి ఇన్విజిలేటర్లు ప్రశ్నాపత్రాన్ని విద్యార్థులకు ఇచ్చారు. అయితే ఆ ప్రశ్నాపత్రాన్ని చూసి విద్యార్థులంతా అవాక్కయ్యారు. ఏంటిది అంటూ ఒకింత భయాందోళనకు గురయ్యారు. ఒక ప్రశ్నాపత్రానికి బదులుగా మరో పేపర్‌ను అధికారులు పంపిణీ చేశారు. విద్యార్థులు దాన్ని గుర్తించి చెప్పడంతో అధికారులు హైరానా పడ్డారు. హడావుడిగా మరో పేపర్ తెప్పించడంతో దాదాపు రెండు గంటలు ఆలస్యంగా విద్యార్థులు పరీక్ష రాశారు.

**కలెక్టర్ సీరియస్...** అయితే ప్రశ్నాపత్రం తారుమారైన విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో ప్రశ్నాపత్రాల విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం, పరీక్ష ఆలస్యంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఒక ప్రశ్నాపత్రం బదులు మరో పేపర్ రావడంతో వెంటనే విచారణ జరిపి నివేదిక అందించాల్సిందిగా డీఈవోకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాల విషయంలో అధికారుల నిర్లక్ష్యం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## వైఎస్ వివేకా హత్య కేసు.. తెలంగాణ హైకోర్టులో సునీత పిటిషన్

హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణపై తెలంగాణ హైకోర్టులో వివేకా కుమార్తె సునీత పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ఆమె సీబీఐని ప్రతివాదిగా చేర్చారు. సీబీఐ కోర్టులో తన తండ్రి హత్య కేసును రోజువారీగా విచారించేలా ఆదేశించాలని పిటిషన్‌లో ఆమె కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రస్తుతం ఈ కేసు సీబీఐ కోర్టులో విచారణలో ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటికే దాదాపు నాలుగేళ్లుగా ఈ కేసు విచారణ కొనసాగుతున్నా.. పురోగతి ఏమీ లేదని సునీత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టులో విచారణ సందర్భంగా సునీత తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. 2019 మార్చి 14న అర్ధరాత్రి ఈ హత్య చోటుచేసుకుందని.. సీబీఐ అధికారులు విచారణ చేపట్టి ఇప్పటికే రెండు ఛార్జిషీట్‌లు దాఖలు చేశారన్నారు. ఇంకా సీబీఐ కోర్టులోనే విచారణ కొనసాగుతోందని.. దీన్ని ఆరు నెలల్లోగా ముగించేలా కోర్టును ఆదేశించాలని హైకోర్టును కోరారు. సీబీఐ అధికారులు ఇప్పటికే కొన్ని పత్రాలకు సంబంధించి హార్డ్ డిస్క్‌లో ప్రతివాదుల తరఫు న్యాయవాదులకు ఇచ్చారని.. అయితే, హార్డ్‌డిస్క్‌లో ఉన్న కాపీలు ఓపెన్ కావడంలేదు గనక నేరుగా ప్రింటింగ్ ప్రతులు కావాలని వారు కోరిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే, లక్షల సంఖ్యలో పేజీలు ఉండటంతో ప్రింటింగ్‌కాపీలు ఇవ్వడం కుదరదు గనక హార్డ్ డిస్క్‌లను ఓపెన్ చేయాలని సీబీఐ అధికారులు చెబుతుండటంతో.. దాదాపు 15 నెలలుగా విచారణ ముందుకు సాగడంలేదని సునీత న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, సునీత ప్రధానంగా సీబీఐ అధికారులతో పాటు తన తండ్రి హత్య కేసులో నిందితులుగా ఉన్నవారందరినీ ప్రతివాదులుగా చేర్చారు. ఈ అంశంపై విచారణ జరిపిన ప్రత్యేక ధర్మాసనం సీబీఐతో పాటు ఈ కేసులో నిందితులందరికీ నోటీసులు వ్యక్తిగతంగా నోటీసులు ఇచ్చేందుకు సునీత న్యాయవాదికి అనుమతి ఇచ్చింది. ఈ కేసు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.




హైదరాబాద్ : గత కొద్ది రోజులుగా తీవ్రమైన ఎండలతో సతమతమవుతున్న తెలంగాణ ప్రజలకు మరో ప్రమాదం పొంచి ఉంది. రానున్న నాలుగు రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా వడగండ్ల వానలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరిస్తుంది. ఆదిలాబాద్ కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, ములుగు, వరంగంల్ జిల్లాల్లో వడగండ్ల వానలు ప్రభావం ఉంటుందని తెలిపింది. శుక్ర శనివారాల్లో ఉరుములు మెరుపులు,ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వానలు కురుస్తాయని ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. గురువారం ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో వర్షాలు మెల్లగా ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల పిడుగులు పడ్డాయి. మార్చి 22 నుంచి వర్షాలు ఉరుములతో కూడిన తుపాను వర్షాలు కురుస్తాయి. వచ్చే 2-4గంటల్లో నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్‌లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే ఛాన్స్ ఉంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి. మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆసిఫాబాద్, జగిత్యాల, సిరిసిల్లలో రాత్రిపూట తుఫానులు ప్రభావం ఉంటుంది. గురువారం రాత్రి తెలంగాణలో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలుపడే అవకాశం ఉంది. తెలంగాణలోని సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి,ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నలోని ఏకాంత ప్రాంతాల్లో మెరుపులతో కూడిన తుఫాను ప్రభావం ఉంటుంది. శుక్రవారం (మార్చి 21) తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాలు, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన గంటకు 40నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, వడగండ్ల వాన కురిసే అవకాశం ఉంది. నిర్మల్, నిజామాబాద్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు గంటలకు 30నుంచి -40 కి.మీ.వేగంలో వీచే అవకాశం ఉందని ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. శుక్రవారం తెలంగాణలోని కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్లలోని కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వాన కురిసే అవకాశం ఉంది. గంటకు 40నుంచి 50 కి.మీ వేగంలో ఈదురుగాలు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. తెలంగాణలోని మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30నుంచి -40 కి.మీ.వేగంతో ఈదురు గాలులతో వర్షం కురిసే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేసింది.




తెలంగాణ పోలీసుల పుణ్యమా అని బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ అంటేనే గజగజ వణికేలా పరిస్థితి తయారైంది. గతంలో పెద్ద పెద్ద సినిమా స్టార్లు కూడా బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్లు చేశారు. విజయ్ దేవరకొండ, దగ్గుబాటి రానా, ప్రకాష్ రాజ్, మంచు లక్ష్మి, నిధి అగర్వాల్‌తో పాటు మరికొంతమంది ఈజాబితాలో ఉన్నారు. వీరిలో చాలా మందిపై ఇప్పటికే పోలీసు కేసులు నమోదయ్యాయి. తెలంగాణ పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలతో బెట్టింగ్ యాప్స్ కారణంగా డబ్బులు నష్టపోయిన వారికి ధైర్యం వస్తోంది. ఒక్కొక్కరిగా బయటకు వచ్చి తమ గళాన్ని వినిపిస్తున్నారు. తాజాగా, నెల్లూరుకు చెందిన రాంబాబు అనే వ్యక్తి మీడియాతో ముఖాముఖి మాట్లాడాడు. సినిమా స్టార్ల ప్రమోషన్ల వల్ల బెట్టింగ్ ఆడి లక్షలు పోగొట్టుకున్నట్లు వాపోయాడు. అతడు మీడియాతో మాట్లాడుతూ.. ' బెట్టింగ్ యాప్‌ల ద్వారా 80 లక్షలు పోగొట్టుకున్నా. హీరోల ప్రమోషన్ చూసే నష్టపోయా. నేను బెట్టింగ్ యాప్‌లో పాల్గొని తప్పు చేశాను. నాకు ఏ శిక్ష పడ్డా పర్వాలేదు. బెట్టింగ్ యాప్స్ ప్రమోటర్లకు శిక్ష వేయాల్సిందే. ఐపీఎస్ అధికారి సజ్జనార్ చొరవ తీసుకోవడంతో బెట్టింగ్ యాప్‌ల బాగోతం బయటకు వచ్చింది. బెట్టింగ్ యాప్ బాధితులు దేశవ్యాప్తంగా ఉన్నారు. సెలెబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్లు యాప్స్‌ను ప్రమోట్ చేయడం వల్లే బెట్టింగ్ ఆడుతున్నారు. సిటీస్‌లో కంటే పల్లెటూర్లలో ఈ బెట్టింగ్ చాప కింద నీరులా విస్తరించింది. నేను 65 లక్షలు అప్పు చేసి మరీ బెట్టింగ్ పెట్టాను' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.

**తప్పును తెలుసుకున్నా: ప్రకాష్ రాజ్...** బెట్టింగ్ యాప్ ప్రమోట్ చేయటంపై ప్రకాశ్ రాజ్ స్పందించారు. తాను 2016లో ఆ యాడ్ చేశానన్నారు. కొన్ని నెలలకే బెట్టింగ్ యాప్ యాడ్ చేయటం తప్పని తెలుసుకున్నానన్నారు. 2017లో యాడ్ ఒప్పందాన్ని పొడిగిస్తామని యాడ్ సంస్థ వారు తనను కోరినా తిరస్కరించినట్లు తెలిపారు. యాడ్‌ను ప్రసారం చేయవద్దని కూడా కోరినట్లు వెల్లడించారు. 9 ఏళ్ల కిందట ఏడాది ఒప్పందంతో ఆ యాడ్ చేశానన్నారు. 2021లో ఆ సంస్థను వేరే సంస్థకు అమ్మేశారని, కొత్త సంస్థ తన యాడ్‌ను మరో సారి సోషల్ మీడియాలో వాడిందని అన్నారు. తన ప్రకటన వాడినందుకు లీగల్ నోటీసులు పంపానని వెల్లడించారు. తెలంగాణ పోలీసులు తనను విచారణకు పిలిస్తే.. వెళ్లి వివరణ ఇస్తానని అన్నారు.

## భారాసపై కోపంతో అప్పుల లెక్క ఎక్కువ చేసి చూపొద్దు: హరీశ్‌రావు



హైదరాబాద్: భారాస హయాంలో చేసిన మొత్తం అప్పు రూ.4.22 లక్షల కోట్లు అని ఆ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రం దివాళా తీసిందని పదే పదే చెప్పవద్దని.. భారాసపై కోపంతో అప్పుల లెక్క ఎక్కువ చేసి చూపొద్దని కోరారు. శాసనసభలో హరీశ్‌రావు మాట్లాడారు. ఇది అవాస్తవిక బడ్జెట్.. గాలి మేడల బడ్జెట్ అని తీవ్రంగా విమర్శించారు. "కృష్ణా నదీ జలాలపై ఈ బడ్జెట్‌లోనే చర్చ పెట్టాలి. మీ నిర్వాకం వల్ల ఈ ఏడాది 34 శాతం వాడాల్సిన నీళ్లలో.. 24 శాతమే వాడారు. ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పంటలు ఎండుతున్నాయి. నీటిని రాబట్టడంలో ప్రభుత్వం ఎలా విఫలమైందో చర్చించాలి. తెలంగాణకు వరంగా ఉన్న సెక్షన్3ని భారాస సాధించింది. ట్రైబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపించాలి. తెలంగాణకు న్యాయబద్ధమైన 575 టీఎంసీలను రాబట్టాలి" అని హరీశ్‌రావు అన్నారు.

## ఇది గట్టి బడ్జెట్టా... ఒట్టి బడ్జెట్టా.. అసెంబ్లీలో సర్కార్‌పై హరీష్ ఫైర్

హైదరాబాద్, మార్చి 21: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. బడ్జెట్‌పై చర్చలో భాగంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ... శాసనసభకు బడ్జెట్ చాలా ముఖ్యమన్నారు. సభలో బడ్జెట్ ఆమోదం ముఖ్యమైన కార్యక్రమమని తెలిపారు. ప్రభుత్వానికి సహనశీలత, ఓపిక ఉండాలన్నారు. ప్రసంగం మధ్యలో మంత్రులు జోక్యం చేసుకోకుండా చూడాలని కోరారు. సభలో ఏం మాట్లాడాలో చెబితే అదే మాట్లాడతామన్నారు. ఆర్థిక మంత్రి భట్టి ప్రవేశపెట్టింది ఇది గట్టి బడ్జెట్టా... ఒట్టి బడ్జెట్టా చెప్పాలన్నారు. గతేడాది బడ్జెట్‌ను సమీక్షించుకోవాల్సి ఉందని అన్నారు. ఎన్నికలకు ముందు నో ఎల్ఆర్ఎస్.. నో బీఆర్ఎస్ అన్నారని.. ఎన్నికలకు ముందు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామన్నారని గుర్తుచేశారు. ఇవాళ ఎల్ఆర్ఎస్ కోసం ముక్కుపిండి వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రూ.30వేల కోట్ల విలువైన భూములు అమ్మకానికి పెట్టారన్నారు. రుణమాఫీ రూ.31వేల కోట్లు సమీకరించుకున్నట్లు గత బడ్జెట్‌లో చెప్పారన్నారు. ఎన్నికల ముందు మార్పు పేరిట వాగ్దానాలు ఇచ్చారని.. ఎన్నికల తర్వాత వాగ్దానాలను ఏమార్చారని విమర్శించారు.

**మాట తప్పిందెవరు**... గతంలో ఫార్మా సిటీకి భూములు సేకరిస్తే కాంగ్రెస్ నిరసనలు చేసిందని.. కాంగ్రెస్ వచ్చాక ఫార్మా సిటీ భూములు వెనక్కి ఇస్తామన్నారని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక వెనక్కి ఇచ్చేది పోయి మళ్లీ లాక్కుంటామని చెబుతున్నారన్నారు. ఫార్మా సిటీ పేరును ఫ్యూచర్ సిటీగా మార్చి తిరిగి భూములు లాక్కుంటున్నారని ఆరోపించారు. గతంలో నిర్ధరక ఆస్తులు అమ్మితే ఎలా విక్రయిస్తారన్నారని అన్నారు. రుణమాఫీలో విఫలమైనవారు..తమ చిత్తశుద్ధిని శంకిస్తున్నారని గతంలో భట్టి చెప్పారని.. అయితే ఇవాళ చేతగానివారెవరు, మాట తప్పిందెవరు.. చిత్తశుద్ధిలేని వారెవరో తేలిపోయిందని మాజీ మంత్రి వెల్లడించారు.




# కార్పొరేట్ల చేతుల్లోకి టూరిజం

## భవిష్యత్‌లో సామాన్యుల సందర్శన మరింత ప్రియం

తెలంగాణ టూరిజం ప్రయివేటీకరణ వైపు అడుగులు వేస్తోంది. ఇప్పుడున్న టూరిస్టు ప్రాంతాలతో పాటు కొత్త వాటిని గుర్తించి బిల్డ్ ఆపరేషన్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. వాటిని 15 నుంచి 66 ఏండ్ల లీజుకు ప్రయివేట్ సంస్థలకు అప్పగించనున్నది.

రానున్న ఐదేండ్లలో ఈ రంగంలో దాదాపు రూ.20 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని రూట్ మ్యాపు సిద్ధం చేసింది. 'తెలంగాణ టూరిజం-2025 పాలసీ' పేరిట ప్రభుత్వం తీసుకురానున్న ఈ విధానం అమల్లోకి వస్తే భవిష్యత్‌లో రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల సందర్శన మరింత ఖరీదుగా మారనుంది.

రాష్ట్రంలో టూరిజం అభివృద్ధిపై సర్కార్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రపంచంలో వనరులు, చారిత్రక వారసత్వ సంపద అంతగా లేని దేశాలు సైతం ఈ రంగంపై వచ్చే ఆదాయంతోనే మనుగడ సాధిస్తున్నాయి. అందువల్ల అన్ని హంగులు ఉన్న తెలంగాణ ఈ రంగాన్ని ఆదాయ మార్గంగా మార్చుకోవాలనే లక్ష్యంతో అడుగులు ముందుకు వేస్తోంది. ఈ క్రమంలోనే 'తెలంగాణ టూరిజం-2025 పాలసీ'ని ప్రభుత్వం ఖరారు చేసింది. 2025 నుంచి 2030 వరకు ఐదేండ్ల పాటు అమల్లో ఉండేలా రాష్ట్ర పర్యాటక శాఖ దీన్ని రూపొందించింది. రాష్ట్రంలో పర్యాటకాన్ని పరుగులు పెట్టించేందుకు ఇందులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాంతాలు, వారసత్వ కట్టడాలు, సహజ జల వనరులు, అడవులు, కొండలు, కోనలు, కోటలు, ప్రకృతి రమణీయతను ఆస్వాదించే ప్రాంతాలను బీవోటీ ప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు ఇందులో ప్రణాళికలు సిద్ధం చేసింది. పర్యాటక ప్రాజెక్టులను ప్రారంభించేవారికి వివిధ రాయితీలను ఈ పాలసీలో ప్రతిపాదించింది. ఆయా ప్రాజెక్టులకు ప్రభుత్వ భూములనూ లీజుకు ఇవ్వనున్నది. మూలధన పెట్టుబడులపైనా రాయితీలు ఇచ్చేందుకు నిర్ణయించింది. దాదాపు మూడు లక్షల మందికి అదనపు ఉపాధి అవకాశాలు కల్పించడం, దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల్ని ఆకర్షించడంలో దేశంలో తొలి ఐదు స్థానాల్లో తెలంగాణను నిలపడం. రాష్ట్ర ఆదాయంలో 10 శాతం, అంతకంటే ఎక్కువగా టూరిజం నుంచి వచ్చేలా చూడటం వంటి అనేక నిర్ణయాలను ఈ పాలసీలో చేర్చింది.

**మొదటి దశలో..** అనంతగిరి, కోటపల్లి, పరిగి, దామగుండం, సోమశిల కష్టానది బ్యాక్‌వాటర్, అలంపూర్, కొల్లాపూర్, బీచుపల్లి, అమ్రాబాద్ టైగర్ రిజర్వు, రామప్ప, లక్నవరం, మేడారం, బొగత జలపాతం, కాళేశ్వరం: నాగార్జునసాగర్, భద్రాచలం, కిన్నెరసాని వన్యప్రాణుల అభయారణ్యం, చార్మినార్, మక్కామసీదు, చౌమొహల్లా ప్యాలెస్, సాలర్‌జంగ్ మ్యూజియం, గోల్కొండ స్మారక చిహ్నాలు, శ్రీరామసాగర్, జన్నారం, కుంటాలజలపాతం, రామగిరి ఖిల్లా మొదలగు ప్రాంతాలను మొదటి దశలో బీవోటీ ప్రాతిపదికన అప్పగించనున్నట్టు సమాచారం.

**బీవోటీ అంటే?..** బీవోటీ అంటే బిల్డ్ నిర్మాణం, నిర్వహణ, బదిలీ అని అర్థం. ఈ మూడు ప్రాతిపదికల ఆధారంగా ప్రాజెక్టు ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తారు. ప్రాజెక్ట్ స్థాయిని బట్టి 15-33-66 ఏండ్ల వరకు లీజు కాలాన్ని నిర్ణయిస్తారు. గుర్తించిన ప్రాజెక్ట్ వివరాలు, లీజు కాలపరిమితి, పెట్టుబడి మొత్తం తదితర సమాచారం ఆధారంగా వాటిని ఈ-టెండర్ విధానంలో ప్రయివేట్ సంస్థలకు అప్పగించనున్నారు. ఎంపిక చేసిన ప్రాజెక్టు చేపట్టేందుకు ఈ-టెండర్ విధానంలో ఎవరూ ముందుకు రాకుంటే కంపెనీ స్థాయిని బట్టి నామినేషన్ ప్రాతిపదికన అప్పగిస్తారు. ఉదాహరణకు 33 ఏండ్లకు సదరు సంస్థ ప్రాజెక్ట్‌కు దక్కించుకుంటే నిర్మాణ సమయాన్ని అదనంగా ఇస్తారు. ప్రాజెక్టు దక్కించుకున్న గడువు కాలంలో సదరు సంస్థ దానిని నిర్వహిస్తుంది. దానిపై వచ్చే ఆదాయాన్ని అదే పొందుతుంది. గడువు కాలం ముగిసిన తర్వాత ఆ ప్రాజెక్టు ప్రభుత్వానికి అప్పగిస్తారు. ఈ విధానం వల్ల సర్కార్ నిధులు వెచ్చించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉండదు.అయితే పెట్టుబడి పెట్టిన ప్రయివేట్ సంస్థలు లాభాలే లక్ష్యంగా నిర్వహిస్తాయి. ఇది పట్టాలెక్కితే రాష్ట్రంలో పర్యాటకరంగం సామాన్యులకు మరింత ప్రియం కానుంది.

# అసెంబ్లీకి హాజరు.. మాట తప్పిన జగన్



మాట తప్పను.. మడమ తిప్పను అనేది మాజీ ముఖ్యమంత్రి జగన్ స్లోగన్.. 2019 ఎన్నికలకు ముందు ఈ నినాదమే వైసీపీకి ఊపు తెచ్చింది. ఘన విజయం తెచ్చిపెట్టింది. ఐదేళ్ల పాలనలోనూ అదే మాట పదే పదే చెప్పేవారు జగన్.. కట్ చేస్తే, ఇప్పుడు ఆ మాట వినిపించడం లేదు సరికదా.. ఆయన చెప్పిన మాట కూడా తప్పుతున్నారంటూ విమర్శలు ఎదుర్కొంటున్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తేకాని అసెంబ్లీకి రానంటూ గిరిగీసుకున్న వైసీపీ అధినేత.. అసెంబ్లీ జరుగుతుండగా, రోజూ మీడియాతో మాట్లాడి ప్రభుత్వాన్ని నిలదీస్తానని ప్రకటించారు. ఏదైనా సరే మాజీ సీఎం అలా ప్రశ్నిస్తే ఎంతో కొంత ప్రభుత్వంపై ఒత్తిడి ఉండే అవకాశం ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావించారు. అసెంబ్లీకి వెళ్లకపోయినా ప్రతిపక్షం నుంచి సమస్యలు లేవనెత్తితే ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమైంది. అసెంబ్లీ సమావేశాలు నిన్నటితో నిరవధిక వాయిదా పడ్డాయి. దాదాపు 15 రోజుల పాటు 84 గంటల పాటు అసెంబ్లీలో వివిధ అంశాలపై చర్చ జరిగింది. అటు మండలిలోనూ దాదాపు అదే సమయం అధికార, విపక్షాల మధ్య సమరం నడిచింది. అయితే ప్రతిపక్షం లేకపోవడం వల్ల అసెంబ్లీ ఏకపక్షంగానే సాగింది. అప్పుడప్పుడు టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలే ప్రతిపక్ష పాత్ర పోషించారు. ఇకపోతే సభకు రాకపోయినా మీడియా ద్వారా ప్రభుత్వాన్ని నిలదీస్తానని చెప్పిన జగన్ ఈ 15 రోజుల్లో కేవలం ఒక్కసారి మాత్రమే మాట్లాడారు. దీంతో జగన్ తనకు తానుగా ఇచ్చిన తప్పారని విమర్శలు ఎదుర్కొంటున్నారు. అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం.. ఆ పని ఎలాగూ చేయలేదన్న విమర్శలు ఎదుర్కొంటోంది. ప్రతిపక్ష హోదా దక్కదని తెలిసి కూడా అదే విషయం కోసం పట్టుబడి సభకు దుమ్మా కొట్టడం వల్ల తప్పుడు సంకేతాలు వెళుతున్నాయనే పార్టీలోనూ అంతర్గత చర్చ జరుగుతోంది. ఈ విషయంలో ప్రజలను ఆకట్టుకునేందుకు అయినా అధినేత మీడియా ముందుకు వస్తే బాగుండేదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే జగన్ ఏమకున్నారో కానీ, తాను చెప్పిన మాటను తానే పట్టించుకోకపోవడంతో ప్రభుత్వందే పైచేయిగా భావించాల్సివస్తోందని అంటున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే హామీలు నెరవేర్చడం లేదని చెప్పిన వైసీపీ.. కీలకమైన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వమిచ్చిన హామీలను అమలు చేయాల్సిందిగా ఒత్తిడి చేసే అవకాశాన్ని చేజేతులా వదులుకుందని అంటున్నారు. కనీసం జగన్ మీడియా ఎదుటకు వచ్చి సూపర్ సిక్స్ హామీలపై సభ జరిగిన రోజుల్లో మీడియాలో మాట్లాడితే ప్రజల్లో చర్చ జరిగేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత నెల 28న బడ్జెట్ ప్రవేశపెట్టగా, 15 రోజులపాటు దానిపై చర్చ జరిగింది. రోజుకో శాఖపైన ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అయితే ప్రతిపక్షం లేకపోవడం వల్ల ప్రభుత్వం చెప్పినది మాత్రమే ప్రజలు తెలుసుకోవాల్సివచ్చింది. అదే ప్రతిపక్షం ఉంటే అందులో లోతుపాతులు, కష్ట, నష్టాలు ప్రజలకు తెలియజేసే అవకాశం ఉండేదని అంటున్నారు. సభకు వెళ్లని వైసీపీ ఆ అవకాశాన్ని కోల్పోగా, జగన్ కూడా ఆ పనిచేయకపోవడంపై విమర్శలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు తాను సభకు వెళ్లనని, తనతోపాటు మిగిలిన 10 మంది శాసనసభ్యులు కూడా అసెంబ్లీ గుమ్మం తొక్కరని వైసీపీ అధినేత జగన్ చెప్పారు. అయితే వైసీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు దొంగచాటుగా వచ్చి సంతకాలు చేస్తున్నారని సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించి గాలి తీసేశారంటున్నారు. ఇలా వైసీపీ ఎమ్మెల్యేలు ఎందుకు సంతకాలు చేశారనే చర్చ కూడా ఎక్కువగా జరుగుతోంది. అసెంబ్లీకి రాకపోతే సభ్యత్వాలు రద్దు అవుతాయన్న భయమే వారిని దొంగచాటుగా సంతకాలు చేసేలా పురిగొల్పిందా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. అయితే ఈ విషయంలో కూడా జగన్ తన శాసనసభ్యులను అదుపు చేయలేకపోయారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విషయంలోనూ వైసీపీ అధినేత జగన్ మాట తప్పినట్లు భావించాలని అంటున్నారు.

# నియోజకవర్గాల మార్పు.. ఏపీ, తెలంగాణకు మేలే!



హైదరాబాద్/అమరావతి : కేంద్ర ప్రభుత్వం 2026లో పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన చేపట్టనుంది. డీలిమిటేషన్ ప్రక్రి యకు సంబంధించి త్వరలోనే నోటీసు కూడా ఇవ్వనుంది. దీనిపై దక్షిణాది రాష్ట్రాలు కొంత యాగీ చేస్తు న్న విషయం తెలిసిందే. తమకు అన్యాయం జరుగుతుందని, ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలు తగ్గుతాయని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఆందోళన బాటపట్టాయి. అయితే.. కేంద్రం మాత్రం నియోజకవర్గా లు తగ్గబోవని చెబుతోంది. ఇదిలావుంటే.. ఏపీ, తెలంగాణలకు మాత్రం డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా మేలు జరుగుతుందని మేధావులు చెబుతున్నారు. విభజన చట్టం ఈ రెండు రాష్ట్రాలకు రక్షణ ఛత్రంగా మారుతుందని అంటున్నారు. 2014 నాటి రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు అసెంబ్లీ స్థానాల్లో మార్పులు వస్తున్నాయి. ఏపీకి ప్రస్తుతంఉన్న 175 స్థానాలకు గాను మరో 50, తెలంగాణకు కూడా 35-45 స్థానాల వరకు పెరగనున్నాయి. ఇది చాలా ఆశావహ వ్యవహారం. తద్వారా.. ఇప్పటి వరకు లైన్‌లో ఉన్న చాలా మంది నాయకులకు అవకాశాలు చిక్కుతాయి. అంతేకాదు.. పార్టీలు కొత్తగా చేర్చుకునే నాయకులకు, యువతరానికి కూడా భారీ ఎత్తున నియోజకవర్గాలు పెరిగి పోటీకి పోటీ ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇక, పార్లమెంటు విషయానికి వస్తే.. ఈ విషయం విభజన చట్టంలో లేదు. కానీ, ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం..ఏపీకి 25 స్థానాలు ఉంటే.. ఇవి 32కు పెరగనున్నాయి. అంటే.. ఏడు నియోజవర్గాలు పెరగనున్నాయని తెలుస్తోంది. వీటిలో పెద్ద నియోజకవర్గాలు ఎక్కువగా ఉన్నాయి. గుంటూరు, అల్లూరి జిల్లాల్లో రెండేసి చొప్పున కొత్త నియోజకవర్గాలు ఏర్పడనున్నాయి. అదేవిధంగా తెలంగాణలో ప్రస్తుతం 17 పార్లమెంటు స్థానాలు ఉంటే.. ఇవి 3 నుంచి 4కు పెరగనున్నాయి. కరీంనగర్, నిజామాబాద్ వంటి పెద్ద నియోజనకవర్గాలను రెండుగా విభజించే అవకాశం ఉంది. అయితే.. దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. నిజామాబాద్‌ను రెండు నియోజకవ ర్గాలు చేయాలన్న ప్రతిపాదన ఉన్నా.. ఇది బీజేపీకి బలమైన నియోజకవర్గంగా ఉండడంతో దీనిని విడదీసి కొత్తది ఏర్పాటు చేయకపోవచ్చని తెలుస్తోంది.

# వలస లీడర్లకు 'మీనాక్షి' ఝలక్.. గందరగోళంలో పార్టీ మారిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావొస్తోంది. రాష్ట్రంలో హస్తం పార్టీ పవర్ లోకి రాగానే అప్పటివరకు బీఆర్ఎస్ పార్టీలో కొనసాగిన కీలక నేతలు.. అధికారం, పదవుల కోసం వెంటవెంటనే పార్టీ మారారు. ఇందులో పదిమంది ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు, మరికొందరు సీనియర్ నేతలు ఉన్నారు. అప్పట్లో వీరికి పదవుల ఆశచూపే కాంగ్రెస్ పార్టీ చేర్చుకుందనే ఆరోపణలు ఉన్నాయి. కానీ ఏడాదికాలంగా పార్టీ మారిన నేతలెవ్వరికీ పదవులు దక్కలేదు.. అటు పార్టీని పవర్‌లోకి తెచ్చేందుకు కృషి చేసిన మరికొందరు నేతలకు కూడా పదవులు రాలేదు. దాంతో కొందరు నేతలు పదవుల కోసం ఎప్పుడెప్పుడా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. కానీ.. తాజాగా కాంగ్రెస్ పార్టీ కొత్త ఇంచార్జ్ పార్టీ మారిన నేతలకు పదవుల విషయంలో ఓ క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ కాంగ్రెస్‌కు మొన్నటివరకు దీపాదాస్ మున్షీ ఇంచార్జ్‌గా పనిచేశారు. ఆమె దాదాపు ఏడాదికి పైగా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్‌గా సేవలందించారు. ఈ ఏడాది సమయంలో దీపాదాస్‌పై అనేక అవినీతి ఆరోపణలు వెలువడ్డాయి. ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడ్డ లీడర్లను పక్కన పెట్టేశారని.. కొత్తగా వలస వచ్చిన నేతలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని సొంత పార్టీ లీడర్లే బహిరంగంగా విమర్శలకు దిగారు. అప్పట్లో నేతల వరుస ప్రకటనలు అధికార పార్టీకి ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఈ క్రమంలోనే కొందరు నేతలు దీపాదాస్ వ్యవహార తీరుపై పార్టీ హైకమాండ్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దాంతో ఆమెను తప్పించి.. కొత్త ఇంచార్జ్‌గా మీనాక్షి నటరాజన్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆమె వచ్చిరాగానే.. కాంగ్రెస్ నేతలకు బిగ్ షాక్ ఇచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై సస్పెన్షన్ వేటు వేశారు. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలన్నీ మీనాక్షి నటరాజన్ చుట్టే తిరుగుతున్నాయి. ఆమె సింప్లిసిటీని చూసిన కాంగ్రెస్ నేతలు.. ఆమెను డీల్ చేయడం చాలా కష్టమని ఓ భావనకు వచ్చారని అంటున్నారు. అంతేకాదు మీనాక్షి నటరాజన్ రాష్ట్రానికి రాగానే మొదటిసారి పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇన్నాళ్లు కష్టపడి పనిచేసినవారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని, అలాంటివారికే పదవులు ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ప్యారాచూట్? నేతలు, ఫిరాయింపుదారులకు పదవులు ఇవ్వడం అసాధ్యమని తేల్చేశారు. ఈ మాటలు విన్నాక బీఆర్ఎస్ నుంచి కాంగ్రెసు పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు తెగ టెన్షన్ పడుతున్నట్టు తెలిసింది. కాంగ్రెస్ పార్టీలో చేరిపోయి.. పోస్టులు కొట్టేద్దామని భావించిన తమ ఆశలపై కొత్త ఇంచార్జ్ నీళ్లు చల్లారని అనుచరుల దగ్గర వాపోతున్నట్టు తెలిసింది. ఇక పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో చాలా మంది లీడర్లు పదవు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇందులో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్ రెడ్డి లాంటి లీడర్లు పదవులు ఆశిస్తున్నారు. వీళ్లు ఏకంగా మంత్రి పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకాదు మరికొందరు ఎమ్మెల్యేలు కూడా ఇతర పోస్టులు ఆశిస్తున్నారు. కానీ పదవుల పంపకాలపై హైకమాండ్ ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో వేచిచూసే ధోరణిలో ఉన్నారు. ఇందులో కొందరిని అనర్హత వేటు టెన్షన్ పెడుతోంది. ఒకవేళ సుప్రీంకోర్టు తీర్పు బీఆర్ఎస్‌కు అనుకూలంగా వస్తే.. తమ పరిస్థితి ఏంటని దిగుల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ కొత్త ఇంచార్జ్ బాంబు పేల్చడంతో వారంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్టు తెలిసింది. మొత్తంగా పార్టీ మారిన నేతలకు కొత్త ఇంచార్జ్ దిమ్మతిరిగే షాక్ ఇవ్వడంతో.. వీరి పరిస్థితి పెనంలో నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యిందని చర్చ జరుగుతోంది. అయితే వీరిలో కొందరు లీడర్లు మాత్రం.. తిరిగి సొంత గూటికి వెళ్లే ఆలోచన సైతం చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

# తరచూ టీ.. కాఫీలు తాగే అలవాటు ఉందా?

టీ.. కాఫీలు తాగే అలవాటుందా? తరచూ కూల్ డ్రింక్స్ కూడా తాగుతంటారా? అయితే.. షుగర్.. ఊబకాయానికి దగ్గరగా ఉన్నట్లేనని చెప్పాలి. హైదరాబాద్ లోని టాటా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ పరిశోధకులు తాజాగా పలు ఆసక్తికర అంశాల్ని వెల్లడించారు. టీ.. కాఫీ.. శీతలపానీయాలతో జరిగే నష్టం ఎంత? అన్న అంశంపై రీసెర్చ్ సెంటర్ పరిశోధకులు చేపట్టిన పరిశోధనల వివరాలు ఆసక్తికరంగా మారాయి. తాము రెండేళ్లుగా పరిశోధనలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రొఫెసర్లు ఉల్లాస్ ఎస. కొల్తూర.. మహేందర్ లు మరిన్ని అంశాల్న ప్రస్తావిస్తున్నారు. తాము పలు ప్రయోగాలు చేశామని.. వేర్వేరు జాతుల ఎలుకల్ని తీసుకొని.. కొన్నింటికి రోజుకు నాలుగైదు సార్లు చక్కెరతో కలిపిన వంద మిల్లీలీటర్ల టీ.. కాఫీ.. శీతలపానీయాల్ని ఇచ్చారు. మరికొన్ని ఎలుకలకు ప్రతి మూడు..



నాలుగు గంటలకు ఒకసారి ఇచ్చారు. కొద్ది రోజుల అనంతరం వీటి రక్త నమూనాల్ని పరిక్షించగా అన్ని ఎలుకల్లోనూ మధుమేహం.. ఊబకాయ లక్షణాలు కనిపించాయని వెల్లడించారు. ఈ ప్రయోగ ఫలితాల్ని అమెరికాలోని నేషణల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అధ్యయనం చేసిన గ్లోబల్ డైటరీ డేటాబేస్ తో సరిపోల్చారు. తమ పరిశోధన పత్రాన్ని ఇటీవల న్యూట్రిషనల్ బయో కెమిస్ట్రీలోనూ పబ్లిష్ అయినట్లుగా పేర్కొన్నారు. టీ.. కాఫీ.. కూల్ డ్రింక్స్ లో ఉండే సుక్రోజ్ కారణంగా కాలేయం.. కండరాలు.. చిన్నపేగుల మీద తీవ్ర ప్రభావం పడుతున్న విషయాన్ని గుర్తించారు. ఈ నేపథ్యంలో కాఫీ.. టీలను సేవించే వారు వీలైనంతగా అందులో షుగర్ లేకుండా వాటిని తీసుకోవటం మంచిదన్న సూచన చేస్తున్నారు. సో.. ఇంకెందుకు ఆలస్యం.. కాఫీ.. టీ.. తాగే వేళలో షుగర్ లేకుండా ట్రై చేయండి.

# డిజిటల్ అరెస్టు పేరుతో రూ.20 కోట్లు కొట్టేశారు

సైబర్ నేరగాళ్లు దారుణాలు అంతకంతకూ ఎక్కువ అవుతున్నాయి. ప్రజల్లో ఆశను.. భయాన్ని తమ ఆయుధంగా చేసుకొని అమాయకుల్ని లూటీ చేస్తున్న ఉదంతాలు అంతకంతకూ ఎక్కువ అవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వాలు సైతం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ.. ప్రజల్లో అవగాహన కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అయినప్పటికీ.. సైబర్ దోపిడీదారుల దుర్మార్గాలు మాత్రం తగ్గట్లేదు. తాజాగా ముంబయికి చెందిన ఒక పెద్దవయస్కురాలి నుంచి రూ.20 కోట్లు కొల్లగొట్టిన వైనం షాకింగ్ గా మారింది. ఇందుకోసం ఆమెను డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లుగా ప్రకటించి.. ఆమెను ఇంట్లో నుంచి బయటకు రాకుండా బంధించారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ



ఉదంతంలోకి వెళితే.. సౌత్ ముంబయికి చెందిన 86 ఏళ్ల పెద్దవయస్కురాలికి గత డిసెంబరు 26న సీబీఐ అధికారి అంటూ ఒకరు ఫోన్ చేశారు. మీ బ్యాంక్ ఖాతా ద్వారా అక్రమంగా నగదు చలామణి జరిగిందని.. మీరు డిజిటల్ అరెస్టు అయ్యారని.. ఎక్కడికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండాలని.. దీనిపై విచారణ జరుపుతున్నట్లుగా భయపెట్టారు. ప్రతి మూడు గంటలకు ఒకసారి తనిఖీలు చేస్తామని.. లేదంటే మీ పిల్లలు కూడా డిజిటల్ అరెస్టు అవుతారని బెదిరింపులకు పాల్పడ్డారు. ఆ తర్వాత ఆమె నుంచి విడతలవారీగా డబ్బులు వసూలు చేశారు. ఇదంతా రూ.20.26 కోట్లు కావటం గమనార్హం. ఆలస్యంగా తాను సైబర్ నేరగాళ్ల నుంచి లూటీ అయినట్లుగా అర్థమైన ఆమె పోలీసుల్ని సంప్రదించారు. ఆమె ఖాతా నుంచి వేర్వేరు ఖాతాలకు బదిలీ అయిన నగదులో రూ.77 లక్షల మొత్తాన్ని ఫ్రీజ్ చేశారు.

వీరి కోసం గాలింపులు చేపట్టిన పోలీసులు ముంబయిలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురిని గుర్తించి అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. ఈ దుర్మార్గంలో భాగస్వాములైన మరో ఇద్దరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

చురకలు

సంపాదకీయం

# పీఎం కిసాన్ షాక్

## అనర్హులకు వందల కోట్లు !

దేశంలో రైతాంగాన్ని ఆదుకోవడానికి కేంద్రంలోని బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తీసుకుని వచ్చిన అద్భుతమైన పథకం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి. ఈ పేరులోనే రైతులను సన్మానించుకునే విధానం ఉంది. వారిని గొప్పగా ఆదుకోవాలన్న ఆలోచన ఉంది. ప్రతీ ఏటా ఆరు వేల రూపాయల నిధులను నేరుగా రైతుల ఖాతాలలో కేంద్రం జమ చేస్తోంది. మధ్యలో ఏ దళారీ లేకుండా ఈ పథకం నిధులు వారికే దక్కేలా చూస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పథకానికి ఎనలేని ఆదరణ దక్కుతోంది. కేంద్రం ఈ పథకాన్ని 2019లో ప్రారంభించింది. ఇప్పటికి ఆరేళ్ళుగా ఈ పథకం కింద నిధులు రైతులు అందుకుంటున్నారు. ప్రతీ నాలుగు నెలలకు రెండు వేలు వంతున ఏడాదిలో మూడు సార్లు ఈ పథకం కింద నిధులు కేంద్రం ఇస్తోంది. ఇప్పటికి అలా 19 విడతలుగా కిసాన్ నిధులు విడుదల చేసిన కేంద్రం 20వ విడతకు సన్నాహాలు చేస్తోంది. ఇదిలా ఉంటే పేద రైతులు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వారు అయిన లబ్దిదారులకే ఈ పథకం ఉద్దేశించబడింది. కిసాన్ సమ్మాన్ నిధి కింద లబ్ది పొందేందుకు నిబంధనలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న వారు సంపన్నులు, అలాగే రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు ఈ పథకానికి అనర్హులు. కానీ పీఎం కిసాన్ నిధులను చాలా మంది అనర్హులు తీసుకుంటున్నట్లుగా కేంద్రానికి నివేదికలు అందాయి. ఈ పథకం పొందాలంటే లబ్ధిదారులు ఎప్పటికపుడు ఈ కేవైసీ చేయించుకోవాలి. అలాగే వారి ఆధార్ బ్యాంక్ ఖాతాలు లింక్ అయి ఉండాలి. భూమికి సంబంధించిన రికార్డులు కరెక్ట్ గా ఉండాలి. ఇపుడు ఈ విధానం ద్వారానే ఈ పథకం ద్వారా అనర్హులను గుర్తిస్తున్నారు. కేంద్రం అయితే అనర్హుల నుంచి డబ్బులను వసూలు చేయాలని నిర్ణయించింది. అనర్హులు ఈ పథకం కిందకు రారని వారు ఈ పథకాన్ని తాముగానే వదులుకోవాలని సూచిస్తోంది. అలా కాదు అనుకుంటే వారి నుంచి డబ్బులను వసూలు చేస్తామని అంటోంది. ఆ విధంగా చూస్తే కనుక అనర్హుల నుంచి కేంద్రం ఇప్పటి దాకా 416 కోట్ల రూపాయల నిధులను వెనక్కి తీసుకుందని వారి నుంచి కచ్చితంగా వసూలు చేసిందని ప్రెస్ బ్యూరో ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. మరో వైపు చూస్తే కనుక అధిక ఆదాయం కలిగిన రైతుల నుంచి లబ్దిదారుల నుంచి తిరిగి పీఎం కిసాన్ పథకం నిధులను వసూలు చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలని కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్రం ఆదేశించింది. అదే సమయంలో అర్హత ఉండి ఈ పథకం పొందలేని వారు దరఖాస్తు చేసుకుంటే వారికి తక్షణం వర్తింపచేస్తామని పేర్కొంది. కేంద్రం అనుసరిస్తున్న ఈ విధానాన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్రాలు కూడా అనుసరిస్తే బాగుంటుంది అని అంటున్నారు. ఎందుకంటే అనర్హులు ఎవరైనా ఈ పథకాల ద్వారా లబ్ది పొందితే వారి నుంచి వసూలు చేయడం ద్వారా మరింతమంది అర్హులకు వాటిని అందించవచ్చు అని అంటున్నారు. అనర్హులను గుర్తించి పథకాలను కట్ చేయడం కాదు అంతవరకూ తీసుకున్న నగదు మొత్తాలని కూడా జమ చేయించేలా వ్యవస్థలు ఉంటేనే అనర్హులు ఈ వైపుగా చూడరని అంటున్నారు.


# నీటి పరిరక్షణ సామాజిక బాధ్యత - మార్చి 22...ప్రపంచ జల దినోత్సవం




నీరు ప్రకృతిలో ఉన్న సమస్త జీవులకు ప్రాణాధారము. ప్రకృతి సమస్త జీవులకు ప్రసాదించిన ఒక అపురూపమైన పదార్థము. మనిషి జీవించడానికి గాలి ఎంత అవసరమో నీరూ అంతే అవసరం. నీరే లేకపోతే పచ్చని చెట్లు, పారే నదులు, జీవులు, మహాసముద్రాలు ఏమీ ఉండవు. ఇవేమీ లేకుండా ఎండిపోయిన మట్టి గడ్డలా ఉంటుంది భూమి. భూమిమీద వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు. అంతటి అమూల్యమైన నీటి విలువను తెలుసుకోడానికి, దానిని వృథా చేయకుండా అవగాహన కల్పించడానికి ఐక్యరాజ్యసమితి 1993 నుంచి ప్రతి సంవత్సరం మార్చి 22న అంతర్జాతీయ జల దినోత్సవంగా గుర్తించాలని నిర్ణయించింది. ఐక్య రాజ్య సమితి, ప్రపంచ జల దినోత్సవాన్ని 1992 యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, రియో డి జెనీరియో సమావేశంలో ప్రతిపాదించింది. దీన్ని 1993వ సంవత్సరం నుంచి నిర్వహించడం ప్రారంభించారు. మెరుగైన మంచి నీటి వనరుల నిర్వహణ, ప్రాముఖ్యత పట్ల అవగాహన కల్పించడం కోసం ఐక్య రాజ్య తెలంగాణ ప్రతి సంవత్సరం మార్చి 22ను ప్రపంచ జల దినోత్సవంగా జరుపుతుంది. భారత్‌లో సింధు నాగరికత, ఈజిప్టులో నైలు నది నాగరికత ఇలా ప్రపంచ నాగరికతలు నదీ తీరాలు, నీటి వనరులకు సమీప ప్రాంతంలో విలసిల్లాయి. మన చరిత్రతో జలవనరుల తోనే ముడిపడి ఉంది. నీటిని పరిరక్షించు కోవాలనే నినాదాన్ని ప్రాచీన నాగరికతలు వెల్లడించాయి. భారతీయులకు నీటి విలువ తెలుసు కనుకే నదులను పూజించే ఆచారం ఉంది. నీటిని పూజించి, నదులకు, చెరువులకు, జలాశయాలకు హారతులిస్తారు. నారం అంటే నీరు. నీటిలో ఉంటాడు కాబట్టి శ్రీమహావిష్ణువుకు నారాయణుడు అని పేరు. నీటినే రూపంగా స్వీకరించి విష్ణువు నీటి విలువను చెప్తున్నారు. శివుడు ఏకంగా గంగను తన తలపై ధరించి గంగాధరుడయ్యాడు. నీటిని వృథా చేయడం సృష్టికి, భగవత్తత్వానికి, సమస్త ప్రాణకోటికి వ్యతిరేకమని పురాణాలు, ప్రాచీన గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. నీరు మూడు రూపాలలో... ఘన రూపం అంటే మంచు గడ్డల రూపంలోను, ద్రవ రూపం, సముద్రాలు, నదులు, తటకములు మొదలగునవి, వాయు రూపంలో భూమండలం పై 71 శాతానికి పైగా ఆవరించి ఉంది. క్రొత్త క్రొత్త సమ్మేళన పదార్థముల తోను, విష పూరిత రసాయన పదార్థాల తోను నీరు కలుషిత మౌతున్నది. అలా కలుషితమైన జలము జల చక్రము ద్వారా తిరిగి ఆవిరి రూపం ధరిస్తుంది. ఈ క్రమంలో ఆ జలం తనలోని ఇతర కలుషిత పదార్థములను, అనగా రసాయన పదార్థములను కూడా కలుపుకొని వాయు రూపంలో మేఘాలుగా మారి అక్కడి వాతావరణం అనుకూలించ గానే ద్రవించి తిరిగి వర్ష రూపంలో తిరిగి భూమిని చేరుతున్నది. ఆ కలుషిత మేఘాలు వర్షించినపుడు రంగులలో వర్షము కురవడము, ఆమ్ల వర్షాలు కురవడము సర్వ సాధారణము. దాంతో ప్రకృతికి అపార నష్టము జరుగుతున్నది. జీవ వ్యవస్థలో నీరు మంచి ద్రావణి, ఇందులో చాలా వరకు లవణాలు కరుగుతాయి. అందుకే దాన్ని విశ్వవ్యాప్త దావణి అంటారు. ఇంచుమించు అన్ని జీవ రసాయనాలు నీటిలో కరుగుతాయి. ఇందువల్ల నీరు జీవ పదార్థాల రవాణాకు తోడ్పడుతుంది. నీటి ఎద్దడిని ప్రపంచంలో 80 దేశాలు ఎదుర్కొంటున్నాయి. గొంతు తడుపుకునే చుక్క నీటికోసం మైళ్లకు మైళ్లు నడిచి పోవాల్సిన పరిస్థితిలో కూడా ప్రజలు ఉన్నారు. మంచి నీళ్లు దొరకక కుంటల్లో, గుంటల్లో అడుగు బొడుగు మురికి నీటినే తాగాల్సిన దుస్థితిలో ఎంతో మంది ఉన్నారు. వేసవిలో చాలా చోట్ల నీటి కొరత మూలంగా, కనీసం తాగు నీరు దొరకక ఎంతో మంది బిందెలతో బహు దూరం కిలో మీటర్ల వరకు నడిచి వెళ్లి త్రాగు నీటిని తెచ్చుకునే అనివార్య పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. మంచినీటి కంటే సముద్రపు నీరు చాలా ఎక్కువ పరిమాణంలో ఉంది. మనం నివసించే భూగోళంలో ఉన్న నీటి వనరులలో 99% ఉన్నది ఉప్పునీరే. ఇది 97% సముద్రాల్లోనే ఉంది. మిగతాది నదులు, చెరువుల్లో ఉంది త్రాగడానికి పనికొచ్చే నీరు 1% మాత్రమే. ఇందులో చెరువుల్లో 0.86%, నదుల్లో 0.02% ఉండగా మిగిలినవి భూగర్భ జలాలు. ప్రపంచ వ్యాప్తంగా త్రాగడానికి ఉపయోగపడే నీరు 0.3% మాత్రమే.

నీటితో జీవం అంకురించింది. ప్రకృతి మనుగడ నీటితోనే కొనసాగుతోంది. జీవవైవిధ్య పరిరక్షణ, జీవం జలంతోనే సాధ్యమవుతుంది. ఇవన్నీ తెలిసినా...నీటిని వృథా చేస్తున్నాం...నీటి వనరుల్ని వ్యర్థాలతో కలుషితం చేస్తున్నాం. ప్రపంచంలో కోట్లాది మంది తాగడానికి నీరు లేక దాహంతో అల్లాడి పోతుంటే..మనకు అందుబాటులో ఉన్న నీటిని వృథా చేస్తున్నాం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే..2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమైన నీరు ఉండనే ఉండదని. ప్రజలు స్నానాలు చేయడం మానేసి శరీరానికి లేపనాలు రాసుకుంటారనీ..(కెమికల్ బాత్) వాటితోనే స్నానాలు చేస్తారనీ..దేశ సరిహద్దుల్లో కాపలా కాయాల్సిన సైనికులు నీటి వనరుల చుట్టు కాపలా కాసే పరిస్థితి ఉంటుందనీ.. తలంటు కోవడానికి నీరు సరిపోక ప్రజలందరూ బోడి గుండుతో జీవిస్తారనీ, స్త్రీ పురుషులందరూ రోజు తల షేవ్ చేసుకునే పరిస్థితి వస్తుందని దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితిని ఎలా ఉంటుందో అంచనా వేయొచ్చు. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా.. ఉన్న నీటిని సద్వినియోగం చేసు కోవడం, వృథాను అరికట్టడం, పొదుపుగా వాడటం, పునర్వినియోగం..తదితరాలన్నింటికీ ప్రాధాన్య మివ్వాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# జానపద సినీ కథా నాయకుడు కాంతారావు - మార్చి 22.. కత్తి కాంతారావు వర్ధంతి



తెలుగు సినీ రంగంలో నందమూరి, అక్కినేనిల హవా నడుస్తున్న రోజు ల్లో, సినిమాలు పరిమితంగా నిర్మిస్తున్న కాలంలో మరో హీరోకి అవసరం ఉందన్న ఆలోచన సినీ పరిశ్రమ చెయ్యని వేళ ఆ టాప్ హీరోల తర్వాత హీరోగా గుర్తింపు పొందిన అందాల నటుడు, జాన పద హీరో, నాటి యువతుల కలల రాకుమారుడు కాంతారావు. తాడేపల్లి లక్ష్మీ కాంతారావు అంటే వెంటనే స్ఫురణకు రాక పోవచ్చు. కానీ కత్తి కాంతారావంటే తెలుగు నాట తెలియని వారుండరు. వెండి తెరపై జానపద కథా నాయకుడిగా టి.ఎల్.కాంతారావు వేసిన ముద్ర అలాంటిది. కత్తి పట్టిన జానపద వీరుడు అంటే ఇప్పటికీ కూడా మొదటగా గుర్తుకు వచ్చేది కాంతా రావే. విఠలాచార్య, కాంతా రావుల కలయిక అపూర్వం. ప్రేక్షకులకు గుర్తుండి పోయినప్పటికీ ఆయన పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో సైతం మంచి పాత్రల ద్వారా అరుదైన అభినయాన్ని చూపించారు. నార దుడిగా, కృష్ణుడిగా, అర్జునుడిగా కూడా నటించారు. ఎన్టీఆర్ రాముడిగా నటించిన 'లవకుశ' సినిమాలో లక్ష్మణుడిగా నటించిన కాంతా రావు, రాష్ట్రపతి అవార్డును కూడా అందుకున్నారు. ఆయన సినిమా రంగానికి చేసిన సేవలకు గాను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2000లో రఘుపతి వెంకయ్య అవార్డు ప్రదానం చేసి సత్కరిం చింది. ఆయన స్వీయ చరిత్ర "అనగనగా ఒక రాకుమారుడు". తెలంగాణ లోని నల్గొండ జిల్లా కోదాడ ప్రాంతంలో గుడిబండ గ్రామములో 1923లో ఒక కరణీకపు కుటుంబంలో పుట్టి, వంశపారంపర్య పట్వారీ వృత్తిమీద కన్నా ముఖానికి రంగు వేసుకుని నటించటం మీద మక్కువ పెంచు కున్నాడు కాంతారావు. ఏడాది వయసులోనే తండ్రిని కోల్పో యారు. చదువుకునే రోజుల్లోనే నాటకాల పట్ల ఆకర్షితులయ్యారు. ఆపై వెండితెరపైకి వచ్చి నటుడిగా, నిర్మాతగా కూడా మరపురాని సినిమాలను అందించారు. తెలుగు సినిమా రంగములో అనేక సాంఘి క, జానపద, పౌరాణిక పాత్రలు ధరించిన కాంతారావు నిర్దోషి చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశాడు. హెచ్.ఎం. రెడ్డి తీసిన 'నిర్దో షి' (1951), 'ప్రతిజ్ఞ' (1953) మొదలుకుని 450కి పైగా సినిమా ల్లో నటించారు. విఠలాచార్య దర్శకత్వంలో వచ్చిన జానపద చిత్రాల్లో కథానాయకుడిగా ధీరోదాత్తంగా నటించి పేరు సంపాదించారు. నిర్మాతగా 'సప్త స్వరాలు', 'గండర గండడు', 'ప్రేమ జీవులు', 'గుండెలు తీసిన మొన గాడు' సినిమాలు తీశారు. రామారావు, నాగేశ్వరరావు లకు సమకాలికులుగా కొన్ని సందర్భా లలో వారితో సమానమైన గుర్తింపు పొందారు. దాసరి నారాయణరావు మాటల్లో "తెలుగు చలనచిత్ర సీమకు రామారావు నాగేశ్వర రావులు రెండు కళ్ళైతే , వాటి మధ్య తిలకం వంటివారు కాంతారావు. ధరించిన కాంతారావు నిర్దోషి చిత్రం ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. ఈయన సినిమా రంగానికి చేసిన సేవలకు గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2000 లో రఘుపతి వెంకయ్య పురస్కారంతో సత్కరిం చింది. ఆయన మొత్తం 400 పైగా చిత్రాలలో నటించాడు. ఒక దశాబ్దంపాటు హీరోగా రెండవ హీరోగా ఎన్నెన్నో పాత్రలు పోషించారు. 'నారదుడి' పాత్రకు కాంతారావును తప్పించి మరెవరినీ ఊహించు కోలేనంతగా మెప్పిం చాడు. పౌరాణిక పాత్రలైన రాముడు, కృష్ణుడు పాత్ర ల్లోనూ ఎన్టీఆర్ తరువాత కాంతారావుగా గుర్తింపు జానపద హీరోగా కాంతారావుకు తిరుగులేదు. కాంతారావు కుమారుడు రాజా, సుడిగుండాలు సినిమాలో నటించాడు. ఆ చిత్రానికి ఉత్తమ బాల నటుడిగా నంది అవార్డు అందుకున్నాడు. యువ నటులు రావడం, జానపద చిత్రాలు తగ్గిన క్రమంలో, స్వయంగా సప్తస్వరాలు (1969)బీ గండర గండడు (1969)బీ ప్రేమ జీవులు (1971)బీ గుండెలు తీసిన మొనగాడు (1974)బీ స్వాతి చినుకులు (1989) తదితర చిత్రాలకు నిర్మాతగా వ్యవహ రించారు. సినీ ప్రొడక్షన్ లో ఏ మాత్రం అనుభవం లేని కాంతా రావు స్వయంగా సినిమాలు తీసిన సమయాన 1969 నాటికి తెలంగా ణ రాష్ట్ర సాధన తొలిదశ ఉద్యమం సాగుతోంది. సినిమాలు ఆడే పరిస్థితి లేదు. 'సప్త స్వరాలు' 'గండర గండడు' వంటి సినిమాలు బాగున్నా ఆయన్ని ఆర్థికంగా ఆదుకోలేక పోయాయి. 'ప్రేమ జీవులు' సినిమా ఫ్లాప్. భారీ నష్టం. అయినా సినీ రంగంలోనే వెతుక్కో వాలని ఆ తర్వాత తీసిన మరో రెండు సినిమాలు కూడా లాభాలను చేతికి అందివ్వలేదు. ఫైనాన్షియర్లకు వడ్డీలు కట్టటంతో సరిపోయింది. క్యారక్టర్ ఆర్టిస్ట్ గా కొత్త అవతారం ఎత్తాల్సి వచ్చింది. ఈ లోగా తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్ కు తరలింది. పెరిగిన అప్పుల వల్ల చివరికి కట్టు కున్న ఇల్లును అమ్ముకుని, అప్పులు తీర్చి, ఒక చిన్న పెట్టెతో హైదరాబాద్ చేరారు. చిరుపాత్రలు, టి.వి. సీరియళ్ళు చేశారు. నటుడిగా కాక, వ్యక్తిగతం గా చాలా ఇబ్బందులు పడ్డారు. ఏవయినా సభలకు పిలిస్తే ఇచ్చే డబ్బులు, సన్మానాలు చేసి ఇచ్చే డబ్బుల కోసం ఆశగా ఎదురుచూసే పరిస్థితి. ప్రభుత్వ పరంగా గుర్తింపు లేదు. అతికష్టం మీద ఇచ్చిన రఘుపతి వెంకయ్య అవార్డు తప్పించి మరేమీ లేదు. అన్నీ నిరాశలే. చిట్టచివరి వరకు సొంత ఇంటికల కంటూనేవున్నారు. అడపాదడపా సినీ పెద్దలు ఎవరయినా సహాయం అందించినా అది ఇంటికి సరిపోయేంత కాదు. ఇల్లు గడవటానికి సరిపోయేంత మాత్రమే. చివరికి క్యాన్సర్ బారిన పడ్డారు.

అదీ ఆలస్యంగా గుర్తింపు. ఏ దురలవాట్లూ లేక, ఎవరికీ హాని చేయని మనిషి ఒక్క సంవత్సరంలో శరీరాన్ని తినేసిన క్యాన్సర్ దెబ్బకు మరణించారు. సినీరంగానికి వెలుపల స్నేహితులు ఉన్న వాడు కాదు కాంతారావు. తాను పుట్టి పెరిగిన సముద్రమే చేపను ఎత్తి అవతల వేస్తే అది ఎలా విలవిలా కొట్టుకుంటుందో, అలా సినీరంగమనే సముద్రపు ఆటు పోట్లకు బలైన రాకుమారుడు కాంతారావు. ప్రేక్షకుల మనసులో చెరగిపోని ముద్ర వేసిన కాంతా రావు, తన 85వ ఏట, 2009 మార్చి 22న క్యాన్సర్ వ్యాధి మూలంగా హైదరాబాద్‌లో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# "రక్త దానం ఆరోగ్యానికి ప్రయోజనకరం"




అన్ని దానాల కంటే ముఖ్యమైనది రక్తదానం. చావుతో కొట్టు మిట్టాడుతున్న మనిషిని బతికిస్తుంది రక్తం. రక్తం అంటే ఏమిటి.. రక్తదానం ఎలా చేయాలి.. ఎవరు రక్తదానానికి అర్హులు.. రక్తాన్ని దానం చేయడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలేమిటి అనే విషయాలను తెలుసుకుందాం..రక్త దానం చేయాలంటే చాలామంది ముందుకు రారు. రక్తం తగ్గితే తమ ఆరోగ్యానికి ప్రమాదమని భయపడు తుంటారు. అయితే దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన రావాలి. ఎంత రక్తం బయటికి పోతే అంత స్వచ్ఛమైన రక్తం మళ్లీ తయారవుతోంది. దీంతో మనిషి మరింత ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. కారల్ ల్యాండ్ స్టీనర్ అనే వైద్య శాస్త్రవేత్త 1900 సంవత్సరంలో రక్తాన్ని తొలిసారిగా వర్గీకరించాడు. తన పరిశోధనల్లో నాలుగు రక్త వర్గాలను కనుగొన్నాడు. అవి - A, B, AB, O అనే వర్గాలుగా విభజించాడు. ఆ తర్వాత వీటిని మళ్లీ ప్రతి గ్రూపులోనూ నెగిటివ్, పాజిటివ్ గా వర్గీకరణ చేశారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడానికి వీలుకాదు. శరీరంలో అత్యంత కీలకమైన ద్రవరూప కణజాలం రక్తమే. మొత్తం శరీర బరువులో ఎనిమిది శాతం బరువు రక్తానిదే. రక్తాన్ని పరిశీలించా లనుకుంటే పరీక్ష నాళికలో వేసిన కొంత సేపటికే అది మూడు పొరలుగా విడిపోతుంది. ఈ మూడింటిలో ఎక్కువ మందం ఉన్న పొర, ఎండుగడ్డి రంగులో, పారదర్శకంగా పైకి తేలుతూ కనిపిస్తుంది. దీనిని "ప్లాస్మా" అంటారు. దీని దిగువన, అతి తక్కువ మందంతో ఉండే తెల్లటి పొర తెల్లరక్త కణాలు. అట్టడుగున దరిదాపు ప్లాస్మా లేయర్ ఉన్నంత మందంగానూ ఎర్రటిపొర ఎర్రరక్త కణాలుగా గుర్తించవచ్చు. రక్తంలో మొత్తం 4000 విభాగాలున్నా అందులో ముఖ్యమైనవి నాలుగు మాత్రమే. ఇవి ఎముక మజ్జలో ఎప్పటికప్పుడు తయారవు తుంటాయి. అయితే దాతలు ఎవరైనా సరే రక్తాన్ని దానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడొచ్చు. రోగ నివారణ కోసం, ప్రమాదాల సమయంలో, విపత్కర ఆరోగ్య పరిస్థితుల్లో బాధితుల శరీరంలో రక్తం తగినంతగా లేకపోతే మరొకరి నుంచి రక్తాన్ని ఎక్కిస్తుంటారు. ఇలా ఒకరి రక్తం మరొకరికి ఇచ్చే విధానమే రక్తదానం. ఇలా రక్తదానం చేయడం కేవలం సేవ మాత్రమే కాదు, ప్రతి ఒక్కరి బాధ్యత. రక్తాన్ని తీసుకొనే వ్యక్తిని "గ్రహీత" అని, ఇచ్చే వ్యక్తిని "దాత" అని అంటారు. O గ్రూప్ రక్తం కలిగిన వారిని "విశ్వదాత" అని, AB. గ్రూపుల రక్తం కలిగినవారిని "విశ్వ గ్రహీత" అని అంటారు. రక్తం రంగు చూడడానికి అంతా ఒకేలా ఎర్రగా కన్పించినా కొంత మంది రక్తం కొన్ని గ్రూపుల వారికే ఉపయోగ పడుతుంది. ఎవరు ఎవరికి రక్తం దానం చేయ వచ్చంటే... AB గ్రూప్ వారు AB గ్రూప్ కి, A గ్రూప్ వారు , AB గ్రూపుల వారికి కి, B గ్రూప్ వారు B, AB గ్రూపుల వారికి కి, O గ్రూప్ వారు A,B, AB, O గ్రూప్‌ల వారందరికి దానం చేయొచ్చు. అదే విధంగా ఎవరు ఎవరి నుంచి రక్తం తీసుకోవచ్చంటే AB గ్రూప్ వారు అన్ని గ్రూపుల వారి నుంచి. B గ్రూప్ వారు B, O గ్రూపుల వారి నుంచి, A గ్రూప్ వారు A, O గ్రూపుల వారి నుంచి, O గ్రూప్ వారు O గ్రూప్ నుంచి మాత్రమే రక్తాన్ని తీసుకోవాలి. తగినంత ఆరోగ్యంగా ఉంటూ 16 నుంచి 60 సంవత్సరాల వయసు లోపల ఉన్నవారెవరైనా రక్తదాతలు కావొచ్చు.. 45 కేజీల కంటే అధిక శరీర బరువు కలిగిన వారు, రక్తపోటు, నాడీ రేటు, గుండె కొట్టుకునే స్థితి, సాధారణంగా ఉన్నవారు రక్తాన్ని దానం చేయవచ్చు. ఒక వ్యక్తి ప్రతి 3–4 నెలలకు ఒక్కసారి రక్తాన్ని దానం చేయొచ్చు. 18 ఏళ్లు నిండిన వారు జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయొచ్చు. ఈ లెక్కన ప్రతి ఒక్కరూ 672 మంది ప్రాణాలు కాపాడొచ్చు. రక్తాన్ని సేకరించిన తర్వాత 35 నుంచి 45 రోజుల పాటు నిల్వ చేస్తారు. ఈ రక్తాన్ని మూడు రూపాల్లో విభజిస్తారు. రెడ్ సెల్స్, ప్లాస్మా, ప్లేట్లెట్స్ అనే ఈ మూడు రకాలని ముగ్గురికి వారి వారి అవసరాలను బట్టి అందిస్తారు. రక్తం అవసరమైన వారికే కాదు. దానిని దానం చేసే దాతలకూ ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. రక్తదాతలకు సాటి మనుషుల ప్రాణాలు కాపాడే అవకాశం లభిస్తుంది. ఇది సాటిలేని సంతృప్తిని ఇస్తుంది. రక్తదానం చేసేవారిలో గుండెకు సంబంధించిన రోగాలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. తరచూ రక్తదానం చేయడం వల్ల శరీరంలో ఉత్పత్తయ్యే ఇనుము శాతం పూర్తి నియంత్రణలో ఉండడమే దీనికి కారణం. రక్తదానం క్యాన్సర్ బారిన పడే అవకాశాల్ని దాదాపుగా తగ్గిస్తుంది. రక్తదానం చేసేవారికి తమ శరీరానికి సంబంధించిన అనేక రకాలైన రక్త పరీక్షలను పూర్తిగా, ఉచితంగా చేసుకునే అవకాశం దొరుకుతుంది. దీనివల్ల రక్తదానం చేసేవారు తమకు తాము ఆరోగ్య వంతులుగా ఉండడానికి తగిన జాగ్రత్తలు తీసుకునే సదుపాయం ఉంది. రక్తదానం చేయడం వల్ల శరీరంలోని కేలరీలు ఖర్చు అవుతాయి. దీంతో బరువు పెరిగే ప్రమాదం నుంచి సులభంగా తప్పించుకోవచ్చు. కొవ్వు తగ్గుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉండి, శరీరం ఫిట్‌గా ఉంటుంది. ఎర్ర రక్తకణాల్లో చెడు, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి రక్తదానం చాలా ఉపయోగకరం. శరీరంలో ఇనుము స్థాయిని సమతుల్యం చేస్తుంది. రక్తంలో ఎక్కువగా ఐరన్ ఉంటే గుండెకు హాని చేస్తుంది. కార్డియో వాస్కులర్ వ్యాధులను నివారించేందుకు రక్తదానం ఉపకరిస్తుంది. మహిళల్లో వయస్సు పెరిగిన తర్వాత రుతుస్రావం పూర్తిగా నిలిచి పోయినప్పుడు (మెనోపాజ్ సమయంలో) వారి శరీరంలో నిల్వ ఉండే ఐరన్ స్థాయిని సమతుల్యం చేసుకోవడానికి రక్తదానం చేయడం చాలా మేలు కలిగిస్తుంది. ఏటా మన దేశంలో 4 కోట్ల యూనిట్ల రక్తం అవసర మవుతుంటే, అందుబాటులో ఉన్నది కేవలం 40 లక్షల యూనిట్లు మాత్రమే. మానవ రక్తానికి ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు. రక్తదానం చేయడమంటే ఓ ప్రాణాన్ని కాపాడడమే. ప్రతీ రెండు సెకన్లకు దేశంలో ఎక్కడోచోట ఒకరికి రక్తం అవసరమవుతుంది. ప్రతి రోజూ కనీసం 38,000 మంది రక్తదాతల అవసరం ఉంది. అత్యధికంగా కోరుకునే రక్తం "ఒ" గ్రూప్ దేశంలో ఏటా కొత్తగా 10 లక్షల మంది క్యాన్సర్ బాధితులుగా తేలుతున్నారు. కీమోథెరపీ చికిత్స సందర్భంగా తరచూ వారికి రక్తం అవసరం ఉంటుంది. రక్తదాన ప్రక్రియ పావుగంటలో పూర్తవుతుంది. మన శరీరంలో 10 యూనిట్ల రక్తం ఉంటే, సుమారుగా 1 యూనిట్ రక్తాన్ని దానం చేయవచ్చు. దాని వల్ల దాత శరీరానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఆరోగ్య వంతుడైన దాత ప్రతీ 56 రోజులకు ఒకసారి ఎర్ర రక్తకణాలను డొనేట్ చేయవచ్చు. ఆరోగ్యవంతుడైన దాత కనీసం 7 రోజుల విరామంతో సంవత్సరానికి 24 సార్లు ప్లేట్‌లెట్స్ దానం చేయవచ్చు. రక్తం కోసం ప్రతిరోజు ఎంతో మంది ఎదురు చూస్తున్నారు. తలసేమియా లాంటి డేంజర్ వ్యాధి గ్రస్తులకైతే ప్రతి 15 రోజుల కోసారి బ్లడ్ ఎక్కించక పోతే బతకడం కష్టం. కనుక ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి, సాటి మనుషులను బతికించుకుందాం. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పరమ పుణ్యప్రదం ... అన్నదాన మహా దానం - బ్రహ్మోత్సవాలలో వేలాది మందికి ఉచిత భోజనం

"గజ తురగ సహస్రం, గోకులం కోటి దానం, కనక రజత పత్రం, మేతిని సాగరంతం, ఉపాయ కుల విషుత్తం కోటి కన్యా ప్రదానం, నహీ నహీ బహు దానం అన్నదానం సమానం"... ఒక వ్యక్తి వెయ్యి ఏనుగులను, గుర్రాలను కానుకగా ఇచ్చినా లేదా కోటి ఆవులను, ఎన్ని వెండి మరియు బంగారాన్ని కానుకగా ఇచ్చినా, సముద్రం వరకు మొత్తం భూమిని కానుకగా ఇచ్చినా, వంశం యొక్క మొత్తం సేవలను అందించి, కోటి స్త్రీల వివాహానికి సహాయం చేసినా, అన్నదానంతో సమానం కావు. హిందూ ధర్మంలో ఆకలితో ఉన్న జీవికి ఆహారం ఇవ్వడం కంటే మంచి పూజ గానీ మరొక ఆచారం లేదని భావన. అన్నదానం అనేది మహాదానం., అన్నం అంటే ఆహారం, 'దానం' అంటే ఇవ్వడం లేదా దానం చేయడం. అన్న దానాన్ని వివిధ రకాల దానంలో 'మహాదానం' అంటారు. ఇది సనాతన ధర్మ సంప్రదాయంలో ముఖ్యమైన భాగం. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు "అన్నాద్ భవన్తి భూతాని". ఆహారం సమస్త సృష్టిని పోషిస్తుందని అర్థం. ఒక వ్యక్తి ఆకలిని తీర్చడం కోటి గోవుల దాన ఫలితంతో సమానమైనది. దానాలన్నింటిలో కెల్లా అన్నదానం మిన్న" అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదని పెద్దలు చెప్తారు. ఏది దానంగా ఇచ్చినా... ఎంత ఇచ్చినా ఇంకా ఇంకా కావాలనిపిస్తుంది. కానీ అన్నదానంలో మాత్రం దానం తీసుకున్న వారు ఇంక చాలు అని చెప్పి సంతృప్తిగా లేస్తారు. ఏ దానం ఇచ్చినా దానం తీసుకున్న వారిని మనం సంతృప్తి పరచ లేక పోవచ్చు కాని అన్నదానం చేస్తే మాత్రం దానం తీసుకున్న వారిని పూర్తిగా సంతృప్తి పరచ వచ్చును. ఎందుకంటే ఒకపూట భోజనం పెట్టి ఇతరుల కడుపు వెంటనే నింపొచ్చు. ఈ భావనతోనే ధర్మపురి క్షేత్రంలో ఏటా సాంప్రదాయ రీతిలో 13రోజులపాటు నిర్వహించే శ్రీ లక్ష్మీ నరసింహ, శ్రీ వేంకటేశ్వర స్వాముల వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్తానం పక్షాన దాతల సహకారంతో నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడు దేవస్తానం ఈఓ శ్రీనివాస్ దర్శకత్వంలో, జక్కు రవీందర్ నేతృత్వంలోని ధర్మ కర్తల మండలి ఆధ్వర్యంలో , ఉద్యోగుల, స్థానిక రైస్ మిల్లర్ల, వర్తక వాణిజ్య వ్యాపార వేత్తలు, భక్తుల సహకారంతో, నిత్యం వేలాది మందికి అన్నదాన కార్యక్రమం కొనసాగించారు.

**స్వచ్ఛంద సంస్థల సేవలు** అలాగే అన్నపూర్ణ సేవా సమితి కన్వీనర్ పెద్దంభట్ల పెద్ద నరేందర్ మార్గదర్శకత్వంలో భక్తులకు చల్లని త్రాగునీరు, లస్సీ అందించారు. నిత్యాన్న దాన సత్రం అధ్యక్షులు కొరిడె దత్తాత్రి,



కార్యదర్శి అంబరీష చారి, సభ్యుల నిర్వహణలో పులిహోర పంచి పెట్టారు. గోదావరి నది స్నానాలు దైవ దర్శనానికి వచ్చే భక్తులు, డెప్యూటేషన్ లపై విధులు నిర్వర్తించే అధికారులు, ఉద్యోగులు, భారీ బందోబస్తు ఏర్పాటు కోసం నియమితులయ్యే పోలీసులు రుచికరమైన అన్నం, సాంబారు, కూరలు, పచ్చడి, మజ్జిగ తో కమ్మని భోజనం చేసి ఆకలి తీర్చుకుని ఆనందంగా నిర్వాహకులను అభినందిస్తూ తిరిగి వెళుతున్నారు.

చురకలు



# కార్పొరేషన్ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు

కొత్తగూడెం: కొత్తగూడెం, పాల్వంచ పురపాలికలను కలిపి కార్పొరేషన్ ఏర్పాటుకు మరో ముందడుగు పడనుంది. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు అంశంపై శాసనసభలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శాసనసభ ఆమోదం అనంతరం గెజిట్‌ను గవర్నర్ జారీ చేయాల్సి ఉంటుంది. కొత్తగూడెం, పాల్వంచ పురపాలికలు, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలతో కార్పొరేషన్ ఏర్పడనుంది.

**'గూడెం'కు మహర్దశ..**

కొత్తగూడెం, పాల్వంచ జంట పట్టణాలను కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటైతే 'గూడెం' అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఓవైపు కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు పడుతుండగా.. మరోవైపు కార్పొరేషన్ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే జంట పట్టణాల్లో వ్యాపారాలు ఊపందుకుంటా



యని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ ఏర్పాటైతే రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులు అభివృద్ధికి ఊతమిస్తాయంటున్నారు. ముఖ్యంగా నూతన పరిశ్రమలు, వ్యాపారాల స్థాపనకు మార్గం సుగమమవుతుందని చెబుతున్నారు.

**ఎమ్మెల్యే చొరవకు ప్రభుత్వ తోడ్పాటు**

కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు విన్నవించారు. సీఎం సానుకూలంగా స్పందించారు. అందుకు అనుగుణంగానే కొత్తగూడెం కార్పొరేషన్ అంశాన్ని అసెంబ్లీలో ఆమోదం కోసం తీర్మానం ప్రవేశపెట్టారు.

**1,98,182 మంది జనాభా, 85.22 చ.కి.మీ. వైశాల్యం**

కొత్తగూడెం పట్టణంలోని 36, పాల్వంచలోని 24 వార్డులతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటుకానుంది. కొత్తగూడెం మున్సిపాలిటీలో 97,337 మంది, పాల్వంచ మున్సిపాలిటీలో 89,721 మంది, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీల పరిధిలో 11,124 మంది జనాభాతో కలిపి 1,98,182 మంది కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ఉండనున్నారు. కొత్తగూడెం వైశాల్యం 15.87 చ.కి.మీ., పాల్వంచ 40.87, సుజాతనగర్‌లోని ఏడు పంచాయతీలు కలిపి 28.48 చదరపు కిలోమీటర్లతో మొత్తం 85.22 చ.కి.మీ వైశాల్యంతో కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు కానుంది.కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటుతోనే సాధ్యం. ఈ విషయంపై ఏడాది కాలంగా ప్రభుత్వంతో మాట్లాడుతున్నా. ఎట్టకేలకు కార్పొరేషన్ అంశం అసెంబ్లీ ఆమోదం కోసం తీర్మానం ప్రవేశపెట్టారు. త్వరలోనే సానుకూల నిర్ణయం రానుంది. ఇందుకు సహకరిస్తున్న సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు.కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే

# అంగన్‌వాడీ తరహా అమలుతో మేలు

చెన్నూరు (: సర్కారు బడులకు వచ్చే పిల్లలకు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్న ప్రభుత్వం వారికి కోడిగుడ్డును అందిస్తోంది. వారంలో మూడు రోజులపాటు ఇది అందించాలని నిబంధనలో పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలే వీటిని దుకాణాల్లో కొనుగోలు చేసి పిల్లలకు అందిస్తున్నారు. అయితే ప్రధాన పట్టణాల్లో ప్రస్తుతం రూ. 5కే లభిస్తోంది. కానీ ఉమ్మడి జిల్లాలోని చెన్నూరు, కాసిపేట, కన్నెపల్లి, భీమిని వంటి ప్రాంతాల్లో రూ.6 నుంచి రూ. 7 వరకు విక్రయిస్తునారు. అయితే ప్రభుతం కోడిగుడ్డుకు రూ. 6 చెల్లిస్తోంది. అయినా కొన్నిచోట్ల మహిళలు రూపాయి భారాన్ని మోస్తున్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన డబ్బులు నెలనెలా మంజూరు కాకపోవడంతో నిత్యావసరాల పెరగడం, తదితర కారణాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చాలా బడుల్లో వారానికి ఒకటి, రెండుసార్లు మాత్రమే అందిస్తున్నారు.

ప్రభుత్వం నేరుగా కోడిగుడ్లు సరఫరా చేస్తే ప్రయోజనం

విపణిలోని ధరతో పోల్చితే గుడ్డుకు ప్రభుత్వం చెల్లించే ధర తక్కువగా



ఉండటంతో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు పిల్లలకు సక్రమంగా గుడ్డును అందించడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల మాదిరిగా పాఠశాలల్లో కూడా ఏజెన్సీల ద్వారా అందించాలి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఒకేసారి గుడ్లను సరఫరా చేయడం ద్వారా పిల్లలకు సక్రమంగా వడ్డించే అవకాశాలు ఉంటాయి. తద్వారా పిల్లలకు సరైన పోషకాలు అందుతాయి. దీని ద్వారా పిల్లలకు ప్రయోజనం కలగడంతోపాటు నిర్వాహకులకు గుడ్డు భారం తప్పుతుంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని పోషకులు కోరుతున్నారు.

**భారం తప్పించాలి**

విద్యార్థులకు వడ్డించే కోడిగుడ్డు ధరను ప్రభుత్వం రూపాయి పెంచినా తమకు ఆర్థిక భారం తప్పడం లేదు. మారుమూల ప్రాంతాల్లోని దుకాణాల్లో ధర రూ.7 ఉంది. గుడ్డు భారం తమకు తప్పించేలా ప్రభుత్వమే నేరుగా పాఠశాలలకు సరఫరా చేయాలి. – కోర్తె రాజమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, లింగంపల్లి

# ఫీజు చెల్లించినా.. తప్పదు నిరీక్షణ



హైదరాబాద్ : అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) కింద చాలామంది ఫీజులు చెల్లిస్తున్నప్పటికీ.. ఆయా ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ అయినట్లు ప్రొసిడింగ్స్ రావాలంటే ఇంకా కనీసం 2 నెలల పాటు నిరీక్షణ తప్పదు. దరఖాస్తుల పరిశీలన..ఎల్–1 అనుమతులు వచ్చిన తర్వాతే ప్రొసిడింగ్స్ ఇవ్వనున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో 3.2 లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాథమికంగా ఎలాంటి ఇబ్బంది లేని దరఖాస్తులకు సంబంధించి ఇప్పటికే ఫీజు చెల్లింపు కోసం ఆయా దరఖాస్తుదారులకు సమాచారం అందించారు. దీంతో చాలామంది ఫీజులు చెల్లించేందుకు ముందుకొస్తున్నారు. ఈ నెల 31వ తేదీలోపు ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఆసక్తి చూపుతున్నారు. అయితే ఫీజులు చెల్లించిన తర్వాత దరఖాస్తుదారులకు ప్రొసిడింగ్స్ లేదా కనీసం రశీదులు కూడా ఆన్‌లైన్‌లో కన్పించడం లేదు. దీంతో చాలామంది అమీర్‌పేట్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌ను ఆశ్రయిస్తున్నారు. ఇంకా సమయం పడుతుందనే సిబ్బంది సమాధానమిస్తున్నారు.

**జాప్యానికి కారణాలు ఇవే..**గతంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేస్తే...తొలుత లేఅవుట్‌ను పరిశీలించి.. దాని పరిసరాల్లో చెరువులు, కాల్వలు.. లేదంటే ఆ స్థలాలు వివాదస్పద భూ ఖాతాలో ఉన్నాయా... ఇలా అన్నీ పరిశీలించి సక్రమమని తేలితేనే ఫీజుల చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేవారు.ప్రస్తుతం భిన్నమైన పరిస్థితి నెలకొంది. తొలుత ఆయా లేఅవుట్లను పరిశీలన చేయకుండానే దరఖాస్తుదారులకు ఫీజు నోటీసులు అందిస్తున్నారు. ఫీజులు చెల్లించిన తర్వాతే సంబంధిత లేఅవుట్ సక్రమంగా ఉందా లేదా..అని అధికారులు పరిశీలిస్తున్నారు. ఉదాహరణకు లేఅవుట్‌లో ఒక ప్లాట్‌కు ఎల్ఆర్ఎస్, ఓపెన్‌స్పేస్ ఛార్జీలతో కలిపి రూ.లక్ష చెల్లించారనుకుందాం. ఒకవేళ అలాంటి దరఖాస్తు తిరస్కరిస్తే...రూ.90 వేలు మాత్రమే వెనక్కి వస్తుంది. ప్రాసెసింగ్ ఛార్జీలు కింద రూ.10 వేలు కోత విధిస్తారు.

# చి'వరి' దశలో దైన్యం



జగిత్యాల : జిల్లాలో వానాకాలంలో సాధారణం మించి వర్షం కురిసినా.. ప్రస్తుతం ఆయకట్టుకు కాలువ నీళ్లు వస్తున్నా.. చాలాచోట్ల పంటలకు సాగు నీరందని దైన్యం నెలకొంది. సాధారణం కన్నా 3–5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా ఎండలతో నీటి అవసరం ఎక్కువున్న తరుణంలోనే భూగర్భ జలమట్టం వేగంగా అడుగంటడం, చివరి ఆయకట్టుకు కాలువ నీరు అందకపోవటంతో పైర్లు ఎండుతున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలాఉంటే పంటలు పూర్తయ్యే ఏప్రిల్ చివరి వరకు పరిస్థితి ఏంటని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

నీటి తరలింపు సామర్థ్యం తగ్గి..

శ్రీరామసాగర్ కాకతీయ కాలువతో పాటుగా డిస్ట్రిబ్యూటరీలు, ఇతర కాలువల లైనించ్ చాలాచోట్ల దెబ్బతినగా చెట్లు పెరగటం, షట్టర్లు, కట్టలు శిథిలం కావటం తదితర కారణాలతో కాలువల్లో నీటి తరలింపు సామర్థ్యం తగ్గింది. యూటీలు, డ్రాపులు, సూపర్ ప్యాసేజ్‌లు, అక్విడెక్టులు తదితర నిర్మాణాలు చాలాచోట్ల దెబ్బతినటంతో ఏ కాలువనిండా నీటిని తరలించలేక చివరి ఆయకట్టుకు నీరందటం లేదు. మరోవైపు కాలువలకు అమర్చిన వేల సంఖ్యలోని మోటార్లు నీటిని ఎత్తిపోయటంతో చివరికి నీరు పారటం లేదు.

ఎస్సారెస్పీ నుంచి జోన్–2 ఆయకట్టుకు ఏప్రిల్ 2వ తేదీ వరకు, జోన్–1 ఆయకట్టుకు ఏప్రిల్ 9వ తేదీ వరకే నీరివ్వాలని అధికారులు నిర్ణయించినా నీటితడులను పొడిగించాలని కర్షకులు కోరుతున్నారు. కాకతీయ కాలువకు అమర్చిన 3 వేలకుపైగా మోటార్లను పరిమిత సమయం మేరకే నడిపించి చివరి ఆయకట్టుకు నీరుపారేలా చూడాలి. కాకతీయ కాలువకు అధిక మొత్తంలో నీటిని విడుదలచేసి కాలువల చివరి భూములతో పాటుగా గొలుసుకట్టు చెరువులు, కుంటల్లోకి తరలిస్తే భూగర్భ జలమట్టం స్థిరంగా కొనసాగి పంటలను కాపాడుకోవచ్చు.

ఇప్పటికే చాలా గ్రామాల్లో భూగర్భ జలమట్టం అడుగంటడంతో క్రేన్లు, పొకెయిన్ల సాయంతో బావుల్లో పూడికతీత పనులను రైతులు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ పథకం ద్వారా బావుల్లో పూడిక తీతను చేపడితే రైతులకు ఆసరాగా ఉంటుంది. నీటి పొదుపునకు ఉపకరించే బిందుసేద్య పరికరాలను తక్షణమే గ్రౌండింగ్ చేయాలి. జిల్లాలో వాగులపై తలపెట్టిన 75 ఆనకట్టల నిర్మాణాన్ని పూర్తిచేస్తే ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం స్థిరంగా కొనసాగుతుంది.

జిల్లాగుండా పారే వరద కాలువకూ రైతులు పెద్దఎత్తున మోటార్లను అమర్చి పంటలను సాగు చేశారు. వరద కాలువ నుంచి అమర్చిన తూముల ద్వారా గొలుసుకట్టు చెరువుల్లోకి నీటిని తరలించాల్సి ఉంది. ప్రస్తుతం ఎస్సారెస్పీలోనూ 23 టీఎంసీల నీరు మాత్రమే నిలువుండటంతో చివరివరకు పంటలకు నీరందించేలా చర్యలు తీసుకోవాలి. మరోవైపు భూగర్భ జలాన్ని సమర్థంగా వినియోగించుకునేలా విద్యుత్తు కొరత తలెత్తకుండా చూడాలి.

జిల్లాలో ఇలా (ఎకరాల్లో.. )

యాసంగి సాధారణ సాగు 3,15,620

అన్నిపంటలు సాగు చేసినది 3,36,537

వరి సాగు 2,82,790

నీరందని పొలాలు 29,000

భూగర్భ జలమట్టం (మీటర్లలో..)

డిసెంబరు 3.94

జనవరి 4.55

ప్రస్తుతం 5.21

# వాహనాలు ఇలా.. చెత్త సేకరణ ఎలా!

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడ పురపాలక సంఘం రోజురోజుకూ విస్తరిస్తోంది. పట్టణంలో ప్రతి రోజు చెత్తసేకరించి తరలించేందుకు పారిశుద్ధ్య కార్మికులు చర్యలు చేపడుతున్నారు. కాగా వ్యర్థాలను సేకరించే వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. రోజుల వ్యవధిలో మూలకు చేరుతుండటంతో పారిశుద్ధ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. మున్సిపాలిటీ మొత్తం 28 వార్డులుగా విస్తరించి ఉంది. ప్రతీరోజు చెత్త సేకరణ చేయాల్సి ఉన్నప్పటికీ వాహనాలు మరమ్మతులకు గురి కావడంతో పూర్తి స్థాయిలో సేకరణ జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణకు 20 ఆటోలు ఉండగా 15 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. వీటితో పాటు మరో 8 ట్రాక్టర్లున్నాయి. మరమ్మతులకు గురైన వాటిని మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో నిలిపి ఉంచారు. పట్టణంలో రెండు చిన్న వార్డులకు ఒకటి చొప్పున, పెద్ద వార్డుల్లో ఒకటి చొప్పున చెత్త ట్రాక్టర్లను తిప్పుతున్నారు. వాహనాల కొరత కారణంగా కొన్ని వార్డుల్లో రోజు విడిచి రోజు చెత్త సేకరణకు వస్తున్నట్లు పలు వార్డుల ప్రజలు చెబుతున్నారు.

**అయిదేళ్ల క్రితం కొనుగోలు...**

మున్సిపల్‌లోని చెత్త వాహనాలను దాదాపు అయిదేళ్ల క్రితం కొనుగోలు చేశారు. వీటి నిర్వహణ సక్రమంగా లేక తరచూ మొరాయిస్తున్నాయి. మూలకు చేరిన ఆటోలు నెలల తరబడి మరమ్మతుల షెడ్డులోనే ఉన్నాయి. కొన్ని మున్సిపల్ కార్యాలయం వెనుక భాగంలో తుప్పు పడుతున్నాయి. ఆయా వాహనాలు నడిపేందుకు ప్రత్యేకంగా డ్రైవర్లు లేరు. పారిశుద్ధ్య సిబ్బందిలో డ్రైవింగ్ వచ్చిన కొందరు వాటిని నడుపుతున్నారు. ఎప్పటికప్పుడు నిర్వహణ చేపట్టకపోవడంతో అవి మూలకు చేరుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెత్త సేకరణ సమయంలో ఎక్కడ నిలిచిపోతాయో అని భయపడాల్సిన దుస్థితి నెలకొందని సిబ్బంది పేర్కొంటున్నారు. పాత వాటికి మరమ్మతులతో పాటు కొత్తగా వాహనాల కొనుగోలుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**పలుచోట్ల అధ్వానం...**

ఆధ్యాత్మిక పట్టణం కావడంతో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తొలగిస్తున్నప్పటికీ ప్రధాన రహదారుల వెంబడి దుకాణ దారులు, లాడ్జీలు ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపిస్తుందని స్థానికులు అంటున్నారు. కొందరు ఇష్టారాజ్యంగా వ్యర్థాలను రోడ్డుపై, మురుగు కాలువల్లో పడేస్తున్నారు.



పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉదయం, రాత్రి వేళల్లో చెత్త సేకరిస్తున్నప్పటికీ శివారు వీధుల్లో పారిశుద్ధ్య చర్యలు సరిగా చేపట్టడం లేదని ఇక్కడి ప్రజలు అంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**క్రమం తప్పకుండా సేకరణ**

చెత్త సేకరించే ఆటోలు కొన్ని మరమ్మతుకు గురైనప్పటికీ సేకరణ పూర్తి స్థాయిలో జరుగుతోంది. పట్టణంలో పారిశుద్ధ్యం లోపించకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. చెత్త సమస్య ఉన్న ప్రాంతాల్లో ఉదయం, రాత్రి వేళల్లో వాహనాల ద్వారా సిబ్బంది సేకరిస్తున్నారు. వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేయకుండా చెత్త సేకరణకు వచ్చే వాహనాల్లో వేయాలి. పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

కిరణ్‌కుమార్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేములవాడ.

వేములవాడ మున్సిపల్‌లో వార్డుల సంఖ్య : 28

పట్టణ జనాభా : 56 వేలు

చెత్తసేకరణ ఆటోలు: 20

మరమ్మతులకు గురైనవి: 5

చెత్త ట్రాక్టర్లు : 8

పట్టణంలో రోజూ చెత్త సేకరణ : 21 టన్నులు

పారిశుద్ధ్య సిబ్బంది : 140

# మున్సిపాల్టీలో ప్రమాద ఘంటికలు

ఆదిలాబాద్ : జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్ మున్సిపాల్టీకి నీటి ఎద్దడి తప్పేలా లేదు. దశాబ్దాలుగా పట్టణ ప్రజల దాహం తీరుస్తూ వరప్రదాయినిగా పేరొందిన పట్టణ శివారులోని లాండసాంగ్వి వాగు ఎండిపోవడం అందరిని కలవరపెడుతోంది. దానిపై ఆధారపడ్డ పథకం నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగరథ నీళ్లు సరిపడా రావడం లేదు. ఆదినుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సరఫరా చేసే మిషన్ భగీరథ నీరు పట్టణ డిమాండ్‌కు సరిపడా ఇవ్వడం లేదనేది పుర అధికారుల వాదన. ఈ కారణంతోనే పట్టణం నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని లాండసాంగ్వి గ్రామ సమీపంలో వాగు వద్ద నిర్మించిన పాత పథకాన్ని వినియోగిస్తున్నారు. గతంలో సాత్నాల ప్రాజెక్టులో నీటిబొట్టు లేకున్నా, గోదావరి నది ఎండిపోయినా లాండసాంగ్వి వాగులో నీరుండేది. వాగుల్లో అక్కడక్కడ ఉన్న ఊటల నుంచి నీరు రావడంతో ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉండేది. సాత్నాల



వరద నీరు ఇందులోనే కలుస్తుంది. ఆదిలాబాద్ మండలం లాండసాంగ్వి మీదుగా జైనథ్‌లోని నిరాల, పెండల్‌వాడల మీదుగా పెన్‌గంగలో కలిసే ఈ వాగు ఇప్పుడు ఎండిపోయింది.

**ఇక్కట్లు మొదలు..**

వాగులోనే తవ్విన రెండు ఊటబావుల నుంచి పథకంలోని ఇన్‌టేక్‌వెల్‌కు నీరు పంపిస్తే మోటార్ల ద్వారా పట్టణంలోని మున్సిపల్ ట్యాంకుల వద్దకు నీరు సరఫరా చేస్తారు. అక్కడ నీటిని క్లోరినేషన్ చేసిన అనంతరం పలు కాలనీల్లో ఇంటింటికి అందిస్తున్నారు. ముఖ్యంగా తిర్పల్లి, మహాలక్ష్మీవాడ, బ్రాహ్మణవాడ, కుమర్‌పేట్, చించర్‌వాడ, కోలిపుర, బొక్కల్‌గూడ, భుక్తాపూర్, ఖిల్లా, వినాయక్‌చౌక్, మోచీగల్లి, రవీంద్రనగర్, శాంతినగర్, పాతహౌజింగ్‌బోర్డులకు ఈ పథకం నుంచి నీరందిస్తున్నారు. ఊటబావుల్లో నీరు లేక బుధవారం నుంచి సరఫరా నిలిచిపోనుంది. ఈ కాలనీల్లో భగీరథ సైతం సరఫరా అవుతున్నా సరిపోక సమస్య తీవ్రంకానుంది.

# అప్పుడు అక్రమం.. ఇప్పుడెలా సక్రమం

ఆసిఫాబాద్: ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాదార్ల చేతుల్లోకి వెళ్తున్నాయి. ప్లాట్లుగా రూపాంతరం చెంది భవనాలుగా మారుతున్నాయి. ఒకప్పుడు ఇవి ఆక్రమణలేనని నిర్ధారించిన అధికారులు కట్టడాలను కూల్చేశారు. అనంతరం ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో.. రూ.కోట్ల విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. కలెక్టరేట్కు సమీపంలోనే ఇంత జరుగుతున్నా.. అధికారులెవరూ అటువైపు వెళ్లకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సర్కారీ స్థలాలకు కాపాడాలనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

జిల్లాల ఆవిర్భావం అనంతరం మంచిర్యాల, కుమురం భీం జిల్లాల్లో భూ మాఫియా వ్యక్తులు చెలరేగిపోతున్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో తాము కన్నేసిన భూములను కాజేస్తున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నస్పూర్ శివారు సర్వే నంబర్ 11, 64, 42లలో ఉన్న ప్రభుత్వ భూముల్లో కబ్జాల పర్వం కొన్నేళ్లుగా కొనసాగుతూనే ఉంది. రెండేళ్ల కిందట ఈ ప్రాంతంలో 12 నివాస సముదాయాలను, మరికొన్ని తాత్కాలిక కట్టడాలను, ప్రహరీలను



అధికారులు తొలగించారు. జేసీబీతో కూల్చివేశారు. మళ్లీ తాజాగా నిర్మాణ పనులు ఊపందుకుంటున్నాయి. సమీపంలోనే కలెక్టరేట్ భవనం ఉన్నా.. కబ్జాలు కొనసాగడం గమనార్హం.

అదనంగా ఇవ్వాల్సిందే..

నస్పూర్‌లో సర్వే నం.11, 64, 42లలో లావుణి పట్టాలు ఉన్నాయి. ఇక్కడ క్రయ విక్రయాలు, నిర్మాణాలు నిషేధం. అయితే 2023లో కూల్చివేసిన చోటే ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందులో ఓ నాయకుడి ప్రధాన అనుచరుడు అన్నీ తానై ముందుండి వ్యవహారం నడిపిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. కూల్చేసిన చోటుతోపాటు, ఖాళీగా ఉన్న సర్కారీ స్థలాల్లో ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వడంతోపాటు, భవన నిర్మాణ పనులు సైతం సదరు నేతకు సంబంధించిన బిల్డర్ చేస్తున్నారు. అంటే భవనానికి దాదాపు రూ.30 లక్షలు ఖర్చు అయితే మరో రూ.5 లక్షలు అదనంగా ఇవ్వాలన్నమాట. ఈ తరుణంలో కొందరు వ్యక్తులు సదరు నేతకు అడిగినంత ఇచ్చి భవన నిర్మాణ పనులు ప్రారంభించారని సమాచారం.

## ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర మందులు

మంచిర్యాల: భానుడు భగభగ మండుతున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న జిల్లాల్లో మంచిర్యాల కూడా ఉంది. ఇప్పటికే 40 డిగ్రీలు దాటుతుండే తప్ప తగ్గడం లేదు. అప్రమత్తంగా లేకపోతే వడదెబ్బ బారిన పడే అవకాశముంది. దీంతోపాటు వేసవికాలంలో ఎక్కువగా వచ్చే డీహైడ్రేషన్ తదితర రుగ్మతలతో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. వీటి నియంత్రణకు ఆరోగ్యశాఖ ఇప్పటికే చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్యకేంద్రాలకు సరిపడా మాత్రలు, సూది మందు, సెలైన్లను సరఫరా చేసినట్లు ఇక్కడి సీఎంఎస్(కేంద్ర ఔషధ గిడ్డంగి) బాధ్యులు తెలుపుతున్నారు.

**ఓఆర్ఎస్ నుంచి డీఎన్ఎస్ వరకు..**వేసవికాలంలో ఆరోగ్యకేంద్రంతో పాటు ఇళ్లలోనూ ఓఆర్ఎస్ పొట్లాలు ఉంచుకోవడం తప్పనిసరి. ప్రస్తుతం వీటి నిల్వలు జిల్లాలోని జీజీహెచ్ నుంచి సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ, సబ్‌సెంటర్లలో సరిపడా ఉన్నట్టు సీఎంఎస్‌లోని లెక్కలు చెబుతున్నాయి. వేసవిలో అత్యవసరమయ్యే ఓఆర్ఎస్ నుంచి ఎన్ఎస్, ఆర్ఎల్, డీఎన్ఎస్, మెట్రోజిల్ సెలైన్లు సరిపడా ఉన్నాయని, ఎప్పటికప్పుడు నిల్వలు అందుబాటులో ఉంచుకుంటున్నట్లు, ఆరోగ్యకేంద్రాల అవసరం మేరకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లో అందుబాటులో ఉంచుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యటించే సిబ్బందికి సైతం కొంత మేరకు అత్యవసర మందులను వెంట ఉంచుకోవాలని సూచించినట్టు వైద్యాధికారులు వివరించారు.

# ఎగువ గ్రామాలకు ఏటా కన్నీరే!

గంగాధర : గోదావరి జలాలను బీడు భూములకు తరలించాలనే ఉద్దేశంతో నిర్మించిన గంగాధర, నారాయణపూర్ ఎల్లంపల్లి జలాశయాలు పూర్తికాక వేలాది ఎకరాల భూములు బీళ్లుగానే ఉంటున్నాయి. ఉమ్మడి జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు ఆధారంగా చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాలకు దాదాపు 1.65 లక్షల ఎకరాలకు సాగు నీరందించాలి. కానీ చెరువుల సామర్థ్యం పెంచకపోవడం, అసంపూర్తి కాలువలతో సగం విస్తీర్ణానికి కూడా అందించలేని పరిస్థితి నెలకొంది.

**1100 మీటర్ల మేర తవ్వితేనే ఫలితం**

గంగాధర, నారాయణపూర్ జలాశయాల కింద రెండు ప్రధాన సాగునీటి కాలువలు, వాటి కింద ఉపకాలువలు నిర్మించాల్సి ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి వైపు కుడికాలువ 19 కి.మీ నిర్మించాల్సి ఉండగా 18.2 కి.మీ మేరకు కాలువ తవ్వారు. గంగాధర ప్రధాన కూడలిలో ఇంకా 1100 మీటర్ల మేరకు తవ్వితేగానీ ఎగువ గ్రామాలకు నీరందించలేని దుస్థితి నెలకొంది. రంగారావుపల్లి, తాడిజెర్రి, కాసారం, గర్శకుర్తి, ఉప్పరమల్యాల, కురిక్యాల, వెంకంపల్లి, పోతుగంటిపల్లి గ్రామాలతోపాటు బోయినపల్లి మండలంలోని నాలుగు గ్రామాల్లో సుమారు 13 వేల ఎకరాలకు సాగునీరందడం లేదు.



గంగాధర, నారాయణపూర్ చెరువులను ఎల్లంపల్లి నీటితో పైపులైన్ల ద్వారా నింపి ఇక్కడి నుంచి కొడిమ్యాల, మల్యాల, బోయినపల్లి, వేములవాడ, చందుర్తి, రుద్రంగి మండలాల్లోని ఆయా గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. వాస్తవానికి జలాశయాల సామర్థ్యం 0.3 టీఎంసీలు కాగా చెరువుల్లో నీరు ఎప్పటికీ నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలి. చెరువుల కట్టల ఎత్తు 1.45 మీటర్లు పెంచాల్సి ఉండగా, కేవలం మత్తడి ఎత్తు పెంచి వదిలేశారు. గతేడాది వానాకాలంలో చెరువులు నిండి ప్రమాద స్థాయికి చేరడంతో మత్తడిని ధ్వంసం చేసి నీటిని కిందకు వదిలారు.

కాలువలు పూర్తికాక 27,500 ఎకరాలకు నీరందడంలేదు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో 210 ఎకరాలకు 147 ఎకరాల భూసేకరణ జరగక కాలువల పనులు పూర్తవడం లేదు. రామడుగు మండలంలో లక్ష్మీపూర్, దత్తోజిపేట, షానగర్, రామడుగు, ఇతర గ్రామాల్లో సాగునీటి సమస్య నెలకొంది. చొప్పదండి మండలం గుమ్లాపూర్, చిట్యాలపల్లి, కాట్నపల్లి, ఇతర గ్రామాల్లోనూ ఏటా సాగునీటికి ఇబ్బందులకు గురవుతున్నారు.

నారాయణపూర్ చెరువు కట్ట కింద దాదాపు 35 ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని ఏడాది కిందటే అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించారు. మంగపేట చెరువు నుంచి 800 మీటర్ల మేరకు కుడికాలువ తవ్వాల్సి ఉంది. కాగా గంగాధర ప్రధాన కూడలిలో జగిత్యాల రోడ్డు క్రాసింగు 300 మీటర్ల మేరకు భూమి లోపలి నుంచి కాలువ తవ్వాల్సి ఉంది. ఈ ప్రధాన కాలువ కింద మల్లాపూర్ నుంచి వేములవాడ వరకు ఉపకాలువలు తవ్వాల్సి ఉండగా భూసేకరణ సమస్య తలనొప్పిగా మారింది. ఈ చిత్రంలోని రైతు పేరు ఐతం తిరుపతి. ఈయనది రంగారావుపల్లి. వ్యవసాయ బావి ఆధారంగా మూడెకరాల్లో పంటలు సాగు చేయగా.. బావిలో నీరు అడుగంటిపోయింది. రూ.1.50 లక్షలు వెచ్చించి రెండు బోర్లు 650 అడుగుల లోతు తవ్వినా చుక్క నీరు రాలేదు. నారాయణపూర్ జలాశయ కుడికాలువ పూర్తయితే తప్ప తమకు సాగునీటి కష్టాలు తీరేలా లేవని వాపోతున్నారు.

# అసంపూర్తి నిర్మాణం.. భయం నీడన ప్రయాణం

ఇల్లంతకుంట : ఏళ్ల తరబడి ఇబ్బందులు తొలగేలా వంతెన నిర్మాణం చేపడుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గుత్తేదారు, అధికారుల నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోయాయి. దీంతో వంతెన వద్ద వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సి వస్తుంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా, ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోతోంది. ఇల్లంతకుంటకు నుంచి అనంతారం వెళ్లే మార్గంలో బిక్కవాగుపై గత ప్రభుత్వ హయాంలో లోలెవల్ వంతెన సానంలో హైలెవల్ వంతెన మంజూరు చేశారు. నిధులు మంజూరైన కొన్ని సంవత్సరాల తర్వాత నిర్మాణం ప్రారంభించారు. వంతెన మొదట్లో, చివరలో పనులు పూర్తి చేయక పోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. వర్షాకాలంలో కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రెండు వైపులా రక్షణ గోడలు నిర్మించాల్సి ఉండగా గుత్తేదారు అరకొర పనులు చేసి అసంపూర్తిగా వదిలేశారు. కనీసం హెచ్చరిక బోర్డులు లేదా రేడియం స్టిక్కర్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ మార్గంలో నిత్యం ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు పాఠశాలల బస్సులు, జిల్లా కేంద్రానికి వెళ్లే వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. సికింద్రాబాద్, కరీంనగర్, సిరిసిల్లకు నిత్యం బస్సులు వెళుతుంటాయి. రాత్రి వేళ, కొత్తగా ఈ మార్గంలో వచ్చే వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం బారిన పడాల్సిన దుసితి నెలకొంది. అసంపూర్తిగా ఉన్న వంతెన పనులను పూర్తి చేయాలని గ్రామసులు, యువకులు గతంలో ఆందోళనలు చేపట్టారు. ఎటువంటి ప్రమాదాలు జరగక ముందే చర్యలు చేపడితే బాగుంటుందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, సానిక ప్రజాప్రతినిధులు స్పందించి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఎవరూ పట్టించుకోవడం లేదు**

గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులు నేటికీ పూర్తి కాలేదు. వంతెన నిర్మించినా రెండు వైపులా రక్షణ గోడలు లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వంతెన ఎత్తుగా ఉండటంతో ఆరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వాహనాలు నడపాల్సిన పరిసితి ఎదురవుతోంది. పాలకులు స్పందించి ఇబ్బందులను పరిష్కరించాలి. అక్కెం నాగరాజు, అనంతారం

**ప్రమాదకరంగా మారింది**రక్షణ గోడలు లేకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పించే వీలులేదు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పెను ప్రమాదం చోటుచేసు కునే అవకాశం ఉంది. ఈ మార్గంలో ప్రైవేట్ బస్సులో విద్యారులను పాఠశాలకు తీసుకువెళతా. ఈ ప్రాంతంలో ఎదురుగా వాహనాలు వస్తే ఇబ్బందికర పరిసితి ఎదురవుతోంది. పండుగ వేణు, జంగంరెడ్డిపల్లె

# నియంత్రికలు.. కాలిపోతున్నాయ్



తాండూరు: ఎండలు మండుతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైబడి నమోదౌతున్నాయి. దీనికి తోడు యాసంగి పంటల సాగుకు బోర్ల నుంచి నిరంతరాయంగా నీటిని పైకి తోడడానికి విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో నియంత్రికలపై అధిక భారం పడి కాలి పోతున్నాయి. ఈ పరిణామం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

**నిత్యం 20కు పైగానే..**

జిల్లా వ్యాప్తంగా నిత్యం త్రీఫేస్, సింగిల్ ఫేస్ నియంత్రికలు 20కి పైగా కాలి పోతున్నాయి. ఇవన్నీ నియోజకవర్గ కేంద్రాలుగా ఉన్న తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్‌లోని స్పెషల్ మెయింటెనెన్స్ సెంటర్ (ఎస్‌పీఎం)కు మరమ్మతుకు వస్తున్నాయి. సిబ్బంది వీటిని స్వీకరించి సిద్ధంగా ఉన్న మరో నియంత్రికను ఇచ్చి పంపుతున్నారు. ఒక్కోసారి కేంద్రాల్లో జాప్యం జరిగితే పంటలకు సాగు నీరు అందించడంలో రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

**ఇవీ ఎదురవుతున్న ఇబ్బందులు**

కాలిపోయిన నియంత్రికలను ఎస్‌పీఎం కేంద్రాలకు తరలించడంలో రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేక వాహనాలు లేక పోవడంతో అద్దెకు మాట్లాడుకున్న ట్రాక్టర్లలో తరలించాల్సి వస్తోంది. ఇందుకు దూరాన్ని బట్టి రూ.3,000 ఖర్చు భరిస్తున్నారు. సంబంధిత గ్రామాల్లో పనిచేసే సిబ్బంది స్థానికంగా ఉండడంలేదు. దీంతో ఎల్‌సీ తీసుకుని స్థానికంగా తాత్కాలికంగా పనిచేస్తున్న సిబ్బందితో ఫ్యూజులు, ఎర్తింగ్ పనులు చేయించు కోవాల్సి వస్తోంది.

**ఎన్నెన్నో కారణాలు..**

ఎల్‌టీ లైన్లకు చెట్ల కొమ్మలు తగిలి తీగలు పరస్పరం తాకడం.
ఏబీ స్విచ్‌లు వదులుగా ఉండడం.
ఎర్తింగ్‌ను తరచూ తనిఖీ చేయక పోవడం.
రేటింగ్ ఫ్యూజు వైర్లు కాకుండా లావు తీగలు వేయడం.
నిర్ణీత పరిమాణంలో ఆయిల్ లేకపోవడం.

పరిష్కార మార్గాలు..

రైతులు పంపుసెట్ల వద్ద ఆటోమేటిక్ స్టార్టర్లను వినియోగించ రాదు. కెపాసిటర్లను బిగించుకోవాలి. ఇలా చేస్తే వోల్టేజీ స్థిరంగా ఉంటుంది. నియంత్రికలు కాలిపోవు.

**టోల్‌ఫ్రీ వినియోగించవచ్చు..**

నియంత్రికలు లేదంటే ఇతర విద్యుత్తు పరమైన సమస్యలు తలెత్తినపుడు రైతులు 1942 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించి వివరించవచ్చు.

**ఇవీ లెక్కలు**

సాగులో ఉన్న యాసంగి భూమి: 1,37,952 ఎకరాలు
వ్యవసాయ పంపుసెట్లు: 1.09 లక్షలు
విద్యుత్తు ఉపకేంద్రాలు: 76
నియంత్రికలు:4,800
సెక్షన్లు: 16
మరమ్మతు కేంద్రాలు: 4
జిల్లాలో మొత్తం విద్యుత్తు వినియోగం: 7.2 నుంచి 7.3 మిలియన్ యూనిట్లు

# స్టూడెంట్.. గంజాయి రాకెట్



హైదరాబాద్ : మత్తు పదార్థాల రవాణా.. ఒకప్పుడు పాత నేరస్థులు.. డ్రగ్స్ వ్యసనపరులు, డబ్బు కోసం అడ్డదారులు తొక్కేవారు. ఇప్పుడు విద్యార్థులే ఏజెంట్లుగా మారారు. ఇతర రాష్ట్రాల నుంచి ఖరీదైన సింథటిక్ డ్రగ్స్ తీసుకొచ్చి అమ్ముతున్నారు. తాజాగా ఘట్‌కేసర్‌లోని ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ అధికారులకు చిక్కాడు. బీదర్‌కు వెళ్లి గంజాయి తీసుకొచ్చి విద్యార్థులకు అమ్ముతున్నాడు. డబ్బు కోసం చేస్తున్నట్లు చెప్పడంతో పోలీసులు విస్తుపోయారు.

**విహారయాత్రల మాటున దందా**

గంజాయి విక్రయాలతో భారీగా కమీషన్ రావడం దందాలోకి దిగడానికి కారణమవుతోంది. ఏవోబీ సరిహద్దులో కిలో గంజాయి రూ.3 వేలకు విక్రయిస్తే.. హైదరాబాద్‌లో రూ.50 వేల వరకూ ఉంటోంది. గోవాలో కొకైన్ గ్రాము రూ.2 వేలుంటే.. నగరంలో రూ.10 వేలకు విక్రయిస్తుంటారు. డబ్బుకు ఆశపడుతున్న విద్యార్థులు విశాఖ, అరకు తదితర పర్యాటక ప్రాంతాలకు ద్విచక్ర వాహనాల మీద వెళున్నారు. తిరిగొచ్చేటప్పుడు గంజాయి తెస్తున్నారు. కొందరు ముందు ఒక వాహనాన్ని పంపించి తనిఖీలు లేవని నిర్ధారించుకొని నగరానికి తీసుకొస్తున్నారు.

**కళాశాలలపై టీజీ న్యాబ్ గురి**

తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో(టీజీఏఎన్‌బీ) ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యాసంస్థల దగ్గర మత్తు పదార్థాల వినియోగం ఎక్కువగా ఉన్నట్లు తేలితే వాటిని హాట్‌స్పాట్లుగా గుర్తిస్తున్నారు. డ్రగ్స్, గంజాయి వినియోగం, విక్రయిస్తూ పట్టుబడితే కేవలం కేసులతోనే సరిపెట్టకుండా.. నిందితుల కదిలికల మీదా నిఘా ఉంచుతోంది. వారి డేటా సేకరించి సస్పెక్ట్, హిస్టరీ షీట్లు తెరుస్తోంది. నిందితులు ఎవరితో మాట్లాడుతున్నారు..? ఎక్కడికి వెళ్తున్నారో సాంకేతికంగా నిఘా ఉంచుతోంది. విద్యార్థులతో కలిసి కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయిస్తోంది.

**ఇవీ ఉదాహరణలు**

ఈ ఏడాది జనవరిలో మేడ్చల్ ఆబ్కారీ అధికారులు గంజాయి తరలిస్తున్న ముగ్గురు విద్యార్థుల్ని అరెస్టు చేశారు. నిందితులు జొమాటో బ్యాగులో 8.6 కిలోల గంజాయి తీసుకెళ్తున్నారు. ఏపీలోని సీలేరుకు వెళ్లి 40 కిలోల గంజాయి తీసుకొచ్చినట్లు అంగీకరించారు.
ఘట్‌కేసర్‌లో గతేడాది అక్టోబరులో ఇద్దరు విద్యార్థుల్ని అరెస్టు చేశారు. బీటెక్ చదువుతూ జల్సాలకు అలవాటుపడ్డ వీరు గంజాయి కొనుగోలు చేసి అమ్ముతున్నట్లు చెప్పారు. 1.08 కిలోల సరకు స్వాధీనం చేసుకున్నారు.

# ప్రారంభానికి ముందే బంద్!



రాయదుర్గం : శేరిలింగంపల్లి.. గచ్చిబౌలి నుంచి నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మీదుగా వెళ్లేందుకు నిర్మించిన రహదారిని టీజీఐఐసీ అధికారులు ప్రారంభించకుండానే నిలిపేశారు. రహదారి పూర్తయింది కదా అని.. ప్రజలు, ప్రయాణికులు వాహనదారులు రాకపోకలు కొనసాగిస్తుండగా... కొద్దినెలల క్రితం బండరాళ్లను రహదారికి అడ్డంగా ఉంచి రాకపోకలను నిలిపేశారు. రూ.8 కోట్లతో నిర్మించిన రహదారి ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ఈ రహదారి నుంచి ఐఎస్‌బీ– కోకాపేట మీదుగా బాహ్యవలయ రహదారికి, క్యూసిటీ– గౌలిదొడ్డి– గోపన్‌పల్లి మీదుగా బాహ్యవలయ రహదారికి వెళ్లేందుకు సులువుగా ఉండేది.

**ఏడాది క్రితమే పూర్తయినా..**

నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ జిల్లాలో టీజీఐఐసీ అధికారులు రూ.8 కోట్లతో 2.5 కిలోమీటర్ల మేరకు రహదారులను అభివృద్ధి చేశారు. అందులో భాగంగా రోడ్డు నం.1, అడ్వెంచర్ రోడ్ స్కేటింగ్ చౌరస్తా (అన్వయా ప్రధాన రహదారికి అనుసంధానిస్తూ) బీటీ రోడ్డు నిర్మించారు. ఏడాది క్రితమే ఈ దారి నిర్మాణం పూర్తయింది. నాలుగు వరుసల ఈ రోడ్డు మధ్యలో డివైడర్‌ను నిర్మించి మొక్కలను పెంచారు. ఈ రహదారి మీదుగా రోజుకు పదివేల మంది నుంచి 20 వేల మంది ప్రజలు, ప్రయాణికులు నలువైపులా రాకపోకలు కొనసాగించేవారు. సాఫ్ట్‌వేర్, వాణిజ్య సంస్థల నుంచి.. ఐఎస్‌బీ– కోకాపేట ఓఆర్ఆర్ రోడ్డు మీదుగా ఓఆర్ఆర్‌కు రాపోకలు సాగించే వీలు కలుగుతుంది. ఈ రహదారిపై రాకపోకలు కొనసాగుతున్నంత వరకూ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని రోడ్డు నం.1, ఐసీఐసీఐ బ్యాంకు, విప్రో రోడ్లపై ట్రాఫిక్ భారం అంతగా ఉండేది కాదు.

**పార్కింగ్ స్థలంగా..**రోడ్డును మూసివేయడంతో ఆ దారిలో అక్కడి సాఫ్ట్‌వేర్ సంస్థలకు సేవలందించే బస్సులు, మినీ బస్సులను పార్క్ చేస్తున్నారు. స్థానికులు బండరాళ్లను కొంతమేరకు తొలగించి ఒక వైపు నుంచి అనధికారికంగా రాకపోకలు సాగిస్తున్నారు. **కోర్టులో వివాదం వల్లే..**

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ప్రభుత్వం టీజీఐఐసీకి కేటాయించిన స్థలంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఆ రోడ్డు నిర్మించామని టీజీఐఐసీ సైబరాబాద్ జోన్ ఐలా కమిషనర్, జోనల్ మేనేజర్ శారద తెలిపారు. రహదారి నిర్మించిన స్థలంపై వివాదం నెలకొందని, సుప్రీంకోర్టులో ఈ వివాదం పెండింగ్ ఉండడం వల్ల రాకపోకలు, వేలం నిలిచిపోయాయని వివరించారు.

# చలిలో వణికించిన.. కాలుష్యం

హైదరాబాద్: శీతాకాలంలో మహానగరాన్ని కాలుష్యం వణికించింది. గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు పరిశీలిస్తే పీఎం 2.5 (సూక్ష్మ ధూళి కణాల స్థాయి) అత్యధికంగా సనత్‌నగర్‌లో నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పీఎం 2.5 ఘనపు మీటరు గాలిలో 40 మైక్రోగ్రాములకు మించొద్దు. కానీ శీతాకాలంలో ఇక్కడ అత్యధికంగా 182 మైక్రోగ్రాములుగా.. అత్యల్పంగా రామచంద్రాపురంలో 25 మై.గ్రా. నమోదయ్యింది. 'ప్రధాన నగరాల్లో శీతాకాల కాలుష్య



సంక్షోభం(వింటర్ పొల్యూషన్ ఇన్ మెగా సిటీస్ ఆఫ్ ఇండియా)' అంశంపై చేసిన అధ్యయనంలో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఈ వివరాలను తాజాగా వెల్లడించింది. నాలుగేళ్ల శీతాకాలాల సగటును గమనిస్తే.. 5 శాతం తగ్గి..52 మైక్రోగ్రాములు నమోదయ్యిందని పేర్కొంది. శీతాకాలంలో కాలుష్య ఉద్గారాలు వెలువడితే అవి ఎక్కువ సమయం గాల్లోనే ఉంటాయి. జనవరిలో అత్యధిక నైట్రోజన్ డయాక్సైడ్ స్థాయి నమోదవ్వగా జూపార్కు వద్ద ఘనపు మీటరు గాలిలో 93 మైక్రోగ్రాములు నమోదైంది.

# జలసిరికి జీవం.. జలచరాలకు ప్రాణం

హైదరాబాద్: కూల్చివేతలు పూర్తయిన చెరువుల సంరక్షణకు హైడ్రా నడుం బిగించింది. తక్కువ ఖర్చుతో.. జీవం పోసేలా ప్రణాళిక రూపొందించింది. నెలాఖరులోపు పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేస్తోంది. ఆరు చెరువుల అభివృద్ధికి రూ.58.58కోట్లు వెచ్చించేందుకు తాజాగా హెచ్‌ఎండీఏ పరిపాలన అనుమతి ఇచ్చింది. ఈ పనులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం తాజాగా ఆరా తీశారు. వర్షాకాలానికి పనులు పూర్తి చేయాలని నిర్దేశించారు.

చెరువుల్లోని నీటిని ఖాళీ చేసి, పూడిక తొలగిస్తారు. చెరువు మొత్తాన్ని ఏటావాలు మైదానంలా మార్చుతారు. చుట్టూ మురుగునీటిని దారి మళ్లించే పైపులైన్లను ఏర్పాటు చేస్తారు. అనంతరం.. మధ్యలో ఉన్న చెరువు భాగాన్ని మూడు కుంటలుగా విభజిస్తారు. వాటిని రాళ్లు, నీటిని వడపోసే మొక్కలతో నింపుతారు. వరద, మురుగు రూపంలో లోపలికి వచ్చే నీరు ఆయా కుంటల్లో వడపోతకు గురవుతుంది. మధ్యలో ఉండే కుంటకు మంచినీరు చేరుతుంది. అందులో పక్షులు, ఇతరత్రా జీవజాలం మళ్లీ ప్రాణం పోసుకుంటుందని హైడ్రా ధీమా వ్యక్తం చేస్తోంది.

**మొదలైన పనులు..**ఉప్పల్ నల్లచెరువు, మాదాపూర్ సున్నం చెరువు, తమ్మిడికుంట, బమ్‌రుఖ్‌నుద్దౌలా చెరువుల్లో నీటిని బయటకు పంపించే



పనులు ఇప్పటికే మొదలయ్యాయి. మురుగు చేరకుండా తటాకాల చుట్టూ కాలువలు తవ్వి దిగువకు వదులుతున్నామని అధికారులు చెబుతున్నారు.

**స్థానికుల మద్దతు..**చెరువుల అభివృద్ధి పనులకు స్థానికుల మద్దతు లభిస్తోంది. బతుకమ్మకుంటలో పూడికతీత పనులతో బస్తీవాసులు వేడుకలు చేసుకున్నారు. తమ్మిడికుంట, నల్ల చెరువుల వద్ద స్థానికులు సంతోషంగా వ్యక్తం చేస్తున్నారని హైడ్రా చెబుతోంది.

**దశలవారీగా..**మొదట 10 చెరువులను అభివృద్ధి చేయాలని హైడ్రా నిర్ణయించింది. పలు తటాకాలపై.. ప్రైవేటు వ్యక్తులు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో జాబితా నుంచి నాలుగు తొలగిపోయాయి. రికార్డుల్లో లేని చెరువులను సైతం సర్వే చేస్తున్నామని, 1970నాటి ట్రోపో షీట్ల ఆధారంగా.. చెరువుల లెక్క తేల్చుతున్నామని కమిషనర్ తెలిపారు.

# రెడ్ జోన్‌లో ఆరు ఆవాసాలు

ఖమ్మం : మిషన్ భగీరథ పథకం ద్వారా జిల్లాలో తాగునీటిని సరఫరా చేయలేకపోతున్న ఆరు ఆవాస ప్రాంతాలను అధికారులు రెడ్ జోన్‌లో చేర్చారు. వీటిలో ఖమ్మం గ్రామీణ మండలం ఊటవాగు తండా, వేంసూరు మండలం అమ్మపాలెం, సత్యనారాయణపురం, చింతకాని మండలం బొప్పారం, పెనుబల్లి మండలం సత్యనారాయణపురం, మధిర మండలం బయ్యారం గ్రామాలు ఉన్నాయి. చాలా తక్కువ నీరు మాత్రమే సరఫరా అవుతున్న మరో తొమ్మిది ఆవాసాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించారు. మొత్తం 15 ఆవాసాల్లోని కుటుంబాలకు వేసవిలో తాగునీరందించేందుకు అత్యవసరంగా పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నారు. మిగతా 916 ఆవాసాలకు 90 నుంచి 100 శాతం తాగునీరు సరఫరా అవుతోందని చెబుతున్నారు. ఎక్కడైనా తాగునీరు అందకుంటే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామంటున్నారు.

**తక్కువ నీరు సరఫరా అయ్యే గ్రామాలు**

ఖమ్మం గ్రామీణ మండలం పిట్టలవారిగూడెం, కూసుమంచి మండలం దుబ్బతండా, కోక్యాతండా, ముదిగొండ మండలం వల్లభి, ఏన్కూరు మండలం నెమలిపురి, కల్లూరు మండలం వెన్నవల్లి, తల్లాడ మండలం కుర్నవల్లి, లక్ష్మీపురం, నారాయబంజర పైప్‌లైన్లలో ప్రెజర్ తక్కువగా ఉన్నందున తగినంత నీరు సరఫరా కావటం లేదు.

తాగునీటి సరఫరాను రోజూ హైదరాబాద్‌లోని ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. తాగునీరు అందని ఆవాసాలను రెడ్ జోన్‌లో చేర్చుతారు. రోజూ ఇవి మారుతుంటాయి. మధిర మండలం బయ్యారంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనుల్లో పైపులైన్లు దెబ్బతిన్నాయి. అందుకే నీటి సరఫరా నిలిచిపోయింది. ఖమ్మం గ్రామీణ మండలం ఊటవాగుతండా, చింతకాని మండలం బొప్పారం గ్రామానికి ప్రత్యేకంగా పైప్‌లైన్ నిర్మిస్తున్నాం. తాగునీటి సరఫరాకు సంబంధించి యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నాం.వాణిశ్రీ, మిషన్ భగీరథ (గ్రిడ్), ఈఈ, ఖమ్మం

# జంక్షన్ లో ఆగేదెలే

కూకట్‌పల్లి : కూకట్‌పల్లి జాతీయ రహదారిపై ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తొలగించేందుకు వేర్వేరు చోట్ల రెండు వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇప్పటికే నిధులు విడుదల చేయడంతో.. ఆ దిశగా అధికారులు పనిలో నిమగ్నమయ్యారు. ముందుగా స్థల సేకరణ చేయాలని నిర్ణయించగా.. అధికారుల బృందం ఆయా ప్రాంతాలను సందర్శించింది.

రంగధాముని చెరువు రోడ్డు సమీపంలో.. మూసాపేట– కూకట్‌పల్లి మార్గంలో అశోక వన్ మాల్ నుంచి కూకట్‌పల్లి ఠాణా దాటే వరకు మరో వంతెన నిర్మించనున్నారు. మధ్యలో రంగధాముని చెరువు రోడ్డు(ఐడీఎల్) దాటి వంతెన వెళ్తుంది. హైటెక్‌సిటీ, ఐడీఎల్ రోడ్డులోకి వెళ్లే వాహనాలన్నీ వంతెన కింది నుంచి వెళ్తాయి. తద్వారా ఇక్కడ ట్రాఫిక్ విభజన అవుతుంది వంతెనల నిర్మాణానికి స్థల సేకరణ దిశగా



ఏర్పాట్లు ప్రారంభించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**బాలానగర్, మూసాపేట స్టేషన్ల మధ్య**

కూకట్‌పల్లి వై జంక్షన్‌లో సిగ్నల్ పడిన కొన్ని సెకన్లలోనే మూడు వైపులా వాహనాలు బారులుతీరుతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే కృష్ణారావు వినతితో జంక్షన్ అభివృద్ధితోపాటు వంతెన నిర్మాణానికి సర్కారు ఆమోదం తెలిపింది. కూకట్‌పల్లి నుంచి మూసాపేట వైపు వెళ్లే వాహనాలన్నీ వంతెన పైనుంచి వెళ్లేలా బాలానగర్, మూసాపేట మెట్రోస్టేషన్ల మధ్యలో వంతెన నిర్మాణం చేపట్టనున్నారు.

# చెరువుకు జీవం.. చేపకు ప్రాణం

హైదరాబాద్: ఆక్రమణల నుంచి చెరువులకు విముక్తి కల్పించడం మాత్రమే కాదు.. వ్యర్థాలను తొలగించి జలవనరులకు పునరుజ్జీవనం కల్పించే చర్యలకూ హైడ్రా శ్రీకారం చుట్టింది. మొదటి దశలో కూల్చివేతలు పూర్తయిన ఆరు చెరువుల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పటికే అంబర్‌పేట బతుకమ్మకుంట, ఉప్పల్ నల్లచెరువు, కూకట్‌పల్లి నల్లచెరువు, పాతబస్తీలోని బమ్‌రుక్‌నుద్దౌలా చెరువుల్లో మురుగు బయటకు తరలించే పనులు మొదలయ్యాయి. రూ.80కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో త్వరలోనే అభివృద్ధి పనులకు టెండర్లు పిలుస్తామని హైడ్రా స్పష్టం చేస్తోంది.

**ఆరు చెరువులు ఇవే..:** అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, పాతబస్తీలోని బుమ్రుక్‌నుద్దౌలా చెరువు, మాదాపూర్‌లోని తమ్మిడికుంట, గుట్టలబేగంపేటలోని సున్నం చెరువు, కూకట్‌పల్లి నల్లచెరువు, ఉప్పల్ నల్లచెరువు



**జలచరాలకు ఆలవాలం..:** మురుగును సహజసిద్ధంగా వడపోసే మూడు సెడిమెంటేషన్ ప్లాంట్లను ప్రతి చెరువులో ఏర్పాటు చేస్తామని, తద్వారా బయటి నుంచి తటాకంలోకి వచ్చే నీరు శుద్ధి అవుతుందని, తద్వారా చేపలు, ఇతరత్రా జలచరాలకు ఆలవాలంగా తీర్చిదిద్దుతామని హైడ్రా ధీమా వ్యక్తం చేస్తోంది.

**నాలుగు అడుగులు తవ్వగానే..** బతుకమ్మకుంటకు పునరుజ్జీవం కల్పించే పనుల్లో భాగంగా.. హైడ్రా పూడికతీత చేపట్టింది. నాలుగు అడుగులు తవ్వగానే నీరు ఉబికి వచ్చింది. ఈ క్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ రామకృష్ణ యంత్రాంగంతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ ఎలాంటి పైపులైన్లు లేవన్నారు.

# తోడేస్తున్నారు.. అమ్మేస్తున్నారు



కందుకూరు : ఎండలు పెరగడంతో నీళ్ల వ్యాపారం జోరందుకుంది. కొందరు భూగర్భ జలాలు తోడేస్తూ ట్యాంకర్ల ద్వారా తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. వాల్టా చట్టానికి వ్యతిరేకంగా నీటి విక్రయాలు చేస్తున్నారు. రోజూ వందల ట్యాంకర్ల నీటిని పంట పొలాల నుంచి తోడేస్తున్నారు. దీంతో రైతుల పంటలు ఎండుతున్నాయి. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిత్యం రూ.లక్షల్లో వ్యాపారం..:** కందుకూరు మండలం లేమూరు పరిసరాల్లో ఓ రాజకీయ నాయకుడు రోజూ పొలాల్లో బోర్ల ద్వారా నీటిని ఓ గుంతలోకి తరలించి అక్కడ నుంచి ట్యాంకర్లతో తరలిస్తున్నాడు. ప్రతీ ట్యాంకర్ నీటిని రూ.1000–రూ.1200లకు విక్రయిస్తున్నాడు. గ్రామాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోతున్నాయని, నీటి అక్రమ రవాణాను నిలిపివేయాలని రైతులు కోరుతున్నారు.

ఉచిత విద్యుత్తు దుర్వినియోగం.. : ప్రభుత్వం వ్యవసాయానికి కల్పిస్తున్న ఉచిత విద్యుత్తు సదుపాయాన్ని అక్రమార్కులు నీటిని తోడేందుకు వినియోగిస్తున్నారు.

**అక్రమాలను అడ్డుకుంటాం..:** ఆరు నీళ్ల ట్రాక్టర్లను సీజ్ చేశాం.. బోర్ల ద్వారా భూగర్భ జలాలను తోడి విక్రయాలకు పాల్పడుతున్న అక్రమార్కులను అడ్డుకుంటాం. ఉచిత విద్యుత్తు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం.గోపాల్, తహసీల్దారు, కందుకూరు

# ఆదాయ మార్గాలున్నా.. అందిపుచ్చుకోరేమన్నా?



హైదరాబాద్: కళ్లెదుట ఆదాయ మార్గాలు ఉన్నప్పటికీ దృష్టి పెట్టడంలో హెచ్‌ఎండీఏ విఫలమవుతోంది. తీరా అభివృద్ధి పనుల కోసం నిధులు కొరత ఎదుర్కొంటోంది. హెచ్‌ఎండీఏ పరిధి 7 జిల్లాల్లో విస్తరించింది. ప్రధాన నగరంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలు ఉన్నాయి. ఇక్కడ పలు ఆస్తులు హెచ్‌ఎండీఏనే నిర్వహిస్తోంది. ప్రస్తుతం లేఅవుట్లు, భవనాల అనుమతులు, అద్దెల రూపంలో నెలకు రూ.70 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. అయితే ఇతరత్రా ఆదాయ మార్గాలు ఉన్నప్పటికీ వాటిని అంది పుచ్చుకోవడంలో అధికారుల తాత్సారం కన్పిస్తోంది. దీంతో నెలకు మరో రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు అదనపు ఆదాయం కోల్పోతోంది. తీరా అభివృద్ధి కార్యక్రమాల నిధులకు ప్రభుత్వం వైపు చూడాల్సి వస్తోంది. కొన్ని ప్రాజెక్టులకు అప్పుల కోసం తిప్పలు పడుతున్నారు. స్థిరమైన ఆదాయం ఉంటే నిధులను సమకూర్చుకునే అవకాశం ఉంది. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్ష చేసి...క్షేత్రస్థాయి పరిస్థితులపై అంచనా వేసే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు.

**అందుబాటులో ఉన్న స్థలాలు..**

సరోజనిదేవి నేత్ర ఆసుపత్రి నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు దాదాపు 11 కిలోమీటర్ల పీవీ ఎక్స్‌ప్రెస్‌వే కింద 300 పైనే పిల్లర్లు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి.

ఐమ్యాక్స్ పక్కన గ్రౌండ్.. సరైన మార్కెటింగ్ లేక ఒక్కోసారి ఖాళీగా ఉంటోంది. ఈ గ్రౌండ్ పక్కనే ద్విచక్ర వాహనాలు, కార్లు నిలిపే స్థలానికి ఒక గుత్తేదారు రూ.లక్షల్లో బకాయి పెట్టి ఉడాయించడంతో అప్పటి నుంచి ఖాళీగా పెట్టారు. లుంబినీపార్కులో గతంలో హెచ్‌ఎండీఏ హోటల్‌ను లీజుకిచ్చి ఆదాయం పొందేది. అయితే హోటల్ నిర్వాహకులు సైతం రూ.లక్షల్లో బకాయిలు పడి జారుకున్నారు. ప్రస్తుతం ఈ రెస్టారెంట్ ఖాళీగా ఉంది.

ఇక ఐమ్యాక్స్ ఎదురుగా ఖరీదైన స్థలం ఏడాదిన్నరగా స్థలం ఖాళీగా ఉంది. ఓ నేత కన్ను పడి కమ్యూనిటీ హాలు నిర్మించాలని దరఖాస్తు పెట్టుకుంటే హెచ్‌ఎండీఏ తిరస్కరించింది.

నెక్లెస్ రోడ్డులో పలు ప్రాంతాల్లో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు హెచ్‌ఎండీఏ అద్దెకు ఇస్తోంది. అయితే కొన్నింటిని నామమాత్రపు అద్దెలకు కొనసాగిస్తోంది. కొందరైతే బకాయిలు పడి వాటిని చెల్లించడం లేదు.

ఎన్టీఆర్ గార్డెన్ వద్ద గతంలో వాహనాలు నిలుపుదల కోసం లీజుకు ఇచ్చారు. అయితే అద్దెదారు బకాయిలను ఎగవేయడంతో ఖాళీగా ఉంది. సంజీవయ్య పార్కులో ఒకవైపు రూ.లక్షలు ఖర్చు పెట్టి పార్టీ జోన్ రూపొందించారు. పెళ్లిళ్లు, పుట్టినరోజులు, పండగలకు అద్దెకిచ్చేవారు. కరోనా తర్వాత పట్టించుకోవడం లేదు.

నగరం చుట్టూ 158 కిలోమీటర్ల ఓఆర్ఆర్ సర్వీసు రోడ్లు హెచ్‌ఎండీఏ పరిధిలోనే ఉన్నాయి. అక్కడ హోర్డింగ్‌లు పెట్టొచ్చు.

5 జిల్లాల్లో 1000 ఎకరాలకుపైగా భూములున్నాయి. వీటిని ఖాళీగా పెట్టకుండా ఆదాయ మార్గాల వైపు మళ్లించాలి.

# ప్రకృతి వనం.. కళావిహీనం



తాండూరు: జిల్లాలో పల్లె, పట్టణ ప్రకృతి వనాలు నిర్వహణ లేక కళ తప్పుతున్నాయి. ఏపుగా ఎదిగిన చెట్ల బాగోగులను చూసే వారు లేక మోడు వారుతున్నాయి. గ్రామీణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి సేద తీరేందుకు అనువుగా గత ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలకు శ్రీకారం చుట్టింది. ఆమేరకు జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఒక్కో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. ఇందు కోసం ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో వినియోగంలో లేకుండా ఉన్న ప్రభుత్వ స్థలాలను కేటాయించింది.

నిధులు నిలిచి పోవడంతో మొదలైన సమస్య: ఒక్కో ప్రకృతి వనం బాగోగులను చూసు కోవడానికి గ్రామీణ ఉపాధి హామీ ద్వారా ప్రత్యేకంగా ఒక్కో కూలిని నియమించారు. వనాల నిర్వహణకు నిధులు లేక పోవడంతో కూలీలు పనులు ఆపేశారు. దీంతో వనాలకు నీరు పట్టే వారు లేకుండా పోయారు. పెరిగే దశలో ఉన్న మొక్కలు ఎండి పోతున్నాయి. వృక్షాలు కూడా కళ తప్పాయి. పల్లె ప్రకృతి వనాల నిర్వహణను గ్రామ పంచాయతీలే చూసుకోవాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు.

**పట్టణాల్లోనూ అంతే..**

తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లోనూ పల్లె ప్రకృతి వనాల మాదిరిగానే పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం పట్టణ ప్రగతి కింద విడుదలైన నిధులను వినియోగించారు. దీంతో మొక్కలు ఏపుగా పెరిగి ఆహ్లాదకరంగా మారాయి. కొంత కాలం నుంచి పట్టణ ప్రకృతి వనాలను కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. వనాల చుట్టూరా వేసిన కంచెలు దెబ్బతినడంతో పందులు, శునకాలు ఆవాసం ఏర్పర్చుకుంటున్నాయి.

యంత్రాలకు అడ్డాగా.. కొడంగల్ మండలంలోని టేకుల్‌కోడ్ తండాలోని పల్లె ప్రకృతి వనంలో మొక్కలు లేకపోవడంతో రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ తన వాహనాలను దీన్లో నిలిపివేశారు. అంతేకాదు నిర్మాణ సామగ్రి పనులు కూడా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రకృతి వనాలను సంరక్షించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

# సొంత స్థలానికే మొదటి ప్రాధాన్యం

కరీంనగర్ : గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇందిర మహిళా పథకం ద్వారా కట్టించి ఇచ్చేందుకు పకడ్బందీ విధానాన్ని అమలు చేస్తుంది. నిర్మాణానికి ముగ్గు పోసే సమయంలో తప్పకుండా పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. వారు వచ్చి వివరాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో పనులు జరగడంలేదు. కోడ్ ఎత్తివేసిన వెంటనే పనులపై దృష్టి సారిస్తామని అధికారులు తెలిపారు. గ్రామాల్లో నిర్మాణాల అనంతరం పురపాలక, నగరపాలక సంస్థ పరిధిలో శ్రీకారం చుడతారు. అక్కడ లబ్ధిదారుల సర్వే సైతం పూర్తి చేశారు.

మొదటి విడతలో..సొంతంగా ఇంటి స్థలం ఉండి నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నవారిని ఎల్–1 విభాగం కింద విభజించారు. వారు చూపిన స్థలాన్ని జియో ఫెన్సింగ్ చేశారు.

సొంత భూమి లేనివారితో ఎల్–2 జాబితా తయారు చేశారు. వారికి స్థలంతోపాటు నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయిస్తారు.

అద్దెకున్నవారు, సొంత ఇల్లు ఉండి ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నవారిని ఎల్–3 జాబితాలో చేర్చారు.



పునాది తర్వాతే నిధులు

పునాది పనులు పూర్తయిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మొదటి విడతగా రూ.లక్ష లబ్ధిదారుడి ఖాతాలో జమ చేస్తారు. 400 చదరపు అడుగుల కంటే తక్కువ కాకుండా నిర్మించుకోవాల్సి ఉంటుంది. ప్రతి ఇంటికి 8 ట్రాక్టర్ల ఇసుకను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి కూపన్లను తహసీల్దార్ కార్యాలయం నుంచి పొందాల్సి ఉంటుంది.

# కీలక సమయం.. ప్రథమమే లక్ష్యం


తాండూరు : పదో తరగతి పరీక్షలకు ఇంకా నెల రోజులే గడువు.. ఈ సమయం ఎంతో కీలకం. అందుకనే అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు, తల్లిదండ్రులు నిత్యం కసరత్తు చేస్తున్నారు. ప్రత్యేకించి అధికారులు గతానుభవాల దృష్ట్యా (వరుసగా రెండేళ్లుగా అట్టడుగున నిలుస్తోంది) పది ఫలితాల్లో ఈ ఏడాది ప్రథమానికి చేరుకోవాలని విద్యా సంవత్సరం ఆరంభంనుంచే కృషి చేయడం ప్రారంభించారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రచించి బోధన చేయిస్తున్నారు. సమయం తక్కువ ఉండటంలో ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా మేలైన ఫలితాలను రాబట్టేందుకు చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించి 'న్యూస్‌టుడే' కథనం..

ఇప్పటివరకు ఇలా చేశారు.

ఎప్పటికప్పుడు పునశ్చరణ.

వారం, పక్షం రోజులకోసారి పరీక్షల నిర్వహణ.

పరీక్ష విధానం, మార్కుల సాధనపై విద్యార్థులకు అవగాహన.



వసతి గృహాల్లో విద్యార్థులకు సైతం ప్రత్యేక ట్యూషన్లు.

ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ఏర్పాటు.

**ఆంగ్లం, గణితంపై ప్రత్యేక శ్రద్ధ..**

గడిచిన రెండేళ్ల జిల్లా పదోతరగతి ఉత్తీర్ణతలో చిట్ట చివర స్థానం నిలవడానికి ప్రధాన కారణమైన ఆంగ్లం, గణితం సబ్జెక్టులు కావడంతో ఉపాధ్యాయులు అప్రమత్తమయ్యారు. వీటి విషయంలో విద్యార్థులు ఎక్కడ పొరపాట్లు చేస్తున్నారో ఆదిలోనే గుర్తించారు. ఎప్పటికప్పుడు పరీక్షలు పెట్టి మెరుగుపడేలా సాధన చేయించారు. మెలకువలు నేర్పించారు.

ఉపాధ్యాయులు ఆరా తీస్తున్నారు

సంజయ్య, విద్యార్థి తండ్రి, తాండూరు

పరీక్షలయ్యే వరకు మా కుమారుడు వంశీకి ఇంటి, పొలం పనులు చెప్పకూడదని నిర్ణయించాం. ప్రతి రోజు పాఠశాల ఉపాధ్యాయులు నాకు వీడియో కాల్ చేసి ఆరా తీస్తున్నారు.

ఈసారి మెరుగైన ఫలితాలు ఖాయం

రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి, వికారాబాద్.

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఈఏడాది మెరుగైన ఫలితాలు సాధించడం ఖాయం. ఎందుకంటే ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. వివిధ కారణాల వల్ల చదువులో వెనకబడిన వారు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక ప్రకారం చదివిస్తున్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు.. 174

ఆదర్శ.. 9

కస్తూర్బా.. 19

మొత్తం విద్యార్థులు.. 14,380

ప్రభుత్వ.. 7,736

వీరిలో బాలురు.. 4,254

బాలికలు.. 3,482

# ఇదో రకం మామూళ్లు దందా!

అశ్వారావుపేట : ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇసుక అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులకు కలెక్టర్, ఎస్పీ సూచించారు. అయినా అశ్వారావుపేట మండలంలోని అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే అనుమానంతో జిల్లా అధికారులు ఇసుక అక్రమ దందాపై నిఘా పెట్టాలని స్పెషల్ బ్రాంచ్ పోలీసులను ఆదేశించినట్లు సమాచారం. కొత్తగూడెం నుంచి వచ్చిన ఎస్బీ పోలీసులు అశ్వారావుపేట శివారులో తెల్లవారుజామున కాపు కాసి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు.

**అక్రమార్కులకు వత్తాసు**

అనంతారం, నారాయణపురం, గుమ్మడవల్లి సమీపంలోని వాగుల నుంచి పగలూరాత్రీ అనే తేడా లేకుండా పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. మమూళ్ల మత్తులో పడి అక్రమార్కులకు స్థానిక అధికారులు వత్తాసు పలుకుతున్నారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు.. ఇసుకను



అక్రమంగా తరలిస్తున్నా అధికారులు మొక్కుబడిగా వారానికి ఒకట్రెండు వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**భారీగా తరలింపు**

మూడు వాగుల నుంచి రోజూ సుమారు 100 ట్రక్కుల ఇసుకను అక్రమంగా తరలిస్తూ కొందరు రూ.లక్షల్లో దండుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రక్కు ఇసుక రూ.3,500 నుంచి రూ.4వేల వరకు అశ్వారావుపేటలో విక్రయిస్తున్నారు. సత్తుపల్లి, ఖమ్మం, దమ్మపేట పరిసర గ్రామాలకు అక్రమంగా తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి ట్రక్కు ఇసుక ధర పెరుగుతోంది. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు అతివేగంగా వెళ్తుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ, పోలీసు, మైనింగ్‌శాఖ సిబ్బందితో బృందాలను ఏర్పాటుచేశాం. ఏ వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారో అక్కడ 24 గంటల పాటు నిఘా పెడుతున్నాం. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసులపై ఆరోపణలు అవాస్తవం.కృష్ణప్రసాద్, తహసీల్దారు, అశ్వారావుపేట

# ఎత్తిపోయిన పథకం.. ఎండిపోయిన పొలం

ఎమ్మిగనూరు : తుంగభద్ర దిగువ కాల్వ ఆయకట్టును స్థిరీకరించి పశ్చిమ ప్రాంత రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో రూపొందించిన గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని వైకాపా 'నీరు'గార్చింది. మోటార్లు, పంప్‌హౌస్‌లు, విద్యుత్తు నియంత్రికలు, పైపులైన్లు నిర్వహణ చేపట్టకపోవడంతో పథకం ఎత్తిపోయింది. మోటార్లు బాగు చేసి ఐదేళ్లు బీళ్లుగా మారిన పొలాలకు నీళ్లు మళ్లించాలని అన్నదాతలు 'కూటమి' ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

**పైసా ఇవ్వని వైకాపా**

తుంగభద్ర నుంచి నీటిని తోడి ఆయకట్టుకు మళ్లించాలన్న ఉద్దేశంతో గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు పునాది వేశారు. రూ.180 కోట్లు వెచ్చించారు. ఏటా 5.373 టీఎంసీల నీటిని ఎత్తిపోసి 40 వేల ఎకరాల ఆయకట్టు, 10 వేల ఎకరాల ఆరుతడి పంటలకు సాగునీరు ఇవ్వాలి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో నిర్వహణకు పైసా ఇవ్వలేదు.
రైతులే స్వయంగా ఎకరానికి రూ.1,000 నుంచి రూ.2 వేల చొప్పున విరాళాలు సేకరించి మోటార్ల మరమ్మతులు, కాల్వలు, ఇతర పనులకు ఖర్చు చేశారు. సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు పారేలా



రైతులు స్వయంగా ఏటా నిర్వహణకు రూ.3 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.15 కోట్లకుపైగా ఖర్చు చేయడం గమనార్హం. కానీ కొన్ని పథకాల్లో మోటార్లు సక్రమంగా పని చేయకపోవడంతో దిగుబడులొచ్చే సమయానికి నీరు లేక ఎండిపోయి రూ.కోట్లలో నష్టపోయారు.

దొంగల పాలయ్యాయి

సోగనూరు ఎత్తిపోతల పథకంలో ఆరు మోటార్లకు మూడు పని చేస్తున్నాయి. స్టేజ్-2 పంపుహౌస్ వద్ద రెండే పని చేయడంతోపాటు జలాశయంలో ముళ్లపొదలు, రాతిపరుపు కదిలింది. నాలుగు మోటార్లకు మరమ్మతులు చేయాల్సి ఉంది. చిలకలడోణ ఎత్తిపోతల స్టేజ్-1 తుంగభద్ర నది ఒడ్డున నదికైరవాడి వద్ద స్టేజీ-1 ఏర్పాటు చేశారు. ఇందులో 1,250 కేవీ (33 కేవీ) విద్యుత్తు నియంత్రిక బిగించారు. నియంత్రికలను దొంగలు ధ్వంసం చేసి రాగితంతిని అపహరించారు.
పూలచింత స్టేజ్-1 గంగవరం వద్దనున్న ఎత్తిపోతల నియంత్రికలను దొంగలు ధ్వంసం చేసి రూ.7.50 లక్షల విలువైన 750 కిలోల రాగితంతిని చోరీ చేశారు. వీటిలో మోటార్లకు అరకొరగా మరమ్మతులు చేయించారు.
మాధవరం స్టేజ్-1 పంపుహౌస్‌లో రెండు నియంత్రికలు, మూడు స్టార్టర్లు, ఇన్సులేటర్లు, బ్రేకర్లు, బ్యాటరీలు, 9 కాపర్ షీట్లను ఎత్తుకెళ్లారు. చిలకలడోణలో మెకానిక్‌లు, అవసరమైన సామగ్రికి సుమారు రూ.20 లక్షల వరకు ఖర్చు చేయాల్సిందే. బసలదొడ్డి ఎత్తిపోతల పథకంలో రెండు పంప్‌హౌస్‌లో మోటార్లు అరకొరగా నడుస్తున్నాయి.

**రూ.17.50 కోట్లతో ప్రతిపాదనలు**

భాస్కర్‌రెడ్డి, ఈఈ

మోటార్ల మరమ్మతులు, ఇతర పనులకు సుమారు రూ.17.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం ఏడు ఎత్తిపోతల పథకాలకు అవసరమైన మోటార్లు, పైపులు, ఇతర నిర్వహణకు సిద్ధం చేశాం. పులికనుమ, పులకుర్తి ఎత్తిపోతల పథకాల నిర్వహణకు గుత్తేదారులకు గడువు ఉంది. వీటి నిర్వహణ వారే చూస్తారు. వచ్చే సీజన్‌లోపు అన్ని పథకాల ద్వారా రైతులకు సాగునీరు పారించాలన్న లక్ష్యంతో కార్యాచరణ సిద్ధం చేశాం.

# అదుపులో అతిసారం

గోపాలపురం : గోపాల పురం మండలంలోని 8 గ్రామాల పరిధిలో అతిసారం అదుపులోకి వచ్చినట్లు సీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. 9మంది ఆసుపత్రిలో ఉండగా వారిలో ఆరుగురిని ఉదయం డిశ్చార్జి చేసినట్లు సూపరింటెండెంట్ చైతన్యరాజు తెలిపారు. గోపాలపురం, చిట్యాల గ్రామాలకు చెందిన నలుగురు స్వల్ప వ్యాధి లక్షణాలతో ఆసుపత్రికి వచ్చారని, వారంతా ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ప్రస్తుతానికి ఏడుగురు ఆసుపత్రిలో ఉన్నారు.



**పారిశుద్ధ్య పనులు.. వైద్య శిబిరాలు**జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు మండలం పరిధిలో అతిసారం కేసులు నమోదైన గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు డీఎల్‌పీవో వై.అమ్మాజీ తెలిపారు. చిట్యాల, గోపాలపురం, పెద్దగూడెం, ఉప్పరగూడెం, పెద్దాపురం, వేళ్లచింతలగూడెం, వెంకటాయపాలెం గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు సైతం ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టి, పరీక్షలు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అక్కడ నుంచి ఎప్పటికప్పుడు వైద్యులు, పంచాయతీరాజ్, ఇతర అధికారులతో చరవాణిలో మాట్లాడి రోగుల పరిస్థితిపై ఆరా తీశారు. ఆయన ఆదేశాల మేరకు తెదేపా నాయకులు రోగుల సౌకర్యార్థం ఆసుపత్రిలో మూడు జంబో పంకాలు ఏర్పాటు చేశారు.

# తేలిన ఫ్రీహోల్డ్ అక్రమాల లెక్క!




చిత్తూరు : ముఖ్యమంత్రిగా జగన్ పాలన సాగించిన ఐదేళ్లు రెవెన్యూ శాఖలో యథేచ్ఛగా నిబంధనలకు నీళ్లు వదిలేశారు. వైకాపా కార్యాలయాలు, తమ మనుషులకు విచ్చలవిడిగా తక్కువ ధరకే పప్పుబెల్లాల్లా భూములు పంచారు. సార్వత్రిక ఎన్నికలు సమీపించిన తరుణంలో అసైన్డ్ భూములకు భూ యాజమాన్య హక్కు (ఫ్రీ హోల్డ్) కల్పిస్తామని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఇందులోనూ నిబంధనలకు పాతరేశారు. నాటి ప్రభుత్వ పెద్దలు చెప్పిన వారికి దోచిపెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిపై దర్యాప్తు చేయగా.. భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని వెల్లడైంది.
తిరుపతి జిల్లాలో యాజమాన్య హక్కులు కల్పించి రిజిస్ట్రేషన్ కాని భూముల్లో అత్యధికంగా గూడూరు, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్లలోనే నిబంధనలు అతిక్రమించారని తేలింది. గూడూరు డివిజన్‌లో 14,140 ఎకరాలు, శ్రీకాళహస్తిలో 13,660 ఎకరాలను ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించి మరీ ఫ్రీహోల్డ్ చేశారు. ఈ రెండు డివిజన్లలో నిబంధనలు అనుసరించి చేసిన విస్తీర్ణం 15,850 ఎకరాలు మాత్రమే కావడం గమనార్హం. అంటే నాటి రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఎంతలా సర్కార్ ఆదేశాలను తుంగలో తొక్కారో ఇట్టే అర్థమవుతోంది. తొలుత తహసీల్దార్లు, అనంతరం ఆర్డీవోలు, ఆ తర్వాత జేసీలు.. ఇలా మూడు దశల్లో ఈ భూములను వడపోసి అంతిమంగా ఈ లెక్కలు తేల్చారు.

**పునఃపరిశీలనలో పెరిగి..**

నిబంధనలకు పాతరేసి చిత్తూరు జిల్లాలో ప్రాథమికంగా 1.06 లక్షల ఎకరాలు యాజమాన్య హక్కులు ఇచ్చారని నిర్ధారణ కాగా తహసీల్దార్ల పునః పరిశీలనలో ఇది 1.18 లక్షల ఎకరాలకు చేరింది. పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని పుంగనూరు నియోజకవర్గంతోపాటు వి.కోట, బంగారుపాళ్యం మండలాల్లో ఎక్కువగా ఉల్లంఘనలు తేలాయి. కుప్పం మండలంలోనూ ఇదేవిధంగా చేశారు.

**ఏం నిర్ణయం తీసుకుంటుందో?**

తిరుపతి జిల్లాలో 58 శాతం, చిత్తూరు జిల్లాలో 74 శాతం మేర భూములకు ఎలాంటి నిబంధనలు అనుసరించకుండానే ఫ్రీ హోల్డ్ జాబితాలో చేర్చారని స్పష్టంగా అర్థమైంది. ప్రస్తుతానికి రిజిస్ట్రేషన్లు నిలిపేసినందున వేరే వ్యక్తుల పేర్ల మీదకు ఇవి బదిలీ కావు. అదేవిధంగా ఇతరులకు విక్రయించడానికి వీలు లేదు. అతిక్రమణల వివరాలన్నింటినీ సర్వే నంబర్లు, ఎల్‌పీఎంల వారీగా సీసీఎల్‌కు పంపారు. అక్కడి నుంచి ప్రభుత్వానికి నివేదించారు. వీటన్నింటిపై సర్కార్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందన్నది చర్చనీయాంశంగా మారింది. చిత్తూరు జిల్లాలో..ఫ్రీ హోల్డ్ చేసిన భూములు: 1.59 లక్షల ఎకరాలునిబంధనలకు విరుద్ధంగా జరిగాయని గుర్తించినవి: 1.18 లక్షల ఎకరాలు ఇంకా పరిశీలించాల్సినవి: 56.8.58 ఎకరాలు

# భూదాన భూమి ఇక అంతేనా..!



కాకినాడ: ఉమ్మడి జిల్లాలో కీలకమైన భూమి అది. విలువ రూ.వంద కోట్లు. ఎప్పుడెప్పుడు ఆక్రమించేద్దామా అని కొన్ని కళ్లు అక్కడే రెప్పలార్పకుండా చూస్తున్నాయి. ఇందుకోసం కొన్నాళ్లుగా చేయని ప్రయత్నం లేదు. ఆక్రమించడానికి వచ్చిన ప్రతిసారీ వ్యవహారం రచ్చకెక్కుతోంది. దీంతో పరిరక్షణ తమవల్ల కాదంటూ రెవెన్యూ యంత్రాంగమూ చేతులెత్తేసింది. కూటమి ప్రభుత్వమైనా తక్షణం రక్షణ కల్పించాలన్న అభ్యర్థనలు ఊపందుకున్నాయి.
అప్పుడు అలా: గత వైకాపా ప్రభుత్వంలో కాకినాడలోని ఆ పార్టీ నాయకుల దన్నుతో రాత్రికి రాత్రి చదును చేసి ఆక్రమించే ప్రయత్నాలు సాగాయి. చుట్టూ కందకాలు తవ్వి, హెచ్చరిక బోర్డులు పెట్టడానికి అప్పట్లో తహసీల్దారు జేసీబీ, రెవెన్యూ సిబ్బంది వెంటబెట్టుకుని వెళ్తే.. చీడీలపొర దగ్గర కాపుకాసిన వైకాపా నాయకుడి అనుచరులు బెదిరించి మరీ వెనక్కి పంపేశారు. రాత్రివేళలో సాక్షాత్తూ తహసీల్దార్ కాపలా కాసి, హెచ్చరిక బోర్డులు పెట్టినా అవి పీకేశారు. దీంతో యంత్రాంగం చేతులెత్తేసింది. వీటిని భూదాన బోర్డు స్థాయిలోనే పరిరక్షించుకోవాలని అప్పట్లో భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏకు), రాష్ట్ర భూదాన బోర్డు ఛైర్మన్‌కు కలెక్టర్ లేఖ రాయడం చర్చనీయాంశమైంది. కాకినాడలోని ప్రభుత్వ ఐటీఐ వెనుక 4.07 ఎకరాల్లో భూదాన భూములు ఉన్నాయి. ఆ పక్కన 2.38 ఎకరాలు జిరాయితీగా రెవెన్యూ ఫెయిర్ అడంగల్‌లో ఉంది. ఈ మొత్తం స్థలాన్ని భూదాన భూమిగా పేర్కొంటూ ఆంధ్రప్రదేశ్ భూదాన బోర్డు 2014 జనవరి 20న ధ్రువీకరించి పేదలకు పట్టాలు ఇవ్వడానికి తీర్మానం చేసిందని కొందరు పత్రాలు చూపుతున్నారు. ఇక్కడ స్థలాలు కేటాయించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ భూమిపై ఓ వైపు న్యాయపరమైన చిక్కులు ఉండగానే.. తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించడానికి, ఏకంగా పత్రాలే లేకుండా కొట్టేయడానికీ ప్రయత్నాలు ఏళ్లుగా సాగుతున్నాయి. ఇప్పుడు ఇలా..: మొన్న ఎన్నికల సమయాన నిర్మాణ, ఇతర వ్యర్థాలు పోస్తూ భూదాన భూమిని డంపింగ్ యార్డుగా మార్చేశారు. ఆ మార్గంలో వెళ్లేవారు ఎవరుచూసినా ఇక్కడ ఆ రాశులే దర్శనమిస్తున్నాయి. తాజాగా ఈ రాశుల వెనుక కొంత భూమిలో ఇసుక పోసి, యంత్రాలు మోహరించడం అనుమానాలకు తావిస్తోంది. దీంతో మళ్లీ ఆక్రమించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇక్కడ వ్యర్థాలు పోయడం వ్యూహాత్మకమేనా.. ఇదో డంపింగ్ యార్డుగా మార్చేస్తే అధికారులు చూసీచూడనట్లు ఎందుకు వదిలేస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. చుట్టూ రక్షణ కంచె ఏర్పాటులో తాత్సారంతోనే ఆక్రమణ ప్రయత్నాలు ఊపందుకున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# 'ఊరికి విలీన' ఉరి

కర్నూలు : దూపాడు నుంచి లక్ష్మీపురానికి సుమారు 1.50 కి.మీ.ల మేర రహదారి ఉంది. అడుగడుగునా గుంతలు తేలి ప్రమాదకరంగా మారింది. గ్రామ పంచాయతీ పరిధిలో ఉండి ఉంటే.. కనీసం ఉపాధి నిధులతోనైనా రహదారిని అభివృద్ధి చేసే అవకాశం ఉండేదని స్థానికులు వాపోతున్నారు. ళ్లను మున్సిపాలిటీల్లో విలీనం చేసి ఉపాధికి దూరం చేశారు. గత పాలకుల స్వార్థంతో 2021 పుర ఎన్నికల ముందు లక్ష్మీపురం, పెద్దపాడు, పందిపాడు గ్రామాలను కర్నూలు నగర పాలకలో, రైతునగరం, కాంతినగర్, పొన్నాపురం కాలనీ, బీటీ నగర్, పొన్నాపురం, వెంకటేశ్వరపురం, ఉడుమాల్పురం గ్రామాలను నంద్యాల మున్సిపాల్టీలో విలీనం చేశారు. పంచాయతీలుగా ఉన్నప్పుడు ఉపాధి నిధులు దండిగా వచ్చేవి.. పనులు జరిగేవి.. కూలీలకు ఉపాధి దొరికేది.. మున్సిపాలిటీల్లో విలీనం చేసి పన్నులు పెంచారు.. ప్రగతిని దూరం చేశారు.. నాలుగేళ్లుగా సమస్యల్లో నలిగిపోతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**61 వేల మందికి అవస్థలు**

విలీనమైన గ్రామాల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారింది. పది గ్రామాల్లో 61 వేల మంది నివాసం ఉంటున్నారు. విలీనానికి ముందు రైతునగరం పంచాయతీ పరిధిలో 275, కాంతినగర్ 125, ఉడుమాల్పురం 285, పొన్నాపురంలో 450, లక్ష్మీపురంలో 350, పెద్దపాడు 250, పందిపాడులో 320 మంది జాబ్‌కార్డులు ఉండేవి. ఉపాధి జాబ్‌కార్డులున్న వారంతా ఉపాధిహామీ పథకం కింద పనులకు వెళ్తూ సంపాదించుకునే వారు. ఆయా గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసిన తర్వాత పనులు చేపట్టడం లేదు. జాబ్‌కార్డులు చెల్లుబాటు కావడం లేదు. ఉపాధిహామీ పథకానికి అనుబంధంగా ఉన్న అన్ని రాయితీ పథకాలను రద్దు చేశారు.

**ఒక్కో గ్రామానికి రూ.2 కోట్ల నష్టం**

ఒక గ్రామంలో 100 మంది ఉపాధి కూలీలు పనికి వెళ్తున్నట్లయితే.. ఒక్కో వేతనదారు ఏడాదిలో వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకుంటే 10 వేల పని దినాలు జరిగినట్లు లెక్క. రోజు కూలి రూ.300 లెక్కన వేసుకుంటే ఏడాదికి రూ.30 లక్షలు కూలి రూపంలో కోల్పోయినట్లే.



ఇదే సమయంలో 40 శాతం ఇచ్చే మెటీరియల్ కాంపొనెంట్ నిధులు మరో రూ.20 లక్షలు నష్టపోయినట్లే. మొత్తం రూ.50 లక్షలు కోల్పోయినట్లే. గత నాలుగేళ్లలో ఉపాధిహామీ పనులు జరగకపోవడం వల్ల ఒక్కో విలీన గ్రామం రూ.2 కోట్ల మేర నష్టపోవాల్సి వచ్చింది.

వేధిస్తున్న అసౌకర్యాలు

కర్నూలు కార్పొరేషన్‌లో విలీనమైన లక్ష్మీపురం, పెద్దపాడు, పందిపాడు గ్రామాల్లో సీసీ రోడ్లు కనిపించవు. మురుగు కాల్వలు ఏర్పాటు చేయలేదు. దీంతో మట్టిరోడ్లపైనే మురుగు పారుతోంది.

**రాయితీ పథకాలకు దూరం**

ఉపాధిహామీ పథకం గ్రామాలకే పరిమితం. ఈ పథకం కింద కూలి పనులు కల్పించడంతో పాటు గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 90 శాతం రాయితీతో మినీ గోకులాలను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. జాబ్‌కార్డులు ఉన్న వారికే పశుగ్రాస క్షేత్రాలను మంజూరు చేస్తున్నారు. ఈ రెండు పథకాలకు విలీన గ్రామాల ప్రజలు దూరమయ్యారు. మరోవైపు చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో పంటకుంటలు, ఇళ్ల ముంగిట తవ్వకునే ఇంకుడు గుంతలనూ వీరికి మంజూరు చేయడం లేదు.

# నీరు ఇంకింది.. ఇసుక ఆగింది

కర్నూలు : తుంగభద్రలో ఇసుక నిల్వలు ఖాళీ అయ్యాయి.. సుంకేసుల జలాశయంలో నీటిమట్టం తగ్గడంతో డీసిల్టింగ్ పాయింట్లలో తవ్వకాలు నిలిపేశారు. ప్రస్తుతం 1,500 టన్నులు అందుబాటులో ఉంది ఉదయానికి ఖాళీ కానుంది. సి.బెళగల్ మండలం కొత్తకోట, కె.సింగవరం, పల్దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల పరిధిలో ఐదు డీసిల్టింగ్ పాయింట్లున్నాయి. సుంకేసుల జలాశయం వెనుక ప్రాంతంలో.. తుంగభద్ర నదిలో నీరు ఉంటేనే డ్రెడ్జింగ్ చేసి బోట్ల సాయంతో ఇసుక తవ్వకాలు చేపడతారు. ప్రస్తుతం ఎగువ నుంచి నీరు రావడం లేదు.. జలాశయంలో 0.750 టీఎంసీ ఉన్నా బోట్ల ద్వారా వెళ్లి ఇసుక తవ్వకాలు జరిపేందుకు వీలవుతుంది. ప్రస్తుతం 0.5 టీఎంసీ మాత్రమే ఉండటంతో తవ్వకాలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఎగువ నుంచి నీరు రాకపోతే డీసిల్టింగ్ పాయింట్లు మూతపడే పరిస్థితి నెలకొంది.

**అనుమతులకు నిరీక్షణ**

మరళి-1లో మాన్యువల్‌గా ఇసుక తవ్వకాలకు అనుమతి ఉన్నప్పటికీ కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఇక మరళి-2 ఇసుక రీచ్‌లో సెమీ మెకనైజ్డ్ యంత్రాలతో ఇసుక



తవ్వకాలకు అనుమతులున్నాయి. రీచ్ వరకు ఇసుక రవాణా చేసేందుకు రోడ్డు వేయాల్సి ఉంది. ఈ రెండు రీచ్‌లలో అనుమతులు వచ్చేందుకు, రహదారి నిర్మాణానికి 10-15 రోజుల సమయం పడుతుంది. ఈ రెండు రీచ్‌ల నుంచి 50 వేల టన్నుల ఇసుక లభ్యత ఉంది.

**అక్కడికెళ్లాలంటే తడిసిమోపెడు**

కర్నూలు నగర ప్రజలు ఇసుక కోసం కౌతాళం మండలం నదిచాగి, గుడికంబాలి ఇసుక రీచ్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. కౌతాళం మండలం గుడికంబాలి, నదిచాగి ఇసుక రీచ్‌ల్లో ప్రస్తుతం 3 లక్షల టన్నుల నిల్వలున్నాయి. గుడికంబాలిలో ఒక టన్ను రూ.39, నదిచాగిలిలో రూ.40 మాత్రమే.
కర్నూలు నగరవాసులకు ఇసుక కావాలంటే 150 కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాలి.
డీసిల్టింగ్ పాయింట్ల నుంచి నంద్యాలకు నిత్యం సుమారు 2 వేల టన్నుల ఇసుక తరలిస్తున్నారు. బుధవారం నుంచి పూర్తిగా ఆగిపోనుంది. కౌతాళం మండలం నదిచాగి, గుడికంబాలి నుంచి నంద్యాలకు 18 టన్నుల ఇసుక లోడు లారీకి రవాణా ఛార్జీలతో కలిసి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు రవాణా భారం పడనుంది.
డీసిల్టింగ్ పాయింట్ల నుంచి కర్నూలుకు 18 టన్నుల ఇసుక లారీ వచ్చేందుకు రూ.10 వేలు ఖర్చవుతుంటే.. అదే కౌతాళం మండలంలోని ఇసుక రీచ్‌ల నుంచి కర్నూలుకు ఇసుక రవాణా చేసేందుకు ఒక లారీకి రూ.10 వేల వరకు అదనపు భారం పడుతుంది.

# 'పల్లె'వించని ప్రగతి

నంద్యాల : ఊళ్లను మున్సిపాలిటీల్లో విలీనం చేసి ఉపాధికి దూరం చేశారు. గత పాలకుల స్వార్థంతో 2021 పుర ఎన్నికల ముందు లక్ష్మీపురం, పెద్దపాడు, పందిపాడు గ్రామాలను కర్నూలు నగర పాలకలో, రైతునగరం, కాంతినగర్, పొన్నాపురం కాలనీ, బీటీ నగర్, పొన్నాపురం, వెంకటేశ్వరపురం, ఉడుమాల్పురం గ్రామాలను నంద్యాల మున్సిపాల్టీలో విలీనం చేశారు. పంచాయతీలుగా ఉన్నప్పుడు ఉపాధి నిధులు దండిగా వచ్చేవి.. పనులు జరిగేవి.. కూలీలకు ఉపాధి దొరికేది.. మున్సిపాలిటీల్లో విలీనం చేసి పన్నులు పెంచారు.. ప్రగతిని దూరం చేశారు.. నాలుగేళ్లుగా సమస్యల్లో నలిగిపోతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**61 వేల మందికి అవస్థలు**

విలీనమైన గ్రామాల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారింది. పది గ్రామాల్లో 61 వేల మంది నివాసం ఉంటున్నారు. విలీనానికి ముందు రైతునగరం పంచాయతీ పరిధిలో 275, కాంతినగర్ 125, ఉడుమాల్పురం 285, పొన్నాపురంలో 450, లక్ష్మీపురంలో 350, పెద్దపాడు 250, పందిపాడులో 320 మంది జాబ్‌కార్డులు ఉండేవి.
ఉపాధి జాబ్‌కార్డులున్న వారంతా ఉపాధిహామీ పథకం కింద పనులకు వెళ్తూ సంపాదించుకునే వారు. ఆయా గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసిన తర్వాత పనులు చేపట్టడం లేదు. జాబ్‌కార్డులు చెల్లుబాటు కావడం లేదు. ఉపాధిహామీ పథకానికి అనుబంధంగా ఉన్న అన్ని రాయితీ పథకాలను రద్దు చేశారు.

**వేధిస్తున్న అసౌకర్యాలు**

నంద్యాల మున్సిపాల్టీలో విలీనమైన ఉడుమాల్పురం, వెంకటేశ్వరపురం గ్రామాల్లో తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. కుంట నుంచి మోటార్ల ద్వారా సరఫరా చేస్తున్న నీటినే ఈ గ్రామాల ప్రజలు తాగుతున్నారు. కాంతినగర్ కాలనీలో ట్యాంకు సిద్ధమైనా మున్సిపాల్టీ నుంచి నీరు సరఫరా చేయడం లేదు. దీంతో ప్రజలు నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. పొన్నాపురం, బీటీ.నగర్, పొన్నాపురం కాలనీలు బోరు నీటిపైనే ఆధారపడ్డాయి.

ఒక్కో గ్రామానికి రూ.2 కోట్ల నష్టం

ఒక గ్రామంలో 100 మంది ఉపాధి కూలీలు పనికి వెళ్తున్నట్లయితే.. ఒక్కో వేతనదారు ఏడాదిలో వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకుంటే 10 వేల పని దినాలు జరిగినట్లు లెక్క. రోజు కూలి రూ.300 లెక్కన వేసుకుంటే ఏడాదికి రూ.30 లక్షలు కూలి రూపంలో కోల్పోయినట్లే. ఇదే సమయంలో 40 శాతం ఇచ్చే మెటీరియల్ కాంపొనెంట్ నిధులు మరో రూ.20 లక్షలు నష్టపోయినట్లే. మొత్తం రూ.50 లక్షలు కోల్పోయినట్లే. గత నాలుగేళ్లలో ఉపాధిహామీ పనులు జరగకపోవడం వల్ల ఒక్కో విలీన గ్రామం రూ.2 కోట్ల మేర నష్టపోవాల్సి వచ్చింది.

**రాయితీ పథకాలకు దూరం**

ఉపాధిహామీ పథకం గ్రామాలకే పరిమితం. ఈ పథకం కింద కూలి పనులు కల్పించడంతో పాటు గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 90 శాతం రాయితీతో మినీ గోకులాలను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. జాబ్‌కార్డులు ఉన్న వారికే పశుగ్రాస క్షేత్రాలను మంజూరు చేస్తున్నారు. ఈ రెండు పథకాలకు విలీన గ్రామాల ప్రజలు దూరమయ్యారు. మరోవైపు చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో పంటకుంటలు, ఇళ్ల ముంగిట తవ్వకునే ఇంకుడు గుంతలనూ వీరికి మంజూరు చేయడం లేదు.

చురకలు



# పేద రోగుల పెన్నిధి

అనకాపల్లి : వ్యాధి నిర్ధారణ అయితే వైద్యం చేయడం సులభం. దీనికి ల్యాబ్‌లో పరీక్షలు అవసరం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల రక్త, మూత్ర పరీక్షలు చేయడానికి వీలు లేకపోవడంతో పేద రోగులకు ఆర్థికంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేలా కూటమి ప్రభుత్వ హయాంలో జిల్లా ఆసుపత్రుల్లో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను నెలకొల్పాలని నిర్ణయించారు.

జిల్లా ఆసుపత్రిలో జనరల్ ల్యాబ్, మైక్రోబయాలజీ, ఐసీటీసీ, పీపీటీసీటీ, సీబీనాట్ ల్యాబ్‌ల్లో పరీక్షలు చేస్తున్నారు. దీంటో పాటు క్యాన్సర్ పరీక్షలు చేస్తున్నారు. జనరల్ ల్యాబ్‌లో ఇటీవల సీబీసీ ఫుల్లీ ఆటోమెటిక్ మిషన్ అందుబాటులోకొచ్చింది. ఒకేసారి 100 నమూనాలను ఇందులో పరీక్ష చేయొచ్చు. రోజుకు 600 నుంచి 800 రకాల పరీక్షలను చేస్తున్నారు. సెమీ ఆటోమెటిక్ సీబీసీ మిషన్ ఇదివరకు ఉండేది. ఇప్పుడు ఫుల్లీ ఆటోమెటిక్ మిషన్‌ను అందుబాటులోకి తెచ్చారు. థైరాయిడ్ పరికరంతో పరీక్షలు చేస్తున్నారు.



**మైక్రోబయాలజీలో..**

జనరల్ ల్యాబ్‌లో మూత్ర, రక్తపరీక్షలు కలిపి 63 వరకు జరుగుతున్నాయి. మైక్రోబయాలజీకి సంబంధించి 10 పరీక్షలు చేస్తున్నారు. గుండెకు సంబంధించి ట్రాఫిక్‌ఐ, ట్రాఫిన్‌టీ పరీక్షలతో పాటు థైరాయిడ్ పరీక్ష చేస్తున్నారు. హెచ్‌బీఏఐసీలో మూడునెలలకు సంబంధించి రోగి శరీరంలో చక్కెరకు సంబంధించిన పరీక్ష ఇక్కడ జరగడం లేదు. ఇది బయట చేయించుకోవాల్సి వస్తోంది. 'జిల్లా ఆసుపత్రిలో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను పెట్టాలని ఇటీవల బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయించారు. దీంట్లో భాగంగా అనకాపల్లి ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు చేసే ల్యాబ్ అందుబాటులోకి రానుంద'ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు.

**వ్యాధి నిర్ధారణ చేపట్టేలా...**

– డాక్టర్ ఉప్పాడ రమేశ్, పేథాలజిస్టు, జిల్లా ఆసుపత్రి

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే రక్తపరీక్షలు చాలావరకు చేస్తున్నాం. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ఏర్పాటుతో మరిన్ని పరీక్షలు అందుబాటులోకొస్తాయి. అనకాపల్లి ఆసుపత్రిలో ఇద్దరు పేథాలజిస్ట్‌లు ఉన్నా. మరిన్ని సేవలు అందించడానికి ప్రయత్నిస్తున్నాం.

# పోలీసు శాఖలో ప్రక్షాళన

చిత్తూరు : జిల్లాలో భారీగా పోలీసుల బదిలీలు జరిగాయి. పుంగనూరు మండలం కృష్ణాపురంలో తెదేపా కార్యకర్త రామకృష్ణ హత్యపై పలమనేరు ఎమ్మెల్యే పోలీసు శాఖపై తీవ్ర స్థాయిలో మండిపడిన విషయం విదితమే. అన్ని పోలీస్‌స్టేషన్‌లలో వైకాపాకు ఒత్తాసు పలికే పోలీసులే విధులు నిర్వహిస్తున్నారని.. ప్రతి విషయాన్ని పార్టీకి చేరవేస్తున్నారని, వారి ద్వారా అక్రమ వ్యాపారాలన్నీ సాగుతున్నాయని ఆరోపించారు. ఇలా పోలీసు శాఖపై ఒక్కసారిగా ఆరోపణలు రావడంతో ఎస్పీ అప్రమత్తమయ్యారు. బదిలీ ప్రక్రియ ప్రారంభించారు. 45 మంది ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుళ్లు, 219 కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. పుంగనూరు నియోజకవర్గం పరిధిలో పనిచేసే వారే సుమారు 25 మంది ఉన్నారు. అందులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కూడా ఉన్నారు.

**అసంతృప్తి సెగలు** పోలీసు శాఖపై విమర్శలు వస్తుండడంతో ఎస్పీ బదిలీల ప్రక్రియ ప్రారంభించినా.. అందులోనూ విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని అడగకుండా బదిలీ చేసినా పర్వాలేదు కాని.. ఎలాంటి ఆరోపణలు లేని వారిని కూడా అడగకుండా బదిలీ చేయడంతో పోలీసు శాఖలోనే అసంతృప్తి సెగలు వస్తున్నాయి. 4–5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారందరిని బదిలీ చేయాల్సి ఉంది. దీని కోసం ఒక్కొక్కరి నుంచి మూడు ఆప్షన్‌లు తీసుకుని బదిలీ చేస్తుంటారు. 219 మందిని బదిలీ చేయాల్సి ఉండగా.. రాత్రే అందరి బదిలీలు పూర్తి చేశారు. 219 మందికి ఎలాంటి కౌన్సెలింగ్ లేదు. **ఉనికి చాటుకోవడానికేనా?** 'పోలీసు శాఖలో ఎవరి మాట వినను. రాజకీయ నాయకుల సిఫార్సులొస్తే తిప్పికొడతా..' అని చెప్పిన ఎస్పీ విమర్శలు మూటగట్టుకున్న అనంతరం శాంతించారు. మొదట్లో సీఐలు, ఎస్సైలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకుని.. జూద స్థావరాలు, లాటరీ వ్యాపారాలు, మద్యం అక్రమ రవాణా, ఇతర అక్రమ వ్యాపారాలపై ఆకస్మిక దాడులు చేశారు. రాజకీయ నాయకులు ఒత్తిడి తెచ్చినా మొండిగానే వ్యవహరించారు. అయితే ఏం జరిగిందో ఏమో కానీ ఒక్క సారిగా ప్రత్యేక బృందాల దాడులు ఆగిపోయాయి. అక్రమ వ్యాపారాలన్నీ ఒకొక్కటిగా ప్రారంభమయ్యాయి. ప్రస్తుత బదిలీలు కూడా తన ఉనికి చాటుకోవడానికే అని పలువురు పేర్కొంటున్నారు.

# భూముల్లో తీగలు.. ఉండవిక బాధలు

గురుద్వారా : విపత్తుల సమయంలో విద్యుత్తు వ్యవస్థ చిన్నాభిన్నమై సరఫరాకు అంతరాయం ఏర్పడటమే గాక ఏపీఈపీడీసీఎల్‌కు తీవ్ర ఆస్తినష్టం వాటిల్లుతోంది. ఈ సమస్య అధిగమించేలా భూగర్భ విద్యుత్తు తీగల వ్యవస్థ ఏర్పాటుకు ప్రపంచ బ్యాంకు నిధులతో రూపకల్పన చేశారు. తొలి విడతగా నగరంలో ఇదివరకు రూ.800 కోట్లతో జోన్–1 పరిధిలో వన్‌టౌన్ మొదలుకొని రుషికొండ వరకు సముద్రతీర ప్రాంతంలో పనులు చేశారు. పలు కారణాల రీత్యా కొన్నేళ్ళుగా పనులు నిలిపివేశారు. ప్రస్తుతం ఆర్‌డీఎస్‌ఎస్(రీవేంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం) కింద రెండో విడత పనులు పునఃప్రారంభించారు. వీటికోసం రూ.973.44 కోట్లు కేటాయించారు. జీవీఎంసీ పరిధిలో కూర్మన్నపాలెం నుంచి ఆనందపురం వరకు ఈ పనులు చేపడుతున్నారు. గతంలో ఇంటి నుంచి విద్యుత్తు స్తంభాలకు వెళ్లే తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకి సరఫరా చేసే హెచ్‌టీ తీగలు అంతా కలిపి భూగర్భంలోనే వేశారు. దీనివల్ల ఆర్థికభారం అధికమవ్వడంతో ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో స్వల్ప మార్పులు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి సబ్‌స్టేషన్‌కు సరఫరా అయ్యే 33, 11కేవీ విద్యుత్ తీగలు మాత్రమే భూగర్భంలోకి వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు.. 33కేవీకి సంబంధించి రూ.340 కోట్లతో 547 కిలోమీటర్ల వరకు, రూ.633 కోట్లతో 11కేవీ తీగలు 1740 కిలోమీటర్ల వరకు వేస్తున్నారు. ఆటోనగర్‌లో జరుగుతున్న పనులను ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెళ్లి పరిశీలించారు. రానున్న రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు.

# కొత్త ప్రాజెక్టులతో దూకుడు..!



అనకాపల్లి: బొగ్గు ఆధారిత విద్యుత్తు ఉత్పత్తిలో తిరుగులేని సంస్థగా పేరొందిన ఎన్టీపీసీ ఇప్పుడు హరిత ఇంధన రంగంలో దూకుడు చూపబోతుంది. ప్రధాని మోదీ చేతుల మీదుగా రెండు నెలల క్రితం శంకుస్థాపన జరుపుకొన్న పూడిమడక గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులను త్వరలో కార్యరూపంలోకి తీసుకురాబోతుంది. ఇక్కడ నిర్మించబోయే ప్లాంట్‌కు జపాన్ దేశం సహకారంతో సాంకేతిక డీపీఆర్ సిద్ధం చేశారు. అదనంగా కావాల్సిన వసతులపై దృష్టిసారించారు. పరవాడలో సోలార్ విద్యుత్తు ఉత్పత్తి విస్తరణ దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు కేంద్ర అనుమతులను సాధించారు. ఈ పనులన్నీ మొదలైతే స్థానికంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

**పూడిమడక ప్లాంట్‌కు అదనపు భూములు..**

అచ్యుతాపురం సెజ్‌ను ఆనుకుని పూడిమడకలో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటు కాబోతుంది. ప్రస్తుతం ఈ సంస్థ చేతిలో 1200 ఎకరాల భూములున్నాయి. వాటిని 12 ప్లాట్లుగా అభివృద్ధి చేసి 12 యూనిట్లు నెలకొల్పనున్నారు. వీటి ద్వారా రోజుకు 1500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా, మిథనాల్, యూరియాతో పాటు విమాన ఇంధనాన్ని ఉత్పత్తి చేయనున్నారు. ఇందుకోసం విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నారు. ఈ లేఅవుట్ పనులు ఈనెలలోనే మొదలుకానున్నాయని ఎన్టీపీసీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ హబ్ అవసరాల కోసం సముద్ర జలాలను భారీగా వాడుకోనున్నారు. దీని కోసం రెండుచోట్ల డీశాలినేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటికి అదనంగా మరో 400 ఎకరాల భూములు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు.

**సౌర విద్యుదుత్పత్తి విస్తరణ..**

పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ ఆవరణలోని జలాశయంలో తేలియాడే (ఫ్లోటింగ్) సోలార్ పలకలతో ప్రస్తుతం 25 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. తాజాగా మరో 18.5 మెగావాట్ల అదనపు విద్యుత్తు ఉత్పత్తి చేసేలా ఫ్లోటింగ్ సోలార్ పలకలను ఏర్పాటు చేయబోతున్నారు. ఈ పనులు ఒకటి రెండు నెలల్లో మొదలు కానున్నాయి. వీటితో నీటిపై తేలియాడే సోలార్ పలకల నుంచి ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి చేసే సంస్థగానూ గుర్తింపు పొందనుంది.

ఇప్పటికే ఏపీఐఐసీ అధికారులతో అదనపు భూ కేటాయింపులపై చర్చించారు. మరోవైపు ఇక్కడ ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతుల కోసం సముద్రం చెంత మినీ ఓడరేవు నిర్మించేందుకు మారిటైం బోర్డుతో సంప్రదింపులు చేస్తున్నారు. ఈ ప్లాంట్‌పై ఎన్టీపీసీ రెండు దశల్లో రూ.1.85 లక్షల కోట్లు ఖర్చుచేయనుందని, సుమారు 30 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయని అధికారులు చెబుతున్నారు.

# పందెం.. జీవితం పణం




చిత్తూరు : రేణిగుంట మండలంలోని ఓ ఆసుపత్రిలో పనిచేస్తోన్న శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి చెందిన యువకుడూ ఇలాగే బెట్టింగ్‌లకు అలవాటు పడ్డారు. జీతం డబ్బుతోపాటు స్నేహితుల నుంచి అప్పు తీసుకుని మరీ అందులో డబ్బులు పెట్టారు. చివరకు వారికి సమాధానం చెప్పలేక ఈ ఏడాది జనవరిలో తిరుపతి నగరంలోని లాడ్జిలో ఉరి వేసుకున్నాడు. గంగాధరనెల్లూరుకు చెందిన దినేష్.. ఆన్‌లైన్, ఐపీఎల్ పందేలకు బానిసై సంపాదించిన డబ్బు పోగొట్టుకోవడంతోపాటు రూ.లక్షల్లో అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక తండ్రి నాగరాజులరెడ్డి, తల్లి జయంతి, అక్క సునీతతోపాటు దినేష్ గతేడాది అక్టోబరులో ఆత్మహత్య చేసుకున్నారు. బెట్టింగ్ మూలంగానే కుటుంబంలోని నలుగురూ బలవన్మరణానికి పాల్పడ్డారు.

మరో మూడు రోజుల్లో ఐపీఎల్ పోరు మొదలవనుంది. రెండు నెలలకుపైగా సాగే ఈ సంగ్రామాన్ని కొందరు వినోదం కోసం చూస్తుండగా.. మరికొందరు సులభంగా ఆదాయం సంపాదించే వనరుగా భావిస్తున్నారు. బంతి బంతికీ బెట్టింగ్ పెట్టి డబ్బు సంపాదించాలని అత్యాశ పడుతున్నారు. ఈ ఊబిలో చిక్కుకొని చేసిన అప్పులు తీర్చలేక చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా యువతే ఇందులో బాధితులుగా మారుతున్నారు. ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్ మార్గంలోనూ సాగుతున్న పందేలపై దృష్టి సారించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది.

బెట్టింగ్‌ల సంస్కృతి గతంలో మహానగరాల్లోనే కనిపించేది. క్రమేణా పట్టణాలు, మండల కేంద్రాలకు పాకింది. ఇప్పుడు పల్లెపల్లెలకూ విస్తరించింది. కొన్నేళ్ల కిందట అందరూ ఓ చోట కూర్చుని పందేలు కాసేవారు. తర్వాత కాలంలో పెద్ద మొత్తాల్లో బెట్టింగ్‌లు జరిగేటప్పుడు బుకీల పేర్లు వినిపించేవి. ప్రస్తుతం చాలావరకు ఆన్‌లైన్‌లోనే ఐపీఎల్ మ్యాచ్‌ల బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. పలు యాప్‌లలో పందేలు కాస్తూ ఈ విష వలయంలో చిక్కుకుంటున్నారు.

**నిందితులపై ఓ కన్నేస్తేనే..**

బెట్టింగ్ కేసుల్లో అరెస్టు అయిన నిందితులపై పోలీసులు ఓ కన్నేస్తే కొంతవరకైనా వీటికి అడ్డుకట్ట పడుతుంది. మధ్యవర్తులుగా వ్యవహరించే బుకీల కార్యకలాపాలపైనా దృష్టి సారించాలి. లోతుగా విచారిస్తే సూత్రధారులెవరో స్పష్టంగా తెలుస్తుంది. అవసరమైన పక్షంలో యాప్ నిర్వాహకులపైనా కేసులు నమోదు చేయాలి. తెలంగాణ పోలీసులు ప్రస్తుతం ఈ వ్యవహారంపై ఉక్కుపాదం మోపుతున్నారు. బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తున్న సామాజిక మాధ్యమాల ప్రభావశీలురపైనా చర్యలు తీసుకుంటున్నారు. ఇదేవిధంగా రెండు జిల్లాల్లోనూ కఠినంగా వ్యవహరించాలి.

**ఇళ్లు, పొలాలు, బైక్‌లు, బంగారం అమ్మి..**

ఒక్కసారి బెట్టింగ్ వ్యసనానికి బానిసైన వ్యక్తులు బయటపడటం అసాధ్యమవుతోంది. చివరకు ఇళ్లు, స్థలాలు, పొలాలు తాకట్టు పెడుతున్నారు. అయినా రుణాలు తీర్చలేని పక్షంలో ఆస్తులు అమ్మి బికారులవుతున్నారు. యువత కార్లు, బైక్‌లు, బంగారం అమ్ముకుంటున్నారు. ఇలా సర్వస్వం కోల్పోతున్నారు. సీజన్ ముగిసే సరికి వెనక్కు తిరిగి చూసుకుంటే రూ.లక్షలు– రూ.కోట్ల అప్పులు కనిపిస్తున్నాయి. వీటిని కట్టలేక, అప్పులు ఇచ్చిన వారికి సమాధానం చెప్పలేక విధిలేని పరిస్థితుల్లో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

**రెండు నెలల్లో రూ.60 కోట్ల వరకు**

ఐపీఎల్ సాగే ఈ రెండు నెలల్లో ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో రూ.40 కోట్ల వరకు చేతులు మారుతాయని పోలీసులు గతంలోనే అంచనా వేశారు. రెండు జిల్లాల్లో కలిపి రూ.60 కోట్లు బెట్టింగ్‌ల్లో పెడుతున్నారు. మ్యాచ్ ముగిసిన క్షణాల వ్యవధిలోనే వివిధ యాప్‌ల ద్వారా నగదు బదిలీ అవుతున్నందున మంచినీళ్లప్రాయంగా పందేలు కాస్తున్నారు. తిరుపతి, గూడూరు, శ్రీకాళహస్తి, పలమనేరు, చిత్తూరు, పుత్తూరులో విద్యార్థులు ఎక్కువమంది పందేల ఉచ్చులో పడుతున్నారు.

# ఈత.. కారాదు గుండెకోత!

అనంత : వేసవిలో పిల్లల నుంచి పెద్దల దాకా ఈత కొడుతూ సేదతీరాలని అనుకుంటారు. సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లి కన్నవారికి గుండెకోత మిగుల్చుతున్నారు. ఇటీవల ఉమ్మడి అనంతపురం జిల్లాలో చోటుచేసుకున్న మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అప్రమత్తంగా లేకపోతే ప్రాణానికి ముప్పు తప్పదని అవగతమవుతోంది.

**ప్రమాద సూచికలేవీ..?**

చెరువులు, కాలువలు, నీటికుంటలు తదితర చోట్ల నీటిపారుదల శాఖ, విపత్తుల నిర్వహణ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. జిల్లాలో ఎక్కడా అలాంటి దాఖలాలు కనిపించలేదు. గతంలో శింగనమల చెరువు, పెన్నోబిలం వద్ద కాలువ వద్ద పోలీసులను కాపలా ఉండేవారు. ప్రస్తుతం గస్తీ ఎక్కడా లేదు. ముఖ్యంగా పల్లెల్లో నీటి కుంటలు, ఉపాధి హామీ కింద తవ్విన గుంతల వద్ద రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శి, స్థానిక పోలీసులు సమన్వయంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అవసరమైతే ఆయా ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం పోలీసుల పహారా ఏర్పాటు చేస్తే ప్రమాదాల నివారణకు



అవకాశం ఉంటుంది.

**ఇలా చేద్దామా..!**

బాగా ఈత వచ్చిన వారు, పెద్దలే దగ్గరుండి ఈత కొట్టించాలి. ట్యూబులు, లైఫ్‌జాకెట్లు ధరించడం ఉత్తమం. స్నేహితులతో బాలలు, యువకులు ఈతకు వెళ్తుంటారు. ఈత రానివారు ఉంటే వారించాలి. తీవ్ర ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని వెళ్లనీయకూడదు. బావుల వద్దకు వెళ్లేటప్పుడు కుటుంబసభ్యులు వెంట ఉండాలి.

# రేషన్‌కూ ఈకేవైసీ తప్పనిసరి

నర్సీపట్నం : రేషన్ కార్డుదారులకూ ఈకేవైసీ నమోదు తప్పనిసరి అయింది. ఇప్పటికీ చేయించుకోకుంటే వచ్చే నెల నుంచి రేషన్ బియ్యం పొందేందుకు వీలుండదని అధికారులు చెబుతున్నారు. పౌర సరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేసే వాటిలో పారదర్శకత కోసం జాతీయ సమాచార సంస్థ (ఎన్ఐసీ) ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్‌ను నవీకరిస్తున్నారు. ఇప్పటివరకు రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ లేకున్నా సరకులు ఇచ్చే వారు. ఇకపై అలా కుదరదని, నమోదు చేసుకోని వారంతా త్వరపడాలని సూచిస్తున్నారు.

**20 శాతం మంది గుర్తింపు...**

జిల్లాలో ఐదు లక్షల మంది వరకు బియ్యం కార్డుదారులున్నారు. ప్రతి కార్డులోని సభ్యుల సంఖ్యను యూనిట్‌గా పేర్కొంటున్నారు. దీని ప్రకారం జిల్లాలో 20 లక్షల యూనిట్లు ఉంటాయని చెబుతున్నారు. వీటిలో 20 శాతం వరకు ఈకేవైసీ పూర్తి కాలేదని గుర్తించారు. వీరంతా



త్వరపడి నమోదు చేసుకోకుంటే ఏప్రిల్‌లో బియ్యం పంపిణీ నిలిచిపోతుంది. ఇప్పటికే సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఈకేవైసీ చేస్తున్నారు.

**చౌక దుకాణాల్లోనూ..**

– చందనరేఖ, పౌరసరఫరాల డీటీ, నర్సీపట్నం

రేషన్ కార్డుకు ఈకేవైసీ అనుసంధానం కాని వారి జాబితాలు సిద్ధం చేశాం. వీటి సమాచారాన్ని డీలర్లకు అందజేశాం. ఐదేళ్ల నుంచి 60 ఏళ్లలోపు వయసున్న వారంతా చౌక దుకాణాలకు వెళ్లి ఈ–పోస్‌పై వేలిముద్ర వేస్తే.. డీలర్ లాగిన్‌లో ఈకేవైసీ పూర్తి చేసుకోవచ్చు. నర్సీపట్నం మున్సిపాలిటీ సహా గ్రామీణ మండలంలోని కార్డుల్లో 7,198 యూనిట్లకు ఈకేవైసీ కాలేదు.

# సంకల్పం లేదు.. అమ్మవారూ కానరారు

తిరుచానూరు : తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయంలో భక్తులు అత్యంత పవిత్రంగా భావించే కుంకుమార్చనను అర్చకులు మొక్కుబడిగా మార్చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఈ సమయంలో మూలమూర్తికి దగ్గరగా కూర్చొనే అవకాశం ఉంటుంది. రోజూ మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఈ సేవను నిర్వహిస్తుండగా ఒకరికి రూ.250 చెల్లించాలి. రద్దీకి అనుగుణంగా 300–500 వరకు టికెట్లు జారీ చేస్తుంటారు. కొంతకాలంగా పూజలో పాల్గొంటున్న భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సన్నిధిలో కూర్చోబెట్టిన తర్వాత అర్చకులు కనీసం సంకల్పం చెప్పడం లేదు. చేతిలో కుంకుమ పాత్రను పట్టుకుని దూరంగా నిలబడి భక్తులందరూ సామూహికంగా తమ పేర్లను మనసులో స్మరించుకోవాలని మాత్రమే చెబుతున్నారు. మూలమూర్తిని కనులారా చూద్దాం అనుకున్న సమయానికి అమ్మవారికి అర్చకులు అడ్డుగా నిలబడి



హారతిచ్చి హడావుడిగా లేపి బయటకు పంపుతున్నారు. గతంలో సంతృప్తికరంగా అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉండేది. అర్చకులు ప్రతి భక్తుడి వద్దకు వచ్చి గోత్ర, నామాలు అడిగేవారు. ప్రస్తుతం క్షణాల్లోనే ముగించడంపై పెదవి విరుస్తున్నారు. ఈ సేవకు ఉన్న ప్రాధాన్యాన్ని క్రమేణా తగ్గిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై ఆలయ అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం..**

కుంకుమార్చన సేవలో పాల్గొనే ప్రతిఒక్కరికీ మంచి దర్శనం కల్పించి సంతృప్తికరంగా వెళ్లేలా చర్యలు తీసుకుంటామని, గోత్రనామాలతో అర్చన చేసుకొనేలా మార్పులు తీసుకొస్తామని ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్ తెలిపారు.

# శివరాత్రి మేల్కొల్పింది!

చిత్తూరు : మహా శివరాత్రి రోజున ఉపవాసం ఉండి జాగరణ చేస్తే జన్మజన్మల పుణ్యఫలమని పురాణాలు చెబుతున్నాయి. ఇదే మహా శివరాత్రి ఉత్సవం.. చిత్తూరు నగరం కట్టమంచిలో వెలసిన పురాతనమైన శ్రీకుళందీశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న ఆర్థిక కుమ్ములాటల్ని బహిర్గతమయ్యేలా చేసింది. ఇన్నాళ్లూ నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆలయ పరిపాలనా వ్యవహారాలు రచ్చకెక్కడంతో హిందూ ధార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఆర్థిక వ్యవహారాలు వివాదాస్పదం కావడంతో దేవదాయ శాఖ అధికారులు ఆలయ హుండీకి సీల్ వేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి లెక్కల్ని ఆరా తీసే పనులు మొదలుపెట్టాయి. **ఆలయ భూములకు వసూలు కాని కౌలు** శ్రీకుళందీశ్వరస్వామి దేవస్థానానికి విలువైన భూములున్నాయి. ఆలయ నిర్వహణ కోసం పూర్వం దాతలు సమర్పించిన భూములను కౌలుకిచ్చారు. అయితే ఈ కౌలు రుసుములు సక్రమంగా వసూలు కావడం లేదు. దీంతో దేవస్థానానికి రావాల్సిన ఆదాయానికి గండిపడింది. తాజాగా 12.64 ఎకరాల ఆలయ భూముల్ని కౌలుకు ఇవ్వడానికి చర్యలు చేపట్టారు. శ్రీ కుళందీశ్వరస్వామి దేవస్థానానికి నగరంలోని తిమ్మసముద్రం, కట్టమంచి లాయర్స్ కాలనీ, కొంగారెడ్డిపల్లెలోని వెంగళ్రావు కాలనీ, కట్టమంచితోపాటు ఆలయం వెనుక, మంగసముద్రంలో విలువైన భూములు ఉన్నాయి. ఈ భూములకు సంబంధించి గతంలో కౌలుకు తీసుకున్నవారు సక్రమంగా చెల్లింపులు జరపలేదనే ఆరోపణలు ఉన్నాయి.

# నాణ్యత విత్తుకోవాలి

కర్నూలు : ఐదేళ్లు రైతులు అడిగిన విత్తనం ఇవ్వలేదు.. ఇచ్చినవి అరకొరగా పంపిణీ చేశారు.. నకిలీలు నట్టేటా ముంచాయి.. ఏపీ సీడ్స్ అధికారులు పట్టించుకోలేదు.. వ్యాపారులు పెత్తనం చేశారు.. నాసిరకమైనవి అంటగట్టారు. ఈ పరిస్థితిని గట్టెక్కించడానికి 'కూటమి' ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించింది. ఖరీఫ్ సీజన్‌కు ఆరు నెలలు ముందుగానే వ్యవసాయ శాఖ జిల్లాల వారీగా రాయితీ విత్తనాల కేటాయింపులు చేసింది. కర్నూలుకు 14,990 క్వింటాళ్లు, నంద్యాలకు 10,265 క్వింటాళ్లు కేటాయించారు. సకాలంలో సేకరించి నాణ్యతా పరీక్షలు చేసిన తర్వాతే రైతులకు అందించాలని ఏపీ సీడ్స్ సంస్థను ఆదేశించారు.

**వేరుశనగలో నాసిరకమే ఎక్కువ**

ఖరీఫ్‌లో వేరుశనగ విత్తన కాయలను ఏపీ సీడ్స్ ద్వారా ప్రభుత్వం రాయితీపై రైతులకు అందిస్తుంది. కె-6 రకం, టీసీజీఎస్-1694, కదిరి లేపాక్షి (కె-1812) రకాలు ఇస్తోంది. డిమాండ్ ఉన్న రకాలను తక్కువగా పంపిణీ చేశారు.

నాసిరకమైనవి ఇస్తుండటంతో రైతులు మక్కువ చూపలేదు.. ఉమ్మడి జిల్లాలో వేరుశనగ 80 వేల హెక్టార్ల సాధారణ సాగు కాగా గతేడాది



ఖరీఫ్‌లో 51,820 హెక్టార్లకు పడిపోయింది.

**'కంది'పోయిన రకాలు**

గతేడాది ఖరీఫ్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో కంది సాధారణ సాగు 61,791 హెక్టార్లు కాగా రికార్డు స్థాయిలో 1,07,146 హెక్టార్లలో సాగైంది. ప్రభుత్వం రాయితీపై కేవలం 450 క్వింటాళ్లే అందించింది. అవీ రైతులడిగినవి కాకుండా ఎల్‌ఆర్‌జీ, ఐసీపీఎల్ రకాలు ఇచ్చారు. హైబ్రీడ్ విత్తనాలు కావాలని రైతులు విన్నవించినా పట్టించుకోలేదు. 'కూటమి' ప్రభుత్వం పట్టించుకోవాలని రైతులు విన్నవిస్తున్నారు.

వి'పత్తి' తెచ్చారు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి ప్రధాన వాణిజ్య పంట. సాధారణ సాగు 2.67 లక్షల హెక్టార్లు కాగా గతేడాది ఖరీఫ్‌లో 2.05 హెక్టార్లలో సాగైంది. గత ఖరీఫ్‌లో 25 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

రైతుల డిమాండ్‌కు తగ్గట్టు విత్తన ప్యాకెట్లు లేకపోవడంతో సుమారు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల మేర అన్నదాతలపై విత్తన భారం పడింది. పల్నాడు, తెలంగాణ జిల్లాల నుంచి కొనుగోలు చేశారు.

**నాణ్యతా పరీక్షల అనంతరం పంపిణీ**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో 19 వేల క్వింటాళ్లకుపైగా రాయితీ విత్తనాలు అందజేశారు. టెండర్ల పద్ధతిలో వ్యాపారుల నుంచి సేకరించారు.. అధికారులు నాణ్యతా పరీక్షలు చేసి రైతులకు అందించాలి. పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు నాసిరకమైనవి అంటగట్టారు. రైతుల నుంచి డిమాండ్ తక్కువగా ఉన్న కంది, మినుములు, కొర్రలు విత్తనాలను మాత్రమే ఉమ్మడి జిల్లాలో సేకరించి.. వాటిని ప్రాసెసింగ్ చేసి రాయితీపై అందించారు. వేరుశనగ విత్తన కాయల కోసం పక్క రాష్ట్రాలు, పొరుగు జిల్లాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. వచ్చే ఖరీఫ్‌లో నాణ్యతా పరీక్షల అనంతరమే రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.

# అక్రమంపై విజి'లెన్స్' ఏదీ!

ఒంగోలు : పొగాకు పంటను వ్యాపారి కొనాలన్నా.. రైతు అమ్మాలన్నా బోర్డు ద్వారానే చేపట్టాల్సి ఉంటుంది. అందుకే పంట రైతు చేతికి వచ్చే సమయం నుంచే బయట కొనుగోళ్లకు అడ్డుకట్ట వేసేందుకు బోర్డు విజిలెన్స్ బృందాలను నియమిస్తుంది. అనుమతులు లేకుండా రవాణా చేసే పొగాకును స్వాధీనం చేసుకుంటుంది. ఈ ఏడాది విజిలెన్స్ బృందాల నియామకం ఇంకా లేకుంది. ఇదే అదునుగా అధికారిక కొనుగోళ్లు ప్రారంభం కాకుండానే అక్రమం జోరందుకున్నాయి. **దొడ్డి దారిన తరలింపు:** టంగుటూరు, ఒంగోలు కేంద్రంగా కొందరు దళారులు కమీషన్ ప్రాతిపదికన దొడ్డిదారిన కంపెనీలకు తరలిస్తున్నారు. మరి కొందరు దళారులు గుంటూరులోని కంపెనీలకు రవాణా చేస్తున్నారు. ఇదంతా తెలిసినా బోర్డు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కంపెనీలో ఎంత నిల్వ చేశారో తనిఖీలు చేసే అధికారం బోర్డుకు ఉంది, అయినా కన్నెత్తి చూసేవారు కరవయ్యారు.



**కర్ణాటకలో ధరలతో ఆశలు**

కర్ణాటకలో ఈ ఏడాది పొగాకుకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఆంధ్రాలోనూ డిమాండ్ ఉంటుందన్న ఉద్దేశంతో వ్యాపారులు ముందుగానే కొనుగోలుకు తెర లేపారు. దళారులను ఏర్పాటు చేసుకున్నారు. వీరు టంగుటూరు, కొండపి, ఒంగోలు, మద్రిపూడి, జరుగుమల్లి, నాగులుప్పలపాడు, సంతనూతలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, కందుకూరు, పొన్నలూరు మండలాల్లోని గ్రామాల్లో రైతులను పగటి పూట కలిసి బేరసారాలు సాగిస్తున్నారు. అనంతరం రాత్రిపూట ట్రాక్టర్, మినీ లారీలకు లోడింగ్ చేసి ఒంగోలు, టంగుటూరులోని కంపెనీలకు తరలిస్తున్నారు. బయట కొనుగోళ్లు సాగితే మార్కెట్‌లో ధరలు తగ్గి రైతులకు నష్టం వాటిల్లుతుంది. బయట విక్రయాల ద్వారా సర్వీసు ఛార్జీల రూపంలో వచ్చే ఆదాయాన్ని బోర్డు కూడా కోల్పోతుంది. బోర్డు ఉన్నతాధికారులు ఇప్పటికైనా అక్రమ కొనుగోళ్లను కట్టిడి చేసేందుకు విజిలెన్స్ బృందాలను నియమించాలని రైతులు కోరుతున్నారు.

సీజన్: 2024-25
రీజియన్లు: ఎస్‌బీఎస్, ఎస్ఎల్ఎస్
అనుమతించిన విస్తీర్ణం: 67,550 హెక్టార్లు
మొత్తం సాగు విస్తీర్ణం: 85 వేల హెక్టార్లు

# మన'సారా' నవోదయం



నర్సీపట్నం : కూటమి ప్రభుత్వం నాటుసారా రహిత గ్రామాలే లక్ష్యంగా నవోదయం 2.0 అమలుకు శ్రీకారం చుట్టింది. మండలి ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఎక్సైజ్ శాఖ విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టనుంది. నర్సీపట్నం, చోడవరం, పాయకరావుపేట నియోజకవర్గాల్లో గుర్తించిన గ్రామాలను మూడు కేటగిరీలుగా విభజించారు. సారా తయారీకి మాత్రమే పరిమితమయ్యే గ్రామాలను 'ఎ' కేటగిరీలో చేర్చారు. వీటిలో నర్సీపట్నం మండలం పెదబొడ్డేపల్లి, రోలుగుంట మండలం పెదపేట, గుర్రాలపాలెం, కొంతలం గ్రామాలు ఉన్నాయి.

తయారీతోపాటు విక్రయాలు జరిగే గ్రామాలను 'బి' కేటగిరీలో చేర్చారు. వీటిలో నర్సీపట్నం మండలం వేములపూడి, మెట్టపాలెం, మాకవరపాలెం మండలం అప్పన్నదొరపాలెం, పైడిపాల ఉన్నాయి. అమ్మకాలకు పేరొందిన నర్సీపట్నం మండలం చెట్టుపల్లి, రోలుగుంట మండలం బుచ్చంపేట, రత్నంపేట, కుసర్లపూడి, బెన్నభూపాలపట్నం, కోటవురట్ల మండలం ఆక్సాయ్‌పేట, బీకేపల్లి, నీలిగుంట, కె.వెంకటాపురం, మాకవరపాలెం మండలం నగరం, తామరం, పైడిపాల, కె.తాటపాల గ్రామాలు 'సి' కేటగిరీలో ఉన్నాయి.

ఆయా గ్రామాల్లో నమోదైన 67 కేసుల్లో 117 మందిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు. బెల్లం వ్యాపారులతో కొద్దిరోజుల కిందట ఎక్సైజ్ సీఐ సమావేశమయ్యారు. నాటుసారా తయారీదారులకు నల్లబెల్లం విక్రయించినట్టు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల నుంచి పలువురు వేర్వేరు అవసరాల కోసం నాసిరకం బెల్లం కొనుగోలు చేస్తుంటారు. సారా తయారీకి వినియోగిస్తారని తామెలా ఊహిస్తామని వ్యాపారులు వాపోతున్నారు. హరియాణా నుంచి బెల్లం: సారా తయారీకి ఇప్పుడు హరియాణా నుంచి బెల్లం పొడి వస్తోందని ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. గతంలో కట్టెల పొయ్యిపై సారా తయారీ చేసేవారు. ఇప్పుడు వంటగ్యాస్ వినియోగిస్తున్నారు. నర్సీపట్నం పరిసరాల్లోని తోటల్లో వేల లీటర్ల బెల్లం పులుపును ఇటీవల పట్టణ సీఐ గోవిందరావు, చుట్టుపక్కల గ్రామాల్లో గ్రామీణ సీఐ రేవతమ్మ సిబ్బందితో దాడులు చేసి ధ్వంసం చేశారు. బెల్లం ఊటలో అమ్మోనియా, వివిధ రకాల పండ్లు, వాడేసిన బ్యాటరీల పొడి కలిపి వారం రోజులపాటు పులియబెట్టి సారా తయారు చేస్తుంటారు. ఇది ఆరోగ్యానికి హానికరం. గతంలో సారా ప్యాకెట్ ధర రూ.20 ఉంటే ఇప్పుడు రూ.50కి విక్రయిస్తున్నారు.

**కేసుల నమోదు ఇలా..** నర్సీపట్నం ఎక్సైజ్ స్టేషన్‌లో గత ఏడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది జనవరి వరకు 107 కేసుల్లో 143 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 26 కేసుల్లో 45,840 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని వేలంలో విక్రయిస్తే రూ.46,600 ఆదాయం వచ్చింది. ఈ నెలలో నలుగురిని అరెస్టు చేసి 64 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నవోదయం 2.0 కార్యక్రమం అమలుకు సంబంధించి మౌఖికంగా ఆదేశాలు వచ్చాయి. మార్గదర్శకాలు జారీ కాగానే తదనుగుణంగా ముందుకెళ్తామని నర్సీపట్నం ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్‌కు వివరించారు.

# రయ్ రయ్ ఉపాధికి సై




అనకాపల్లి : డ్రైవింగ్ లెసెన్సు ఉన్న డ్వాక్రా సంఘాల మహిళా కుటుంబ సభ్యులకు స్వయం ఉపాధి అందించేలా రాపిడో సంస్థతో మెప్మా అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ద్వి, త్రిచక్ర వాహనాలను అందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అనకాపల్లి పట్టణంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లేందుకు రవాణా సదుపాయం లేకపోవడం.. సిటీ బస్సులు అందుబాటులో లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒకచోటు నుంచి మరో చోటుకు ప్రయాణికులను తీసుకెళ్లేందుకు రాపిడో యాప్‌లో వాహనాలను బుక్ చేసుకుంటే వారు వచ్చి ప్రయాణికులు వారు చెప్పిన చోటుకు తీసుకెళ్తారు. ఇలా అందించిన సేవలకు ప్రయాణ ఖర్చులు తీసుకుంటారు. దీనికోసం డ్వాక్రా సంఘాల్లో మహిళలు, కుటుంబ సభ్యులకు వాహనాలను సమకూర్చి స్వయం ఉపాధి అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**సంఘాల్లో ఎంపిక...**

డ్వాక్రా సంఘాల్లోని మహిళలు, కుటుంబ సభ్యుల్లో లైసెన్సు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి రూ. 1.30 లక్షల విలువజేసే ఎలక్ట్రికల్ స్కూటర్, రూ.3.70 లక్షల విలువజేసే ఎలక్ట్రికల్ ఆటోను అందజేస్తారు. ఈ వాహనాలకు డౌన్ పేమెంట్ కింద మెప్మా సంస్థ రాయితీ రూపంలో నగదు అందిస్తుంది. రాపిడో సంస్థ నెలకు రూ. 500 చొప్పున ఏడాది పాటు నగదు చెల్లిస్తుంది. పొదుపు సంఘాల్లో ఆసక్తి ఉన్న మహిళలు, వారి భర్తలకు వాహనాలను అందించి స్వయం ఉపాధి అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**దరఖాస్తుల స్వీకరణ-సంతోష్‌కుమార్, యూసీడీ, ఏపీడీ**

వాహనాల్లో ప్రయాణికులను చేర్చడానికి వాహనాల కోసం డ్వాక్రా సంఘాల్లోని మహిళలు, కుటుంబ సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. లైసెన్సు ఉండి స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు. పురుషులు డ్వాక్రా సంఘాల్లోని మహిళా కుటుంబ సభ్యులై ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఉంటుంది.

# స్థాయి పెరగని వైద్యం



ఆళ్లగడ్డ : వైద్యానికి ప్రాధాన్యం అన్నారు.. ఆసుపత్రుల స్థాయి పెంచుతున్నాం.. నాడు-నేడు కింద భవనాలు నిర్మిస్తామంటూ వైకాపా పాలకులు ప్రగల్భాలు పలికారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బనగానపల్లి, డోన్, ఎమ్మిగనూరు పట్టణాల్లోని సామాజిక ఆరోగ్య కేంద్రాలను(సీహెచ్‌సీ) 100, ఆళ్లగడ్డలో 50 పడకల వరకు పెంచారు. స్థాయి పెంచినా భవన నిర్మాణాలపై శ్రద్ధ పెట్టలేదు. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించలేదు..దీంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించి సేవలు మెరుగుపరచాలని రోగులు విన్నవిస్తున్నారు.

**అంబులెన్సుకు అస్వస్థత**

ఆళ్లగడ్డ ఆసుపత్రిని రూ.8 కోట్లతో విస్తరించాలనుకున్నారు.. స్థాయి పెరిగి ఆరేళ్లు దాటుతున్నా అందుకనుగుణంగా సేవలు అందడం లేదు. భవనం పూర్తి చేయలేదు.. పాత భవనంలోనే వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడ నిత్యం 300- 400 వరకు ఓపీ ఉంటోంది. వైద్యులు-2, ఎక్స్‌రే టెక్నీషియన్-1 పోస్టు ఖాళీగా ఉంది. ఎక్స్‌రే యంత్రం మూలకు చేరింది. మత్తు వైద్యురాలు ఒక్కరే ఉండటంతో సెలవు పెట్టినప్పుడు ప్రసూతి సేవలు పాక్షికంగానే కొనసాగుతున్నాయి. రోగులకు తగినన్ని మరుగుదొడ్లు, తాగునీటి వసతులు లేవు. అంబులెన్స్ మరమ్మతులకు లోనైంది.

**డోన్‌లో తొలగని అంధకారం** డోన్‌లో కంటి వైద్యానికి సంబంధించిన పరికరాలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పరిశ్రమలెక్కువ.. కార్మికులు కంటి జబ్బులతో ఇబ్బంది పడుతుంటారు. ఐదు వైద్యుల పోస్టులు, 11 మంది వైద్య సహాయ సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. **బనగానపల్లిలో పోస్టులు ఖాళీ**

బనగానపల్లిలో నిత్యం ఐదు వందల వరకు ఓపీ ఉంటోంది. మత్తు వైద్యులు-1, ప్రసూతి వైద్యులు-1, రేడియాలజిస్టు- 1 ఖాళీలు ఉన్నాయి. జనరల్ డీసీఎస్ పోస్టుతో సివిల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. **ఎమ్మిగనూరులో పాతభవనంలోనే**

ఎమ్మిగనూరులో రూ.12 కోట్లతో కొత్త భవనం నిర్మిస్తున్నారు. ఐదేళ్లుగా పనులు నత్తను తలపిస్తున్నాయి. ఇక్కడ నిత్యం ఆరు వందల వరకు ఓపీ ఉంటోంది. వైద్యుల కొరత వేధిస్తోంది. రేడియాలజిస్టు, జనరల్ మెడిసిన్, మత్తు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

# నాణ్యతకు పాతర

సాలూరు : సాలూరులో వంద పడకల ఆసుపత్రి రెండు దశాబ్దాల కల. ఇది నెరవేరబోతుందన్న ఆనందం కంటే నాణ్యతా లోపంతో జరుగుతున్న పనులు నియోజకవర్గ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. భవన నిర్మాణం పూర్తి కాకుండానే రక్షణ గోడలు బీటలు వారుతున్నాయి. చేతివేళ్లతో గీకినా సిమెంటు రాలిపోతోంది. వేర్వేరు బ్లాకులు నిర్మించినా.. వాటిని అనుసంధానం చేసే చోట నీరు లీకవుతోంది. గుమ్మాలు, కిటికీలకు మంచి కలప వినియోగించలేదని, విద్యుత్తు, ప్లంబింగ్ పనుల్లో కూడా నాణ్యత కొరవడిందన్న ఆరోపణలున్నాయి. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే పలుమార్లు మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. అయినప్పటికీ మార్పు లేదు.



**పారంభించి ఆరేళ్లు..**

2019లో ఫిబ్రవరిలో ఇక్కడి ప్రాంతీయ ఆసుపత్రి భవనం పనులకు శంకుస్థాపన చేశారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తరువాత 2020 డిసెంబరులో మళ్లీ భూమి పూజ చేశారు. అయిదేళ్ల పాలనలో యాభై శాతం ప్రక్రియ మాత్రమే జరిగింది. బిల్లులు చెల్లించలేదని ఎన్‌సీసీ సంస్థ ఏడాదిన్నర కిందట ఆపేసింది. కూటమి వచ్చిన తరువాత రూ.4.50 కోట్ల బకాయిలు చెల్లించింది. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తామని మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చారు. వచ్చే నెలాఖరు నాటికి పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేస్తామని అధికారులు గతంలో ప్రకటించారు. ఆ మేరకు ఆదరాబాదరాగా చేస్తున్నారు. దీంతో నాణ్యత దెబ్బతింటోంది. తగిన ప్రమాణాలు పాటించాలని గుత్తేదారుకు సూచిస్తామని, లోపాలుంటే సవరిస్తామని డీఈ నరేంద్రనాథ్‌కు తెలిపారు.

# రూ. వంద కోట్ల భూమి.. దస్త్రం మాయమైంది!

ఒంగోలు : రూ. వంద కోట్ల విలువైన ఓ స్థలం ఎవరిదనే విషయంలో వివాదాలున్నాయి. ఇదే అదునుగా గత ప్రభుత్వంలో వైకాపా పెద్దలు కన్నేశారు. ఓ ఫ్యాక్షన్ నేతను తెర పైకి తెచ్చి తాము వెనుక ఉండి కథ నడిపించారు. మ్యుటేషన్ చేయాలని అప్పటి తహసీల్దార్‌పై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారు. తన వల్లకాదనడంతో బదిలీ చేయించారు. ఇంతలో నేనున్నానంటూ మరొకరు ముందుకొచ్చారు. పెద్దలు సూచించిన వారి పేరిట మ్యుటేషన్ చేశారు. ఇప్పుడు ఈ భూబాగోతంలో కీలకమైన సదరు దస్త్రం మాయమైంది. పెద్దల మాట విని సహకరించిన ఆ తహసీల్దార్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది.

**ఇదీ కథాకమామీషు**

ఒంగోలు నగరం మంగమూరు రోడ్డులో విలువైన భూమి అది. సర్వే నం:267తో సుమారు 6.28 ఎకరాల విస్తీర్ణం ఉంటుంది. దశాబ్దాలుగా వివాదంలో ఉండటంతో 2019లో పాలక పెద్దలు దక్కించుకునేందుకు కుయుక్తులు పన్నారు. 2020లో ఒంగోలులో పనిచేసిన తహసీల్దార్‌పై ఒత్తిడి తెచ్చినా ఫలితం లేకపోయింది. దీంతో ఆయన్ను కాదని జరుగుమల్లిలో పనిచేస్తున్న నయీమ్ అహ్మద్‌ను తహసీల్దార్‌గా తీసుకొచ్చారు. 2021 ఫిబ్రవరిలో వచ్చిన ఆయన ఏడాది కాలమే పనిచేశారు. ఆ సమయంలోనే కీలకమైన ప్రాంతాల్లో ఉన్న విలువైన భూముల మ్యుటేషన్ చేసేశారు. ఇందులో సర్వే నెం:267లోని 6.28



ఎకరాల భూమి ఒకటి. ఒంగోలు సుజాత పేరిట 0.20 ఎకరాలు, ఒంగోలు జయశ్రీ పేరిట 2.98 ఎకరాలు, అబ్బరాజు శ్రీనివాసరావు పేరిట 2.9 ఎకరాలు, అబ్బరాజు వేణుగోపాల్ పేరిట 0.20 ఎకరాలు మ్యుటేషన్ చేశారు.

**దస్త్రాలివ్వాలన్న హైకోర్టు**

ఈ భూమి హక్కుదారులు ఎవరనే విషయం నిర్ధారించుకోకుండా, వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా ఒంగోలు తహసీల్దార్ నయీమ్ అహ్మద్ ఏకపక్షంగా మ్యుటేషన్ చేశారని శేషవెంకట కృష్ణకుమారి అనే మహిళ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో సదరు భూమి మ్యుటేషన్‌కు సంబంధించిన దస్త్రాలను తమ ముందుంచాలని న్యాయస్థానం ఆదేశించింది. సదరు దస్త్రం తమ కార్యాలయంలో కనిపించటం లేదంటూ హైకోర్టుకు తహసీల్దార్ ప్రత్యుత్తరమిచ్చారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి సదరు దస్త్రం ఎలా అదృశ్యమైందో తేల్చాలని జిల్లా కలెక్టర్‌ను న్యాయస్థానం ఆదేశించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒంగోలు ఆర్డీవో విచారణ చేపట్టారు. అప్పటి తహసీల్దార్ నయీమ్ అహ్మద్ నిబంధనలు కాదని మ్యుటేషన్ చేసినట్లు తేల్చారు. దీంతో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయనకు తాఖీదులు జారీ అయ్యాయి. అయినా తేలిగ్గా తీసుకున్నారు. ప్రస్తుతం పుల్లలచెరువులో విధులు నిర్వహిస్తున్న ఆయన గత కొన్నాళ్లుగా సెలవులో ఉన్నారు. తప్పించుకునేందుకు దారులు వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆయనకు తాజాగా ఛార్జిమెమో దాఖలు చేశారు. వ్యవహారం రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

చురకలు



# రక్త పరీక్ష.. రిక్తహస్తం

చిత్తూరు : జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖాధికారుల నిర్లక్ష్యం నిరుపేద ప్రజలకు శాపంగా మారుతోంది. యూపీహెచ్‌సీ(అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్)లలో నెలల తరబడి రక్తపరీక్షలకు అవసరమైన మందులు నిండుకున్నాయని.. వైద్య సేవలు సాగలేకపోతున్నాయని తెలిసినా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

**ప్రైవేట్ ల్యాబ్‌లకు క్యూ**

యూపీహెచ్‌సీల్లో కొన్ని నెలల నుంచి షుగర్, కిడ్నీ, లివర్, కొలెస్ట్రాల్ రక్త పరీక్షలు పూర్తిగా నిలిచిపోయాయి. పరీక్షలకు అవసరమైన ల్యాబ్ రీఏజెంట్ అండ్ కెమికల్స్ ఎక్కడా లేకపోవడంతో అన్ని ప్రాంతాల్లోనూ



పరీక్షలు చేయట్లేదు. దీంతో రోగులు ప్రైవేటు ల్యాబ్‌లకు వెళుతుండటంతో అధిక ధరలు వసూలు చేస్తున్నారు.

**రోజు మార్చి రోజు సేవలు**

ఆస్పత్రుల్లో వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ల కొరత కారణంగా ఒక్కో ఆస్పత్రుల్లో రోజు మార్చి రోజు సేవలు అందిస్తున్నారు. పలమనేరులోని వైద్యులు చిత్తూరులో సత్యనారాయణపురం యూపీహెచ్‌సీలో, కాజూరు యూపీహెచ్‌సీలో మరో రోజు విధులు నిర్వహిస్తున్నారు. పలమనేరు, పుంగనూరులో వైద్యుల పోస్టులు ఖాళీ ఏర్పడింది. మాపాక్షి, టెలిఫోన్ కాలనీలోని యూపీహెచ్‌సీల్లో ఇన్‌ఛార్జి వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. పెనుమూరులోని ల్యాబ్‌టెక్నీషియన్ స్థానికంగా మూడు రోజులు, సత్యనారాయణపురంలో మరో మూడు రోజులు విధులు నిర్వహిస్తున్నారు. ఇండెంట్ పెట్టాం రీఏజెంట్ కోసం ఇండెంట్ పెట్టాం. త్వరగా తెప్పించడానికి కృషి చేస్తాం. వైద్యుల పోస్టులు త్వరలోనే భర్తీకానున్నాయి. సుధారాణి, డీఎంహెచ్‌వో

# దారు'ణా'లు

కుప్పం : దేశానికి గ్రామాలు పట్టుకొమ్మలు.. అలాంటి గ్రామాల్లో కొన్నింటికి సరైన రహదారులు లేక.. ప్రయాణం గగనంగా మారింది. దీంతో ప్రజలు రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నారు. పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో సింహభాగం రోడ్లు అభివృద్ధి చెందినా మిగిలిన రోడ్లు దుస్థితికి చేరకున్నాయి. మరమ్మతుకు నోచుకోక మట్టిరోడ్లు కోతకుగురై కాలువలుగా, తారురోడ్లు గోతులుగా దర్శనమిస్తున్నాయి. కొద్దిపాటి వర్షపు జల్లులు కురిసినా రోడ్లు బురదమయంగా మారుతున్నాయి.

పుంగనూరు నుంచి సింగిరిగుంట, అరవపల్లె మీదుగా కర్ణాటకకు వెళ్లే రోడ్డు గోతులమయమైంది. సింగిల్ రోడ్డు కావడం, రోడ్డుకు



ఇరువైపులా గోతులు, కోతలు ఉండడంతో వాహనాలు ఎదురెదురుగా వస్తే పక్కకు వెళ్లాలంటే చోదకులు ఇబ్బంది పడుతున్నారు. పుంగమ్మ చెరువు కట్టపై ఒక వైపు చెరువు, మరో వైపు 20అడుగుల పల్లంలో వ్యవసాయ పొలాలున్నాయి. ఇక్కడ ఏ చిన్నప్రమాదం జరిగినా ఎక్కువ నష్టం జరుగుతోంది.

పలమనేరు నియోజకవర్గంలో ఐదేళ్ల కిందట తెదేపా ప్రభుత్వం 46 తారురోడ్లు మంజూరు చేసింది. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ రోడ్ల ఊసెత్తలేదు. పలమనేరు నుంచి సముద్రపల్లెకు ఐదేళ్లుగా కంకర రాళ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు. శాంతిపురం నుంచి పొన్నేపల్లె, ఎంకెపురం, చిన్నగాండ్లపల్లె గ్రామాల మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు గల 6కిలోమీటర్ల రోడ్డులో అడుగడుగునా గోతులే. దీంతో ప్రయాణం నరకంగా మారింది.

# ఘాట్ మార్గం సుగమం

ఆత్మకూరు : కర్నూలు-గుంటూరు మార్గం మధ్యలో నల్లమల ఘాట్ రహదారి మరమ్మతులకు ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైలానికి తరలొచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా మరమ్మతులు చేపడుతున్నారు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు పట్టించుకోలేదు.. రహదారి మొత్తం గుంతలమయంగా మారింది. అధ్వానంగా మారిన రహదారి దుస్థితిపై 'శివరాత్రి భక్తులకు 39 కి.మీ గండం' శీర్షికన ఈనెల 10న కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు శ్రీశైలంలో జరిగిన మంత్రుల సమావేశంలో సమస్యపై చర్చించారు. వెంటనే సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో రూ.3 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులతో ఏడాది



పాటు రహదారి నిర్వహణ చేపట్టాల్సి ఉంది.

ప్రస్తుతం రహదారికి ఇరువైపులా గుంతలను కంకర పొడితో పూడ్చివేశారు. ట్యాంకర్‌తో నీళ్లు చల్లి చదును చేస్తున్నారు. దీనిపై మొరుసు మట్టి వేయనున్నట్లు గుత్తేదారు తెలిపారు.

వెంకటాపురం నుంచి సంజీవనగర్ తండా, బైర్లూటి సమీపంలో రహదారికి ఇరువైపులా ఉన్న మట్టిని తవ్వి అక్కడి గుంతలు పూడ్చారు. రోలర్‌తో చదును చేసినాసరే వాహనాలు తిరగడంతో మట్టి మెత్తబడింది. వాహన చక్రాలు మట్టిలో దిగబడుతున్నాయి. దీంతో రోడ్డంతా దుమ్ముతో నిండుకుంటోంది.మలుపుల్లో ప్రమాదాల నివారణకు గతంలో ఏర్పాటు చేసిన కుంభాకార దర్పణాలు పగిలిపోయాయి. వీటి స్థానంలో కొత్త దర్పణాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

# ఉపాధి బాటకు అడుగులు




రుద్రంపేట : నైపుణ్యం కలిగిన యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. విద్యార్హతలున్నా తగిన సంస్థలను వెతుక్కోలేక, భవిష్యత్తును తీర్చిదిద్దుకోలేక ఢీలా పడిపోతున్న పరిస్థితి. ఇలాంటి వారిని గుర్తించి ఉపాధి బాట పట్టించే ఉద్దేశంతో ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా ఉపాధి కల్పన కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్, డీఆర్‌డీ ఆధ్వర్యంలో స్కిల్ సెన్సెస్ సర్వే త్వరలోనే నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి కళ్యాణి తెలిపారు. స్కిల్ సెన్సెస్ సర్వే (నైపుణ్య గణన)లో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, డీఆర్‌డీ, ఉపాధి కల్పన కార్యాలయం సంయుక్తంగా 15 నుంచి 59 ఏళ్ల వయస్సున్న వ్యక్తులకు సంబంధించిన వివరాలు సేకరించనున్నారు. వారి విద్యార్హతలు, ఉద్యోగ అనుభవం, వారి మెరుగైన ఆసక్తులను సేకరించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను నైపుణ్యాభివృద్ధిగా తీర్చిదిద్దేందుకుగా ఈ సర్వే నిర్వహించనున్నారు. క్షేత్రస్థాయిలో సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ఆయా చోట్ల జనవాసాలను క్లస్టర్లుగా విభజించుకొని ఒక్కో క్లస్టర్‌కు ఒక ఎక్యూమరేటర్‌ను నియమిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, పట్టణ ప్రాంతంలో జోనల్ కమిషనర్లు నోడల్ అధికారులుగా నిర్వహించనున్నారు. ఈ మొత్తం సర్వే కార్యక్రమాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ హెడ్‌క్వార్టర్స్ నుంచి పర్యవేక్షించనున్నారు.

**పైలట్ ప్రాజెక్టుల స్ఫూర్తితో..**

ఇప్పటికే గుంటూరు జిల్లా మంగళగిరి, తాడికొండ నియోజకవర్గంలో స్కిల్ సెన్సెస్‌ను రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టి విజయవంతంగా పూర్తి చేసింది. దీని స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో చేపట్టాలని ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కావడంతో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు సర్వే విధి విధానాలు, అనుసరించవలసిన పద్ధతులపై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిసింది.

**సర్వే ఎందుకంటే..**

యువత, నిరుద్యోగుల్లో నైపుణ్యాలను గుర్తించి వారికి అవసరమైన నైపుణ్యాభివృద్ధిని గుర్తించడం

ఈ సర్వే ద్వారా ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి వికాసానికి దోహదపడటం. అందుబాటులో ఉన్న మానవ వనరులను పరిశ్రమలు, సంస్థలు సద్వినియోగం చేసుకునేలా చేయడం. ః ప్రతి ఇంటి నుంచి చదువుకున్న వారెందరు? ఉద్యోగం చేస్తున్న, చదువుకొని ఉపాధి కోసం ఆసక్తితో ఎదురుచూస్తున్న వారి వివరాలను సేకరించడం.

# ఉపాధికి రాజకీయ గ్రహణం!



అనంతపురం: ముదిగుబ్బ మండలంలో 'ఉపాధి' హామీ పనులకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. గడిచిన 8 నెలలుగా మండలంలోని పేదలకు పని కల్పించడం లేదు. క్షేత్రసహాయకుల నియామకాల్లో రాజకీయ పార్టీల మధ్య నెలకొన్న వివాదమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. ఫలితంగా ఉపాధిపై ఆధారపడి జీవిస్తున్న పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉపాధి నిధులతో చేపట్టాల్సిన ఉద్యాన పంటల సాగు, గోకులాలు, పశువుల షెడ్ల నిర్మాణం ముదిగుబ్బ మండలంలో అమలు కాలేదు.

**అదనపు పనిదినాలు పోయినట్లే..**

గతేడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో శ్రీసత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బ, తాడిమర్రి, తలుపుల, కనగానపల్లి, ధర్మవరం, ఎన్‌పీ కుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, పరిగి రాప్తాడు మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించారు. దీంతో ఆయా మండలాల్లో 50 అదనపు పనిదినాలు కల్పించారు. ముదిగుబ్బ మినహా అన్ని మండలాల్లో పనులు జరుగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో మాత్రమే ముదిగుబ్బలో పనులు కల్పించారు. జూన్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరే నాటికి 2.72 లక్షల పనిదినాలు జరిగాయి. 71 కుటుంబాలకు 100 రోజులు పని కల్పించారు. గడిచిన నాలుగేళ్లలో సగటున 6 లక్షల పనిదినాలు పూర్తి చేయగా ఈ ఏడాది అందులో సగం కూడా కల్పించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో క్షేత్రసహాయకుల నియామకాలు పూర్తయ్యాయి. ముదిగుబ్బలో అధికార పార్టీల మధ్య రాజకీయ వివాదం నడుస్తోంది. అత్యధికం తాము సూచించిన వారికే ఫీల్డ్‌అసిస్టెంట్ పోస్టులు ఇవ్వాలని స్థానిక తెదేపా, భాజపా నాయకులు పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటివరకు ఒక్క నియామకం జరగలేదు. **అభివృద్ధిపైనా ప్రభావం** ఒక ఏడాదిలో కల్పించిన పనిదినాల ఆధారంగా ఆయా మండలాల అభివృద్ధికి 40 శాతం మేర మెటీరియల్ కాంపోనె ంట్ నిధులు కేటాయిస్తారు. మరో నెల రోజులు పరిస్థితి ఇలానే కొనసాగితే సుమారు 3 లక్షల పనిదినాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఒక్కో పనిదినానికి రూ.260 లెక్కేసినా కూలీలు రూ.7.80 కోట్ల మేర నష్టపోతారు. ఈ లెక్కన సుమారు రూ.5 కోట్ల వరకు మెటీరియల్ కాంపోనెంట్ నిధులు కోల్పోవాల్సి ఉంటుంది. దీంతో అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడే ప్రమాదం కనిపిస్తోంది. ఈ విషయంపై డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ వివరణ కోరగా.. ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపామని, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామన్నారు. మార్చి 31 నాటికి వీలైనన్ని పనిదినాలు కల్పిస్తామని వివరించారు.

# స్థానిక పాలకులకు సౌకర్యాలేవి?



గోరంట్ల : వైకాపా పాలనలో పెద్దగా ఉన్న పంచాయతీలను విభజించడం, 500 జనాభా కలిగిన గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటుచేయడం జరిగింది. ఈ క్రమంలో 2021 ఫిబ్రవరిలో అన్ని పంచాయతీలతో పాటు కొత్తగా ఏర్పడిన వాటికి ఎన్నికలు నిర్వహించి నూతన పాలకవర్గాలను ఏర్పాటుచేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా, నాలుగేళ్ల పుణ్యకాలం ముగుస్తున్నా ఇంతవరకు ప్రథమ పౌరులకు కూర్చోవడానికి సీటులేదన్నది నమ్మలేని నిజం.

**కొత్తగా 33..**

శ్రీసత్యసాయి జిల్లాలో నూతనంగా 33 పంచాయతీలను ఏర్పాటుచేశారు. వాటికి ఇంతవరకు భవనాలు ఏర్పాటు చేయడలేదు. కొన్నింటికి మాత్రం సచివాలయ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించి అర్ధాంతరంగా ఆపేశారు. మిగిలిన వాటి గురించి ఇంతవరకు ఆలోచించన పాపాన పోలేదు. వాటిని పక్క పంచాయతీ సచివాలయాలకు విలీనం చేశారు. కొత్తపంచాయతీల సర్పంచులు ఎక్కడ కూర్చోవాలన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఆపంచాయతీలకు మొదటి సర్పంచులుగా ఎంపికయ్యారన్న మాటేగాని అసలు విషయాన్ని బయటకు చెప్పుకోలేక లోలోపల మథనపడుతూ నాలుగేళ్ల కాలం ముగించేశారు. కనీసం సర్పంచి స్థాయిలో స్వతంత్రంగా సమావేశాలు కూడా జరపడానికి వీళ్లేని పరిస్థితి కొనసాగుతోంది.

**కలగానే ప్రత్యేక నిధులు**

కొత్తగా ఏర్పాటయ్యే గిరిజన పంచాయతీలకు ప్రత్యేక నిధులన్నారు. దాదాపుగా పాలకవర్గాల పదవీకాలం ముగిసే సమయం వస్తున్నా ఇంతవరకు అదనంగా ఇచ్చిన నిధులు ఏమీలేవని సర్పంచుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. గోరంట్ల మండలంలో నాలుగు కొత్తపంచాయతీలు ఏర్పడ్డాయి. అందులో గడ్డంతండా, కరావులపల్లితండా పంచాయతీలకు ఇంతవరకు పంచాయతీ భవనాలు లేవు. వీటిని పక్కసచివాలయకు విలీనం చేశారు. అలాగే వానవోలుతండా, పుట్టగుండ్లపల్లి పంచాయతీలకు సచివాలయాలు మంజూరైన నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో నాలుగు కొత్తపంచాయతీల పరిస్థితి అలాగే ఉంది.

**ఒక్క గదీ నిర్మించలేదు- రమాదేవిబాయి, కరావులపల్లితండా సర్పంచి**

కొత్తగా ఏర్పడిన పంచాయతీకి మొదటి సర్పంచిగా ఎన్నికయ్యానని ఆనందపడ్డాను. ఇంతవరకు కూర్చోవడానికి సీటులేని పరిస్థితి. నాలుగేళ్ల కాలం గడిచిపోయింది. కనీసం ఒక గది నిర్మించి కార్యాలయం ఏర్పాటుచేసిన బాగుండేది.

**ప్రతిపాదనలు పంపాం - సమత, శ్రీసత్యసాయి జిల్లా పంచాయతీ అధికారి**

కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు భవనాలు నిర్మించాలని పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాం. వీటికి భవనాల కొరత ఉంది. మిగిలిన నిధులు అన్నింటితో సమానంగా వస్తున్నాయి.

# పేదల కాలనీలు.. పెద్దల పెత్తనం

నంద్యాల : పేదలందరికీ ఇల్లు.. ఇళ్లు కాదూ ఊళ్లు నిర్మిస్తున్నామని ఐదేళ్లు జగన్నాటకం ఆడారు. కాలనీల పేరుతో భూసేకరణలో భారీఎత్తున ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారు. రహదారులు, మంచినీటి వనరుల కల్పన, విద్యుద్దీకరణ పేరుతో నిధులు దోపిడీకి పాల్పడ్డారు. జగనన్న కాలనీలో ఇటీవల విజిలెన్సు అధికారులు తనిఖీలు చేయగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఖర్చు చేసిన నిధులు.. క్షేత్రస్థాయిలో జరిగిన పనులకు భారీగా వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జగనన్న కాలనీల్లో ఆయా కాలనీల్లో నీటి సరఫరాకు రూ.20.10 కోట్లు కేటాయించారు. రూ.18.64 కోట్ల వరకు చెల్లింపులు పూర్తయ్యాయి. 344 కాలనీలో విద్యుద్దీకరణ పనులు చేపట్టారు. అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.47 కోట్లు ఖర్చు



చేశారు. చాలా చోట్ల వైకాపా నేతలే పనులు చేపట్టారు.

**ఎక్కడెక్కడ తనిఖీ చేశారంటే**

నందికొట్కూరు, వెలుగోడు, ఆత్మకూరు, డోన్, కోడుమూరు, పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు మండలాల్లో పలు కాలనీలను పరిశీలించారు. అక్కడ లబ్ధిదారులతో మాట్లాడారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్న వారు ఎందరు? థర్డ్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్ని నిర్మించారో ఆరా తీశారు. ఉపాధి హామీ నిధులతో రోడ్లు వేశారు.. మట్టి ఎక్కడికెళ్లి తెచ్చారు.. ఎన్ని మీటర్లు వేశారు.. పని చేపట్టింది ఎవరో వివరాలు సేకరించారు. ఎర్రమఠం, గుమ్మడాపురం, ముసలిమడుగు, గువ్వలకుంట్ల, నందికుంట, గాజులపల్లె, మహానంది, చాపిరేవుల, బిలకలగూడూరు తదితర గ్రామాల్లో రోడ్ల నాణ్యతను పరిశీలించారు. కొలతలూ తీసుకొన్నారు. వివిధ కంపెనీల ద్వారా సరఫరా చేసిన ఉక్కు, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రిని తనిఖీ చేశారు.

ఉమ్మడి జిల్లాలో లేఅవుట్ల సంఖ్య: 497

లేఅవుట్లలో ప్రారంభమైన ఇళ్లు: 33,231

# పేదింట అభివృద్ధి పంట

నంద్యాల : పేదరిక నిర్మూలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్తోంది. స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళికలో భాగంగా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వ- ప్రైవేటు- ప్రజల భాగస్వామ్యం (పీ4) విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో నియోజకవర్గాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 22 లక్షల జనాభా ఉండగా 1.82 లక్షల మంది పేదలు నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, డోన్, బేతంచెర్ల, బనగానపల్లి ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. మరో 2.58 మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. సున్నా శాతం పేదరికం, ఉద్యోగాల సృష్టి, నైపుణ్యం పెంపు, రైతు సాధికారత, తాగునీటి రక్షణ, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, స్వచ్ఛ ఏపీ, మానవ వనరుల వినియోగం, శక్తి వనరుల నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం పెంపు అనే పది సూత్రాల అనుసంధానంతో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించనున్నారు. ఉగాది నుంచి పేదరిక నిర్మూలన ప్రాజెక్టును అమలు చేయాలని నిర్ణయించారు.

**ఊరిలోనే ఉపాధి**

జిల్లాలోని 124 చిన్న నీటి వనరులు, నాలుగు జలాశయాల్లో పేదల ద్వారా చేపల పెంపకం చేపడతారు. పెంచిన చేపలను హైదరాబాద్, పశ్చిమబెంగాల్ వంటి ప్రాంతాలకు ఎగుమతి చేయడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

ఉపాధిహామీ పథకం కింద 77 లక్షల పనిదినాలు కల్పించనున్నారు. కూలీలకు రోజుకు చెల్లించే వేతనం మొదట రూ.280 తర్వాత రూ.300 గిట్టుబాటయ్యేలా చర్యలు తీసుకుంటారు.

17 చెంచు గూడేల్లోని చెంచులకు ఉపాధి చూపేందుకు ఐటీడీఏ



సహకారంతో 100 ఎకరాల్లో నన్నారి సాగు చేయించాలని లక్ష్యం పెట్టుకున్నారు. రైతుల భాగస్వామ్యంతో డ్రాగన్ ఫ్రూట్, పచ్చి ఖర్జూర, పూల తోటలు, ఇతర వాణిజ్య పంటలను సాగు చేయిస్తారు.

పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక చొరవ

జిల్లాలో సుమారు 2 లక్షల మంది ధనవంతులు ఉన్నారు. వీరి ద్వారా క్షేత్రస్థాయి నుంచి వ్యక్తిగత, సమాజాభివృద్ధి సాధించేందుకు పీ4 ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో పది భారీ, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయి. వీటితో పాటు ధనవంతుల సాయంతో ప్రత్యేకంగా మరికొన్ని పరిశ్రమల ను ఏర్పాటు చేయించనున్నారు. ఎన్‌ఆర్‌ఐల తోడ్పాటుతో వివిధ పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకోనున్నారు. ఎంఎస్‌ఎంఈ యూనిట్లను అధికంగా ఏర్పాటు చేస్తారు.

నిరుద్యోగ యువతకు ఆసక్తి కలిగిన రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నారు. 158 క్వారీలు, గనుల్లో మైనింగ్ జరిగేలా చూడడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు పీ4 ప్రణాళిక అమలు, పర్యవేక్షణకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు ఏడుగురు ప్రత్యేక అధికారులను నియమించనున్నారు. వారి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి నుంచి సంపూర్ణ సమాచారం సేకరించను న్నారు. నియోజకవర్గ కార్యాచరణ ప్రణాళికలు వీరి నేతృత్వంలోనే అమలు కానున్నాయి. ప్రత్యేక అధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది ఇందులో భాగస్వాములు కానున్నారు.

## బుల్లితెర నటి.. చీరలో హీటెక్కించే అందం!

టెలివిజన్ స్క్రీన్ మీద ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకున్న నటీమణుల్లో జ్యోతి పూర్వాజ్ ఒకరు. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన అమ్మడు తెలుగు ప్రేక్షకులకు బుల్లితెర ద్వారా జనాలకు పరిచయమైంది. గుప్పెడంత మనసు సీరియల్‌లో జగతి మేడమ్ పాత్ర పోషించి యావత్తు టీవీ ప్రేక్షకులను తన వైపు తిప్పుకుంది. తక్కువ కాలంలోనే భారీ ఫాలోయింగ్ సంపాదించుకున్న ఈ బ్యూటీ, సీరియల్‌తోనే కాకుండా వెబ్ సిరీస్, సినిమాల వైపూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. అంతే కాదు, సీరియల్స్‌లో సంపాదించిన క్రేజ్‌ను మెయిన్ స్ట్రీమ్ సినిమాల్లో తనకు ఓ ప్రత్యేకమైన ప్లేస్ సంపాదించుకోవడానికి ఉపయోగించుకుంటోంది. భర్త పూర్వాజ్ దర్శకత్వంలో వచ్చిన శుక్ర, మాటరాని మౌనమిది చిత్రాల్లో నటించి తన రేంజ్ చూపించింది. తన ఫ్యామిలీ లైఫ్‌ను బ్యాలెన్స్ చేసుకుంటూనే కెరీర్‌లో ముందుకు సాగుతోంది. పెళ్లి తర్వాత కెరీర్ స్లో అవుతుందనే



భయాలను కాదనుకుని, మరింత బోల్డ్‌గా తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ ఫ్యాన్స్‌కు ఎప్పటికప్పుడు గ్లామరస్ ట్రీట్స్ ఇస్తోంది. ఇప్పుడు లేటెస్ట్ గా ఆమె షేర్ చేసిన ఈ లేటెస్ట్ పిక్ సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో వైరల్ అవుతోంది. పార్కింగ్ ఏరియాలో కార్ దగ్గర స్టైలిష్ లుక్‌లో స్టిల్స్ ఇచ్చిన జ్యోతి, అందంగా ఉండటమే కాదు, మోడరన్ అండ్ ట్రెడిషనల్ మిక్స్‌లో ఎట్రాక్ట్ చేసేలా ఫోజు ఇచ్చింది. లైట్ బ్లూ కలర్ శారీ, అందంగా మెరిసే పచ్చటి బ్లౌజ్‌లో ఆమె సింప్లిసిటీతో కూడిన హొయలు చూపించేసింది. చేతిలో కీ హోల్డర్ పట్టుకుని, అటు కార్ వైపు వాలి స్టన్నింగ్ లుక్ ఇచ్చిన స్టైల్ అందరినీ ఇంప్రెస్ చేసింది. మరీ ముఖ్యంగా, ఆమె ఇచ్చిన క్యాప్షన్ %-% "ఇది గమనించబడటం గురించి కాదు, గుర్తుంచుకోవడం గురించి." అంటూ చెప్పిన విధానం అభిమానులను ఫిదా అయ్యేలా చేసింది. ఫ్యాన్స్ జ్యోతి లుక్స్‌పై సూపర్ రెస్పాన్స్ ఇస్తున్నారు. "జగతి మేడమ్.. ఈ స్టిల్ స్టన్నింగ్" అంటూ కామెంట్లు పెడుతున్నారు.

## రష్మిక మళ్లీ ఉల్లాసంగా ఉత్సాహంగా!

సినిమా ప్రచారమంటే కొందరు హీరోయిన్లు ఎలా స్కిప్ కొట్టాలా? అని చూస్తుంటారు. ఆ ఛాన్స్ ఏ రూపంలో వస్తుందా? ఎస్కేప్ అయిపోదామా? అని చూస్తుంటారు. తమ పార్ట్ షూటింగ్ పూర్తయిన తర్వాత పారితో షికం తీసుకుని చెక్కేయాలనే చూస్తుంటారు. చాలా కొద్ది మంది మాత్రమే సినిమా మొదలు నుంచి రిలీజ్ వరకూ ఎరకూ అంకిత భావంతో పనిచేస్తుంటారు. ప్రచార సమయంలో దర్శక, నిర్మాతలకు తమ వంతు సహకారం అందిస్తుంటారు. అలాంటి వాళ్లలో ముందున్నది ఎవరు? అంటే నేషనల్ క్రష్ రష్మికా మందన్నా అనడంలో ఎలాంటి సందేహం లేదు. రష్మిక సినిమాలో హీరోయిన్ అయినా రిలీజ్ వరకూ ప్రచారాన్ని కూడా తన భుజాలపై వేసుకుని మోస్తుంది.



సినిమాని జనాల్లోకి వెళ్లేలా తన వంతు ప్రయత్నం చేస్తుంటుంది. ఇటీవల రిలీజ్ అయిన 'ఛావా' ప్రచారానికి ఎలాంటి స్టేజ్ లో వచ్చిందో తెలిసిందే. నడవలేని పరిస్థితుల్లో ఉన్నా..వీల్ చైర్ కి అంకితమైనా? 'ఛావా' సినిమాని దగ్గరుండి ప్రమోట్ చేయాలనే కృత నిశ్చయంతో వీల్ చైర్ లోనే ప్రచార కార్యక్రమానికి హాజరైంది. అప్పుడే మరోసారి ప్రచారం విషయం లో రష్మిక ఎంత కమిట్ మెంట్ తో ఉంటుందన్నది అర్దమైంది. ఈ నేపథ్యంలో రష్మిక నంటిచన 'సికిందర్' కూడా రిలీజ్ కి రెడీ అవుతుంది. ఇటీవల ముంబైలో 'సికిందర్' నుండి ఒక కొత్త పాట లాంచ్ సందర్భంగా కనిపించింది. దీంతో వచ్చే వారం నుంచి రష్మిక 'సికిందర్' రిలీజ్ అయ్యే వరకూ ప్రచారం పనుల్లోనే నిమగ్నమవుతుందని తెలుస్తోంది. అన్ని ఇంటర్వ్యూలు, ఈవెంట్‌లు , ఇతర ప్రచార కార్యక్రమాలలో పాల్గొంటుంది. 'ఛావా' తర్వాత మళ్లీ వెంటనే బాలీవుడ్ మీడియా ముందుకు వెళ్లడం కోసం రష్మిక కూడా అంతే ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తోంది.




## సూర్య రెట్రో కొట్టి తీరాల్సిందే..?




కంగువ తర్వాత కోలీవుడ్ హీరో సూర్య చేస్తున్న సినిమా రెట్రో. కార్తీక్ సుబ్బరాజ్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ టీజర్ తోనే సినిమాపై అంచనాలు పెంచారు. కొన్నాళ్లుగా సూర్య మాస్ సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. అందుకే రెట్రో సినిమాతో మరోసారి తన యాక్షన్ మోడ్ ని చూపించబోతున్నారు. కంగువ నిరాశపరచడంతో సూర్య ఫ్యాన్స్ అంతా కూడా రెట్రో మీద చాలా హోప్స్ పెట్టుకున్నారు. కోలీవుడ్ టాలెంటెడ్ డైరెక్టర్ అయిన కార్తీక్ సుబ్బరాజ్ తో సూర్య సినిమా అనగానే మూవీపై అంచనాలు నెక్స్ట్ లెవెల్ లో ఏర్పడ్డాయి. ముఖ్యంగా సూర్య ని వింటేజ్ లుక్ తో చూపిస్తూ చేస్తున్న రెట్రో మీఅ సూర్య ఫ్యాన్స్ చాలా హోప్స్ పెట్టుకున్నారు. ఈ సినిమా టీజర్ ఇంప్రెస్ చేయగా సినిమా కూడా అంచనాలకు తగినట్టే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ సినిమాలో సూర్య సరసన పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తుంది. సూర్యతో తొలిసారి జత కడుతుంది. పూజా హెగ్డే సినిమాలో ఉంటే గ్లామర్ విషయంలో డౌట్ పడాల్సిన అవసరం లేదు. అమ్మడి గ్లామర్ కూడా సినిమాకు హెల్ప్ అవుతుంది. రెట్రోలో పూజా హెగ్డే డీ గ్లామర్ లుక్స్ తో కనిపించనున్నారని తెలుస్తుంది. సూర్య, పూజా హెగ్డే జోడీ కూడా సినిమాలో హైలెట్ గా ఉంటుందని అంటున్నారు. ఈ సినిమా విషయంలో సూర్య చాలా ఫోకస్ తో పనిచేస్తున్నారు. ఎలాగైనా హిట్ కొట్టాలనే కసితో పనిచేస్తున్నాడు. ఈ సినిమాను తమిళ్ తో పాటు తెలుగులో కూడా మే 1న రిలీజ్ కాబోతుంది. ఐతే మే 1న నాని హిట్ 3 కూడా రిలీజ్ అవుతుంది. నాని హిట్ 3 కి సూర్య రెట్రో గట్టి పోటీ ఇస్తుందా లేదా అన్నది చూడాలి. సూర్య రెట్రో పై ఆ హీరో ఫ్యాన్స్ కూడా చాలా హోప్స్ పెట్టుకున్నారు.

విక్రం సినిమాలో సూర్య రోలెక్స్ పాత్రలో కొద్దిసేపు యాక్షన్ మోడ్ లో కనిపిస్తేనే ఫ్యాన్స్ ఫ్యూజులు అవుట్ అయ్యాయి. ఇక రెట్రో సినిమాలో ఫుల్ లెంగ్త్ మాస్ రోల్ లో సూర్య అదరగొట్టనున్నాడు. సూర్య కార్తీక్ సుబ్బరాజ్ ఇద్దరు కలిసి ఫ్యాన్స్ కి మాస్ ట్రీట్ ఇవ్వాలని చూస్తున్నారు. మరి సూర్య అనుకునే రేంజ్ హిట్ ఈ సినిమా అందుకుంటుందా లేదా అన్నది చూడాలి.

## పెళ్లి తర్వాత చైతూ, శోభిత ఫస్ట్ టైమ్..!





నాగ చైతన్య, శోభితల జోడీ మోస్ట్ బ్యూటీఫుల్ జోడీ అంటూ సోషల్ మీడియాలో వారి ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా సోషల్ మీడియాలో వీరిద్దరు కలిసి ఉన్న ఫోటోలు మరోసారి వైరల్ అవుతున్నాయి. అయితే ఈసారి జంటగా ఒక ప్రముఖ మ్యాగజైన్ కవర్ పై కనిపించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ప్రముఖ వోగ్ మ్యాగజైన్ కవర్ పై నాగ చైతన్య, శోభితల జోడీ కన్నుల విందు చేసింది.

సింపుల్ అండ్ స్వీట్ లుక్‌లో నాగ చైతన్య కనిపించగా, శోభిత కాస్త సెలబ్రెటీ లుక్‌తో చూపరుల దృష్టిని ఆకర్షించింది. మొత్తానికి చైతూ, శోభితల ఫోటో షూట్ నెట్టింట అందరి దృష్టిని ఆకర్షించడంతో పాటు, కొత్త జంటకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. పెళ్లి తర్వాత నాగ చైతన్య, శోభిత కలిసి మొదటి సారి మ్యాగజైన్‌కి ఫోటో షూట్ ఇచ్చారు. ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సెలబ్రెటీ భార్య భర్తల ఫోటోలు ఎప్పుడైనా సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి. అయితే వోగ్ మ్యాగజైన్ కోసం తీసుకున్న ఫోటోలు కావడంతో ఈ ఫోటోలు మరింత వైరల్ అవుతున్నాయి. వోగ్ మ్యాగజైన్‌కి ఫోటో షూట్ ఇవ్వడం మాత్రమే కాకుండా ప్రత్యేక ఇంటర్వ్యూ ని సైతం ఈ జంట ఇచ్చారు. పెళ్లి తర్వాత మొదటి సారి ఈ జంట కలిసి ఇంటర్వ్యూ ఇవ్వడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. పెళ్లికి ముందు పరిస్థితులు పెళ్లి తర్వాత పరిస్థితుల గురించి వీరిద్దరు ఇంటర్వ్యూలో పంచుకున్నారు. నాగ చైతన్య, శోభిత వారి పెళ్లి గురించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ ప్రేమకు మాతృభాష, సినిమా కెరీర్ అడ్డు కాలేదన్నారు. తమ ప్రేమ కథ చాలా సహజంగా జరిగిందన్నారు. ప్రతి విషయాన్ని చర్చించుకుని నిర్ణయించుకుంటున్నామని అన్నారు. కుటుంబ సభ్యులం అందరం కలిసి భోజనం చేయడం, ఎక్కువ సమయం గడుపుతున్నట్లు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం తాము ఇద్దరం సంతోషకరమైన జీవితాన్ని సాగిస్తున్నామని చెప్పుకొచ్చారు. నాలుగు, ఐదు నెలలు కొత్త ప్రాజెక్ట్‌లకు వెళ్లే ఆలోచన లేదు అన్నట్లు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఇద్దరం సమయం దొరికితే సంతోషంగా సమయాన్ని గడిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. మేము ఇద్దరం ముందు ముందు పెద్ద ప్రాజెక్ట్‌లతో బిజీ కాబోతున్నామని తెలియజేశారు.

## రష్మికను అందుకోవడం మిగిలిన వారికి కష్టమే

కిరిక్ పార్టీ సినిమాతో కెరీర్ ను మొదలుపెట్టిన రష్మిక అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగింది. టాలీవుడ్ లోని స్టార్ హీరోలందరితో కలిసి నటించిన రష్మిక నేషనల్ క్రష్ గా మారి దేశమంతా తన గురించి మాట్లాడుకునేలా చేసింది. తన అందం, నటనతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్న రష్మిక అశేషమైన క్రేజ్ ను సొంతం చేసుకుంది. నేషనల్ వైడ్ లో ప్రస్తుతం రష్మికకు ఉన్న క్రేజ్ మరే హీరోయిన్ కు లేదు. అమ్మడు ఈ మధ్య పట్టిందల్లా బంగారమే అవుతుంది. తాను నటించిన ప్రతీ సినిమా ఎంతో క్రేజ్ తెచ్చుకోవడంతో పాటూ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తున్నాయి. అందుకే ఇప్పుడు



రష్మిక అందరికీ లక్కీ హీరోయిన్ గా మారిపోయింది. ప్రస్తుతం రష్మిక ఇండియన్ సినిమా క్వీన్ గా ఓ వెలుగు వెలుగుతోంది. రష్మిక ఏ ముహూర్తాన పుష్ప సినిమా చేసిందో కానీ ఆ సినిమా తర్వాత నుంచి తన కెరీర్ గ్రాఫ్ అమాంతం పెరిగిపోయింది. పుష్ప నేషనల్ వైడ్ సక్సెస్ అయింది. ఆ తర్వాత బాలీవుడ్ లో చేసిన యానిమల్ మూవీ కూడా బాక్సాఫీస్ వద్ద వండర్స్ సృష్టించింది. ఇక పుష్ప2 గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. బ్యాక్ టు బ్యాక్ సక్సెస్ లతో దూసుకెళున్న రష్మిక రీసెంట్ గా బాలీవుడ్ లో చేసిన ఛావా సినిమా కూడా భారీ బ్లాక్ బస్టర్ గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే రష్మిక నుంచి తర్వాత రాబోయే సినిమాలపై బజ్ అమాంతం పెరిగిపోయింది. బ్యాక్ టు బ్యాక్ సక్సెస్ లతో దూసుకెళ్తున్న రష్మిక నుంచి త్వరలోనే సికిందర్ మూవీ వస్తోంది. సల్మాన్ ఖాన్ హీరోగా మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాకు రష్మిక సెంటిమెంట్ కలిసొస్తుందని సల్మాన్ ఫ్యాన్స్ భావిస్తున్నారు. సికిందర్ తో పాటూ రష్మిక చేతిలో పలు ప్రాజెక్టులున్నాయి. వాటిలో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున కీలక పాత్రల్లో తెరకెక్కుతున్న కుబేర ఒకటి. అది కాకుండా రష్మిక ప్రధాన పాత్రలో నటించిన గర్ల్‌ఫ్రెండ్ మూవీ రిలీజ్ కు రెడీ అవుతోంది. దాంతో పాటూ రెయిన్ బో అనే సినిమాలో కూడా రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే రష్మిక ఫేమ్, కెరీర్, క్రేజ్ ను చూసి మిగతా హీరోయిన్లు అసూయ పడే స్థాయిలో ఇప్పుడామె ఉంది. చూస్తుంటే ఇప్పట్లో రష్మిక స్థాయిని అందుకోవడం మిగిలిన వారికి కష్టమే అనిపిస్తోంది.

## కీర్తి సురేష్.. ఈసారి మరింత రొమాన్స్

తెలుగు సినీ ప్రియులకు జెట్ స్పీడ్ లో దగ్గరైన స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్, గత కొంతకాలంగా తన కెరీర్‌ను భిన్నమైన ట్రాక్ లో హైలెట్ చేసుకుంటోంది. సౌత్‌లో పలు సక్సెస్‌ఫుల్ ప్రాజెక్టులు చేసిన తర్వాత, ఆమె బాలీవుడ్ వైపు అడుగులు వేస్తోంది. 'మహానటి' వంటి క్లాసిక్ హిట్ తర్వాత కీర్తి కెరీర్‌కు భారీ మార్పు వచ్చింది. ముఖ్యంగా, సౌత్ ఇండస్ట్రీలోనే కాకుండా ఇతర పరిశ్రమల్లోనూ తన పరిధిని విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం కీర్తి హిందీలో క్రేజీ ప్రాజెక్టులలో నటిస్తోంది. అందులో గత ఏడాది వచ్చిన 'బేబీ జాన్' అంతగా హిట్ కాలేదు, ఈ సినిమా అట్లీ నిర్మాణంలో తెరకెక్కిన ఈ సినిమా భారీ నష్టాలను మిగిల్చింది. మరోవైపు 'అక్క' అనే సినిమాలో నటిస్తోంది. ఇందులో రాధికా ఆప్టే, తను ఆజ్మి, దీప్తి సాల్వీలతో కలిసి ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ చిత్రం సౌత్ ఇండియన్ బ్యాక్‌డ్రాప్‌లో ఉన్న మహిళా గ్యాంగ్‌స్టర్స్ కథగా హైలెట్ అవుతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించి వచ్చిన టీజర్ కీర్తి పాత్రకు మంచి హైప్ క్రియేట్ చేసింది. ఇదిలా ఉంటే, కీర్తి ఇప్పుడు బాలీవుడ్‌లో



కొత్త కోణాన్ని ఎక్స్‌ప్లోర్ చేయడానికి సిద్ధమవుతోంది. రీసెంట్‌గా ఆమె ఒక రొమాంటిక్ కామెడీ సినిమాలో నటించేందుకు చర్చలు జరుపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. గతంలో ఆమె 'నేను శైలజ', 'నేను లోకల్', 'రంగ్‌దే' వంటి సినిమాల్లో లవబుల్ పాత్రలు పోషించి, ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు బాలీవుడ్‌లో కూడా అలాంటి ఫన్ అండ్ లైట్‌హార్టెడ్ పాత్రను చేయబోతోందని తెలుస్తోంది. సినిమా కథ, ఇతర నటీనటుల వివరాలు ఇంకా రివీల్ చేయలేదు కానీ, ఇది ఆమెకు హిందీ మార్కెట్‌లో మంచి అవకాశంగా మారవచ్చనే అంచనాలు ఉన్నాయి. గతంలో కంటే ఈసారి రొమాంటిక్ డోస్ కాస్త ఎక్కువగానే ఉంటుందట. కీర్తి కెరీర్‌లో లేటెస్ట్ మార్పులు చూస్తుంటే, ఆమె తెలుగులోనే కాకుండా తమిళం, హిందీలోనూ తన స్థాయిని పెంచుకోవడానికి కృషి చేస్తోంది. ప్రస్తుతం ఆమె చేతిలో మరోకొన్ని సౌత్ సినిమాలు కూడా ఉన్నాయి. సౌత్‌లో మంచి కమర్షియల్ సినిమాలే కాకుండా, కంటెంట్ బేస్డ్ ఫిల్మ్స్‌పై కూడా ఫోకస్ పెట్టింది. బాలీవుడ్‌లో తనకు సరైన స్థానం సంపాదించుకోవాలంటే, వరుసగా మంచి కథల్ని ఎంచుకోవడం ఎంతో ముఖ్యం. ఈ కొత్త ప్రయోగం కీర్తి సురేష్‌కి ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి. ఇప్పటికే బాలీవుడ్‌లో హిట్ హీరోయిన్ల మధ్య హెల్తీ కాంపిటేషన్ ఉంది. కానీ కీర్తి తన మల్టీ టాలెంటెడ్ పెర్ఫార్మెన్స్‌తో అక్కడ సక్సెస్ అవుతుందా అనే ప్రశ్నకు సమాధానం రాబోయే రోజుల్లో తెలుస్తుంది. మొత్తానికి, రొమాంటిక్ కామెడీతో బాలీవుడ్ ప్రేక్షకులకు కొత్త కీర్తిని పరిచయం చేసే ప్రయత్నం ఆమె చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536